గురువారం
25-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 05
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లెట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి : 94405 73343

పార్టీ కార్యక్రమంలో మార్పులు, చేర్పులు : సీపీఐ

కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి నగర్ (చండీగఢ్): ప్రపంచంలో, దేశంలో చోటుచేసుకున్న మార్పులకు అనుగుణంగా పార్టీ కార్యక్రమంలో మార్పులు, చేర్పులు చేయాలని చండీగఢ్‌లో జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ 25వ మహాసభ నిర్ణయించింది. పదేళ్ల క్రితం పుదుచ్చేరిలో జరిగిన జాతీయ 22వ మహాసభ కమ్యూనిస్టు అగ్రనేత ఏబీ బర్ధన్ నేతృత్వంలో రూపొందించిన పార్టీ కార్యక్రమాన్ని ఆమోదించింది. గత మూడు, నాలుగు సంవత్సరాలలో ప్రపంచవ్యాప్తంగా రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, సాంకేతికంగా అనేక మార్పులు సంభవించాయని మహాసభ అభిప్రాయపడినట్లు బుధవారం జరిగిన సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అనీరాజా వెల్లడించారు. అందుకు అనుగుణంగా పార్టీ కార్యక్రమంలో సవరణలు తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రస్తుతం మహాసభలో పార్టీ కార్యక్రమం కమిషన్ ఏర్పాటు జరుగుతుందని చెప్పారు. నిర్దిష్ట కాలంలోగా కార్యక్రమంలో అవసరమైన మార్పులను కమిషన్

- మిగతా 2 లో

నేడు నూతన జాతీయ సమితి ఎన్నిక

సీపీఐ జాతీయ 25వ మహాసభ చివరి రోజైన గురువారం నూతన జాతీయ సమితి ఎన్నిక జరుగుతుంది. తొలుత ఉదయం 11 గంటలకు సెంట్రల్ కంట్రోల్ కమిషన్‌ను, తర్వాత జాతీయ సమితిని మహాసభలో పాల్గొంటున్న ప్రతినిధులు ఎన్నుకుంటారు. అనంతరం జాతీయ కార్యవర్గం, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎన్నిక జరుగుతుంది.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను సహించేదిలేదు

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం: సీపీఐ

(చండీగఢ్ నుంచి ఏబీ కూన)

నవరత్నాల్లో భాగమైన ప్రభుత్వ రంగ సంస్థ విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ప్రయత్నాలను తక్షణమే ఆపాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండ్ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంతోమంది ఎమ్మెల్యేలు, ఎంపీల రాజీనామాలు... 32 మంది ప్రజల ప్రాణత్యాగాల ఫలితంగా ఏర్పాటైన విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే సహించేది లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు సీపీఐ 25వ జాతీయ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మహాసభలో ప్రవేశపెట్టారు. సీపీఐ కార్యదర్శి అనీ రాజా, కార్యవర్గ సభ్యులు గుల్జార్‌సింగ్ గోరియా మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో

- మిగతా 2 లో

విద్యుత్‌రంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకం
విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి: సీపీఐ 8 లో

ఏపీకి హోదా ఇవ్వాల్సిందే

సీపీఐ జాతీయ మహాసభ డిమాండ్
తీర్మానం ప్రవేశపెట్టిన జి.ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా వెంటనే ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 25వ జాతీయ మహాసభ తీర్మానం ఆమోదించింది. ఈనెల 21 నుంచి పంజాబ్ రాష్ట్రం చండీగఢ్‌లోని సురవరం సుధాకరరెడ్డి నగర్‌లో జరుగుతున్న సీపీఐ జాతీయ మహాసభల్లో ఏపీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య బుధవారం ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా... సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత రాష్ట్రం భారీ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడింది. రెవెన్యూలో పెద్ద భాగం కోల్పోయిన రాష్ట్రం వ్యవసాయం (35 శాతం), సేవారంగం (40 శాతం)పై ఆధారపడి ఉంది. పరిశ్రమలు కేవలం 20 శాతం మాత్రమే సహకరిస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు తీవ్ర వెనుకబాటుతనంలో ఉన్నాయి. అప్పులు ఇప్పటికే

- మిగతా 2 లో

దళితులపై అత్యాచారాలు అదుపుచేయాలి 8 లో

గ్రూప్-1 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రూప్-1 మెయిన్స్ ర్యాంకలపై హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. దీంతో గ్రూప్-1 ర్యాంకర్లకు భారీ ఊరట లభించింది. నియామకాలకు మార్గం సుగమమైంది. గ్రూప్-1 తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకలను రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం హైకోర్టు డివిజన్ బెచ్ విచారణ జరిపింది. 2011లో గ్రూప్-1 నిర్వహించారు. ఆ తర్వాత 2022లో నిర్వహిస్తే సుప్రీం కోర్టు

- మిగతా 2 లో

డీఎస్సీ అభ్యర్థులకు నేడు నియామకపత్రాలు

విశాలాంధ్ర - సచివాలయం: మెగా డీఎస్సీ విజేతలకు గురువారం ప్రభుత్వం నియామక పత్రాలు అందించబోతోంది. సచివాలయ సమీప ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని పండుగవాతావరణంలో నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. సబ్జెక్టుల వారీగా రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలచిన 16 మంది, ఆరుగురు ఇన్‌స్పైర్ విజేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేతులమీదుగా నియామక పత్రాలు అందజేస్తారు. మిగిలిన వారికి అధికారులు ఇచ్చేవిధంగా

- మిగతా 2 లో

నీట్‌లో 99.99 శాతం... విద్యార్థి ఆత్మహత్య

ముంబై: వైద్య విద్య అభ్యసించడం ఇష్టం లేక ఓ విద్యార్థి ప్రాణాలు తీసుకున్నాడు. నీట్‌లో 99.99 శాతం సాధించి... కళాశాల అడ్మిషన్ రోజే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. సూసైడ్ నోట్‌ను పోలీసులు గుర్తించారు. నవర్‌గావ్ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల విద్యార్థి ఇటీవల నీట్ యూజీ-2025లో 99.99 శాతం సాధించాడు. జాతీయస్థాయిలో 1475 ర్యాంకు దక్కించుకున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లోని కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సులో అడ్మిషన్ తీసుకోవాల్సి ఉంది. అక్కడికి వెళ్లేందుకు అంతా సిద్ధమవుతుం డగా... ఆ విద్యార్థి తన ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మున్నేరుకు మహర్దశ

రూ.525 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు

విశాలాంధ్ర - హైదరాబాద్: ఖమ్మం నగర ప్రజల వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి రూ.525.36 కోట్ల వ్యయంతో మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నగరం మధ్య నుంచి ప్రవహిస్తున్న మున్నేరు వాగు ప్రతి ఏటా వర్షాకాలంలో ఉధృతంగా పొంగిపొర్లుతూ పరిసర ప్రాంతాల ఇళ్లు, వర్తక, వ్యాపార సంస్థలు, పంటలను ముంపునకు గురిచేస్తోంది. ప్రతిఏటా వందలాది కుటుంబాలు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడుతున్నారు. రోడ్లు , విద్యుత్ స్తంభాలు, సబ్ స్టేషన్లు, పాఠశాల భవనాలు, తాగునీటి పైపు లైన్లు , ఆరోగ్య కేంద్రాలు దెబ్బతింటున్నాయి. 2024లో మున్నేరుకు వచ్చిన ఆకస్మిక వరదల వల్ల రూ.757 కోట్లు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మున్నేరు వాగు రిటైనింగ్ వాల్ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 5,863 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన వాగులో గరిష్టంగా 10 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుంది. రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులను అదే ఏడాది మార్చిలో ప్రారంభించారు. మున్నేరు వాగుకు రెండు వైపుల మొత్తం 17 కిలోమీటర్లు పొడవున 10 నుంచి 15 మీటర్ల ఎత్తున రిటైనింగ్ వాల్‌తో

- మిగతా 2 లో

టీజీఎస్ ఆర్టీసీలో ఏఐ వినియోగం

హన్స ఈక్విటీ పార్టనర్స్ తోడ్పాటు
దేశంలోనే తొలిసారి ప్రజా రవాణా సంస్థలో వాడకం గర్వకారణం: సజ్జనార్

విశాలాంధ్ర– హైదరాబాద్ : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తమ సేవలను మరింత మెరుగు పరుచుకునేందుకు టీజీఎస్‌ఆర్టీసీ మరో ముందడుగు వేసింది. అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను విస్తృతంగా వినియోగించాలని నిర్ణయించింది. తమ ఉత్పాదకత పెంపు, సిబ్బంది పనితీరు, ఆరోగ్య స్థితి పర్యవేక్షణ, ఖర్చుల తగ్గింపు, రద్దీకి అనుగుణంగా సర్వీసుల ఏర్పాటుతో పాటు సేవలను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దడమే ప్రధాన ఉద్దేశం. దేశంలోనే తొలిసారిగా ఏఐ వినియోగించిన ప్రజా రవాణా సంస్థగా టీజీఎస్‌ఆర్టీసీ నిలిచింది. ఏఐ ప్రాజెక్టు అమలుకు హన్స ఈక్విటీ పార్టనర్స్ ఎల్ఎల్పీ అనే సంస్థ తోడ్పాటును అందిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, ప్రణాళికాబద్ధమైన అమలు వ్యూహాలను అందించి, అన్ని డిపోల్లో సులభంగా అమలు జరిగేలా ఆ సంస్థ సహకరిస్తోంది. సంస్థలో ఏఐ వినియోగం కోసం ఒక ప్రత్యేక టీంను యాజమాన్యం ఏర్పాటు చేసింది. సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి,

అవగాహన ఉన్న అధికారులను గుర్తించి... ఆ టీంలో ప్రాధాన్యం ఇచ్చింది. ఏఐ వాడకంపై ఆ టీంకు హన్స ఈక్విటీ పార్టనర్స్ శిక్షణ ఇస్తోంది. ఏఐ ప్రాజెక్టులో భాగంగా మొదట 40 వేల మంది సిబ్బంది ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తున్నారు. గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ లో భాగంగా ఉద్యోగులకు చేసిన వైద్య పరీక్షల ఆధారంగా ఆరోగ్య పరిస్థితిని ఏఐ, మెషిన్ లెర్నింగ్ సహకారంతో అంచనా వేస్తున్నారు. మొదట పైలట్ ప్రాజెక్ట్‌గా ఆరు డిపోల్లో అమలు చేయగా మంచి ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం అన్ని డిపోల్లోనూ ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. త్వరలోనే ఏఐ ద్వారా ఆటోమెటిక్ షెడ్యూలింగ్‌ను సంస్థ సిద్ధం చేస్తోంది. రోజు, తిథి, పండుగులు, వారాల్లో ఏఐ, మెషిన్ లెర్నింగ్ సహకారంతో ప్రయాణికుల రద్దీని అంచనా వేసి... ఆ మేరకు బస్సులను సంస్థ ఏర్పాటు చేయనుంది. ఏఐ ప్రాజెక్ట్ అమలుపై హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ ఉన్నతాధికారులు వివరించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఎండీ సజ్జనార్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఆధునిక రవాణా అవసరాలకు అనుగుణంగా,

- మిగతా 2 లో

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టుల మృతి

విశాలాంధ్ర–చింతూరు: జార్ఖండ్‌లోని గుమ్లాలో భద్రతా దళాల ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. అనంతరం భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. గుమ్లాలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో దాడి చేసిన భద్రతా దళాలు మావోయిస్టులను మట్టుపెట్టాయి. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. మృతిచెందిన మావోయిస్టులను నిషేధిత జార్ఖండ్ జన ముక్తి పరిషద్ (జేజేఎంపీ) సంస్థకు చెందిన వారిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతులను సబ్-జోనల్ కమాండర్లుగా పేర్కొన్నారు. మృతి చెందిన వారిలో రూ.5 లక్షల రివార్డున్న ఇద్దరు కమాండర్లు ఉన్నట్లు చెప్పారు. పోలీసులు, భద్రతా దళాలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వాళ్లు ఇద్దరు, మీరు వెళ్లరు ఈ అయిదేళ్లూ ఇంతే కదా?

లడ్డాఖ్‌లో ఎగిసిన హోదా ఉద్యమం

- రోడ్డెక్కిన యువత... హింసాత్మకంగా మారిన నిరసనలు
- లేహ్‌లో నిరసనకారులు, భద్రతా సిబ్బంది మధ్య తీవ్ర ఘర్షణలు
- పోలీసుల కాల్పుల్లో ఐదుగురి మృతి
- బీజేపీ కార్యాలయం, పోలీస్ వాహనాలకు నిప్పు
- బాష్పవాయువు ప్రయోగించిన భద్రతా బలగాలు

లేహ్: లడ్డాఖ్‌లో ప్రత్యేక రాష్ట్ర హోదా కోసం జరుగుతున్న శాంతియుత ఆందోళనలు హింసాత్మక రూపం దాల్చాయి. లేహ్ పట్టణంలో నిరసనకారులు, భద్రతా సిబ్బంది మధ్య జరిగిన తీవ్ర ఘర్షణల్లో నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 30మంది వరకు గాయాలపాలయ్యారు. కాగా పోలీస్

- మిగతా 2 లో

బీహార్‌కు కేంద్రం ఎన్నికల వరాలు

- రూ. 6 వేల కోట్ల రైల్వే, రహదారి ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- దేశవ్యాప్తంగా వైద్య విద్య సీట్ల పెంపు
- రైల్వే ఉద్యోగులకు 78 రోజుల జీతం బోనస్

8 లో

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌పై కేంద్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. రాష్ట్రంలో సుమారు రూ.6వేల కోట్ల విలువైన రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది.

విద్య, ఉద్యోగాల్లో ఈబీసీలకు రిజర్వేషన్

- బీహార్ ఎన్నికల వేళ కాంగ్రెస్ కీలక హామీ
- ఎస్ఐఆర్ ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ముప్పు
- అధికారం కోసమే 'ఓట్లచోరీ'
- ఇది బీజేపీ దుర్మార్గపు ఆలోచనల నుండి వచ్చిన కుట్ర
- సీడబ్ల్యూసీ నిశిత విమర్శ

2 లో

అవసరమైతే రష్యా విమానాలు కూల్చేస్తాం: ట్రంప్

న్యూయార్క్: ప్రపంచంలోని రెండు భారీ శక్తుల మధ్య వివాదం ముదురుతోంది. నాటో కూటమి దేశాల గగనతల సరిహద్దులను ఉల్లంఘించి రష్యా ఫైటర్ జెట్లు దూసుకురావడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. అవసరమైతే రష్యా విమానాలను కూల్చేస్తామన్నారు. ఆయన ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. ఆ తర్వాత ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ పై విధంగా స్పందించారు. ఇటీవల కాలంలో నాటో దేశాలైన పోలాండ్, ఎస్తోనియా సహా పలు నాటో సరిహద్దుల్లోకి రష్యా ఫైటర్‌జెట్లు చొరబడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ట్రంప్ రష్యా, ఉక్రెయిన్‌పై ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. ఉక్రెయిన్ 2014 నుంచి కోల్పోయిన తన భూభాగం మొత్తం తిరిగి పొందగలదని తాను అభిప్రాయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ యుద్ధం రష్యాను ఓ 'పేపర్ టైగర్'గా మార్చేసింది. ఈ యుద్ధం వల్ల దానికి భారీగా డబ్బు ఖర్చవుతోంది.. పెట్రోలియం విక్రయాలతో నిధుల సంపాదన కష్టంగా మారిందన్నారు. "సమయం, ఓపిక, ఐరోపా సమాఖ్య, ముఖ్యంగా నాటో మద్దతుతో ఉక్రెయిన్ తన భూభాగం తిరిగి పొందడం ఎందుకు సాధ్యం కాదు. అంతకుమించి కూడా పొందవచ్చేమో ఎవరికి తెలుసు. పుతిన్, రష్యా భారీ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయి. ఉక్రెయిన్ చేతలకు సమయం ఆసన్నమైంది" అని ఆ పోస్టులో హెచ్చరించారు. ట్రంప్ పోస్టు చేసిన కొద్దిసేపటికి అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో మాత్రం దీనికి భిన్నంగా స్పందించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని సైనిక చర్యలతో ముగించలేమన్నారు. కేవలం చర్చల ద్వారానే ఇది సాధ్యమని తెలిపారు. ఈ విషయాన్ని ఆయన ఐరాస భద్రతా మండలి సమావేశంలో పేర్కొన్నారు. "ఈ ప్రమాదకర సంక్షోభానికి శాంతియుత పరిష్కారం తీసుకొచ్చేందుకు అమెరికా అన్ని ప్రయత్నాలు చేస్తోందన్నారు.

బ్యాంకాక్‌లో కుంగిన రోడ్డు...

పరుగులు తీసిన జనం

బ్యాంకాక్: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో అత్యంత రద్దీగా ఉండే రహదారి ఒక్కసారిగా కుంగిపోయింది. ఆకస్మికంగా భారీ గుంత ఏర్పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సుమారు 30 మీటర్ల పొడవు, 15 మీటర్ల లోతు మేర రహదారి కుంగిపోయింది. ఈ ప్రమాదంలో మూడు కార్లు గుంతలో పడిపోయాయి, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కళ్లముందే రహదారి కుంగిపోవడంతో ప్రజలు భయాందోళనలతో అక్కడి నుంచి పరుగులు తీశారు. బ్యాంకాక్ గవర్నర్ ఈ ఘటనపై స్పందిస్తూ, ఈ భారీ గుంత కారణంగా మూడు వాహనాలు దెబ్బతిన్నాయని, అయితే ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. భూగర్భ రైలు స్టేషన్ నిర్మాణం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని అధికార వర్గాలను ఉటంకిస్తూ కథనాలు వెలువడ్డాయి. ఈ ఘటనపై అధికారులు విచారణకు ఆదేశించారు.

పశ్చిమదేశాలు భారత్‌తో కలిసి పనిచేయాలి: ఫిన్లాండ్

న్యూయార్క్: రష్యా, చైనాతో కలిపి భారత్‌ను చూడకూడదని ఫిన్లాండ్ అధ్యక్షుడు అలగ్జాండర్ స్టబ్ పశ్చిమ దేశాలకు సూచించారు. ఇండియా సూపర్ పవర్‌గా ఎదుగుతోందని... దానితో కలిసి పనిచేయాలన్నారు. బ్లూమ్‌బెర్గ్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్-రష్యా-చైనా మధ్య స్నేహం పెరగడంపై అడిగిన ప్రశ్నకు ఈ విధంగా స్పందించారు. "ఐరోపా సమాఖ్యకు భారత్ అత్యంత సన్నిహిత దేశం. అదే సమయంలో దానికి అమెరికాతో కూడా మంచి సంబంధాలున్నాయి. అందుకే దానిని చైనా, రష్యాతో కలిపి ఒకే గాటన కట్టకూడదు. అది ఎదుగుతున్న మహాశక్తి. దీనికి జనాభా, ఆర్థిక వ్యవస్థ రెండూ కలిసొచ్చాయి. అందుకే పశ్చిమ దేశాలు భారత్‌తో సఖ్యతగా ఉండటం, కలిసి పనిచేయడం అవసరమని నేను చెబుతుంటాను.ఇక చైనా-రష్యాకు ప్రత్యక్ష సంబంధాలున్నాయి. 1990 వరకు రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలు సమానంగా ఉన్నాయి. కానీ, ఇప్పుడు చైనా పదిరెట్లు పెద్దది. గ్యాస్, చమురు, సాంకేతిక మార్పిడిలతో రష్యాను యుద్ధాలు చేసేంతగా బలపర్చింది. ఇరు దేశాల మధ్య చాలా బలమైన సంబంధాలున్నాయి ఉన్నాయి" అని స్టబ్ గుర్తు చేశారు. స్టబ్ గతంలో కూడా భారత్‌కు మద్దతుగా ప్రకటనలు చేశారు.

భారత్ మద్దతు మాకే: జెలెన్‌స్కీ

కీవ్: రష్యాతో జరుగుతున్న యుద్ధంలో భారత్ ఎక్కువగా ఉక్రెయిన్‌వైపే నిలిచిందంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో భారత ఇంధనపరమైన సంక్లిష్టతలను అర్థం చేసుకోగలనని ఆయన చెప్పారు.ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల కోసం న్యూయార్క్ వెళ్లిన ఆయన ఓ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాలను వెల్లడించారు. రష్యాతో భారత ఇంధన ఒప్పందం సమస్యగా మారినప్పటికీ దీనిని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పరిష్కరించగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకొనే విషయంలో న్యూఢిల్లీ తన విధానాన్ని మార్చుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఐరోపా దేశాలకు భారత్‌తో బలమైన సంబంధాలు ఉన్నాయని చెబుతూ... ఉక్రెయిన్ కూడా ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అయితే భారత్‌లా చైనా తమకు మద్దతిస్తుందని చెప్పలేమని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. రష్యాతో జరుగుతున్న యుద్ధం ముగియడం వల్ల తమకు ఎలాంటి ప్రయోజనం లేదని చైనా భావించడమే ఇందుకు కారణమన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి భారత్, చైనాలు నిధులు సమకూరుస్తున్నాయని ఐరాస వేదికపై ట్రంప్ ఆరోపించిన నేపథ్యంలో జెలెన్‌స్కీ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

పార్టీ కార్యక్రమంలో మార్పులు, చేర్పులు

(మొదటిపేజీ తరువాయి)

సూచిస్తుందని, దానిపై తదుపరి మహాసభ నిర్ణయం తీసుకుంటుందని అన్నారు.

ముసాయిదాలపై కమిషన్ల విస్తృత చర్చ

మహాసభలో ప్రవేశపెట్టిన రాజకీయ ముసాయిదా తీర్మానం, నిర్మాణ నివేదిక, రాజకీయ సమీక్ష నివేదికపై ఏర్పాటైన మూడు కమిషన్లు... వాటిపై వచ్చిన సవరణ మీద బుధవారం లోతుగా చర్చించాయి. రాజకీయ ముసాయిదా తీర్మానంపై ఏర్పాటు చేసిన కమిషన్‌కు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నిర్మాణ నివేదిక కమిషన్‌కు కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాజకీయ సమీక్ష నివేదిక కమిషన్‌కు కార్యదర్శి బాలచంద్ర కాంగో కన్వీనర్లుగా వ్యవహరించారు. చర్చ అనంతరం నివేదికలను ప్రతినిధుల సభ ముందు ఉంచారు. అలాగే సభ ముందుంచిన సెంట్రల్ కంట్రోల్ కమిషన్, ఆడిట్ కమిషన్ నివేదికలను మహాసభ ఆమోదించింది.

గ్రూప్-1 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

రద్దు చేసింది. 14 ఏళ్ల తర్వాత గ్రూప్-1 నియామకాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ప్రక్రియను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. తెలుగులో మెయిన్స్ జవాబులు రాసిన వారిపట్ల పక్షపాతం చూపించారనడానికి ఎలాంటి ఆధారాలు లేవని కోర్టుకు ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గ్రూప్-1 పోస్టులు భర్తీ కాలేదా... 2014 నుంచి అసలు గ్రూప్-1 నియామకాలు జరగలేదా అని హైకోర్టు ప్రశ్నించింది. అసలు 2014 నుంచి టీజీపీఎస్సీ ఉనికిలో ఉందా అని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్ ప్రశ్నించారు. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. గ్రూప్-1 ర్యాంకర్లకు ఊరటనిస్తూ నియామకాలు జరుపుకో వచ్చునని... అయితే, ఆ నియామకాలు తుది తీర్పునకు లోబడే ఉండాలని బోర్డుకు సీజే జస్టిస్ ఏకే సింగ్ స్పష్టం చేశారు. తదుపరి విచారణను అక్టోబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను సహించేదిలేదు

(మొదటిపేజీ తరువాయి)

తీర్మానాలను విడుదల చేశారు. స్వావలంబనకు విశాఖ ఉక్కు ఓ సంకేతం. జాతి గర్వించదగ్గ ఫ్యాక్టరీ ఇది. భారత జీడీపీలో 50 వేల కోట్ల రూపాయల నిలకడైన వనరుగా ఇది నిలబడింది. ఈ ఫ్యాక్టరీ ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నది. 2021 జనవరి 27వ తేదీన ఆర్ఐఎన్ఎల్‌లో 100 శాతం వ్యూహాత్మక అమ్మకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆనాటి నుంచి ప్రభుత్వం విశాఖ ప్లాంట్‌కు ముడిసరుకు నిలిపివేయడం, ఉత్పత్తిస్థాయిలు కుదించడం వంటి చర్యలకు పాల్పడుతున్నది. అలాగే వివిధ పద్ధతుల ద్వారా ఉద్యోగులకు లేఆఫ్ ఇవ్వడం మొదలుపెట్టింది. దాదాపు 5000 మంది కార్మికులను ఇప్పటివరకు లేఆఫ్ ఇచ్చింది. గత ఆరు మాసాలుగా రెగ్యులర్ ఉద్యోగులకు సైతం సగం సగం జీతాలు ఇస్తున్నది. ఇప్పటికే ఉక్కు కర్మాగారంలోని 34 సెక్షన్లను ప్రైవేటువారికి అప్పగించడానికి సిద్ధమైంది. విశాఖ ఉక్కు పరిరక్షణకు సీపీఐ మొదట్నించీ కట్టుబడి ఉంది. ఇకముందు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తామని సీపీఐ స్పష్టం చేసింది. ప్రైవేటీకరణ యత్నాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

విశాఖపట్నం సమగ్ర అభివృద్ధితోనే ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందని అనుబంధ తీర్మానాన్ని సీపీఐ ఆమోదించింది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో అతిపెద్ద నగరంగా విశాఖపట్నం ఆవిర్భవించింది. 26 లక్షల జనాభాతో ఏపీలో అతిచిన్న జిల్లాగా ఉంది. అయితే అభివృద్ధిలో మాత్రం వెనుకబాటు కొనసాగుతోంది. పేరుకే ఆర్థిక రాజధాని తప్ప నేతిబీరకాయ చందంగా మారింది. విశాఖ అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికలంటూ ఏమీ లేకుండా పోయాయి. నగర నడిబొడ్డున మురికివాడలు పెరిగిపోతున్నాయి. పారిశుధ్యం అధ్వానంగా ఉంది. విశాఖ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందడం లేదు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు పెరగడం లేదు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటులోనూ పురోగతి లేదు. పేదలకు ఇవ్వాల్సిన వేలాది టిడ్కో ఇళ్లు ఖాళీగానే పడి ఉన్నాయి. నగరంలో నేరాలు పెరిగిపోతున్నాయి. శాంతిభద్రతల సమస్య తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో విశాఖ నగర సమస్యలపై పోరాటానికి సీపీఐ సిద్ధమైంది. విశాఖ అభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధం కావాల్సిందిగా సీపీఐ పిలుపునిచ్చింది.

లడ్డాఖ్‌లో ఎగిసిన హోదా ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

కాల్పుల్లోనే నలుగురు యువకులు మృతి చెందారని... గాయపడినవారి సంఖ్య ఇంకా ఎక్కువేనని ఆందోళనకారులు తెలిపారు. అయితే పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. కేంద్ర పాలిత ప్రాంతం లడ్డాఖ్‌లో బుధవారం తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. లడ్డాఖ్‌కు రాష్ట్ర హోదా ఇవ్వడంతో పాటు 6వ షెడ్యూల్ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ రాజధాని లేహ్‌లో వందలాదిమంది యువకులు వీధుల్లోకి వచ్చి పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. రోడ్లపైకి వచ్చిన వారిని చెదరగొట్టేందుకు వచ్చిన పోలీసులతో కొంతమంది ఆందోళనకారులు ఘర్షణకు దిగారు. అధికారులపై రాళ్లు రువ్వి, ఆ తర్వాత బీజేపీ కార్యాలయానికి, తర్వాత పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శాంతియుతంగా ప్రారంభమైన నిరసనలు కొద్దిసేపటికే ఉద్రిక్తంగా మారాయి. పోలీసులు, పారామిలటరీ బలగాలతో నిరసనకారులు ఘర్షణకు దిగారు. లద్దాఖ్‌కు పూర్తి రాష్ట్ర హోదా కల్పించాలంటూ పెద్దపెట్టున నినదించారు. లడ్డాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతూ లేహ్ ఎపెక్స్ బాడీ (ఎల్ఏబీ) యువజన విభాగానికి చెందిన 15 మంది యువత సెప్టెంబర్ 10 నుంచి 35 రోజుల నిరహార దీక్షకు దిగారు. వారిలో ఇద్దరి పరిస్థితి క్షీణించడంతో మంగళవారం సాయంత్రం ఆస్పత్రికి తరలించారు. దీంతో ఎల్ఏబీ యువజన విభాగం బుధవారం బంద్, నిరసనకు పిలుపునిచ్చింది. వందలాది యువత వీధుల్లోకి వచ్చి నిరసనలు చేశారు. వారిని చెదరగొట్టేందుకు వచ్చిన పోలీసులతో ఘర్షణకు దిగారు. ఆగ్రహానికి గురైన ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు రువ్వారు. శాంతించని నిరసనకారులు బీజేపీ కార్యాలయంపై దాడి చేసి నిప్పు పెట్టారు. ఈ ఘర్షణల్లో ఓ పోలీసు వాహనాన్ని కూడా తగులబెట్టారు. వారిని కట్టడి చేసేందుకు పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు అదనపు బలగాలను మోహరించారు. నిరసన పిలుపుకు ప్రతిస్పందనగా పెద్ద సంఖ్యలో జనం ఎన్డీఎస్ స్మారక మైదానానికి చేరుకుని ఆ తర్వాత ఆరవ షెడ్యూల్, రాష్ట్ర హోదాకు మద్దతుగా నినాదాలు చేస్తూ పట్టణంలోని వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారని అధికారులు తెలిపారు. కొంతమంది యువకులు బీజేపీ, హిల్ కౌన్సిల్ ప్రధాన కార్యాలయంపై రాళ్ళు రువ్వడంతో పరిస్థితి మరింత దిగజారింది. పట్టణం అంతటా మోహరించిన పోలీసులు, పారామిలిటరీ దళాలు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి టియర్‌గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించాయని వివరించారు. అయితే లడ్డాఖ్‌లో ఇలాంటి పరిస్థితులు తలెత్తడం ఇదే తొలిసారి. ప్రజల డిమాండ్లపై చర్చించేందుకు లడ్డాఖ్ ప్రతినిధులు అక్టోబర్ 6న సమావేశానికి రావాలంటూ కేంద్రం ఆహ్వానించిన సమయంలో ఈ ఆందోళనలు చేపట్టారు. ఈ నిరాహార దీక్షకు ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ నేతృత్వం వహిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని ఎన్డీఏ ప్రభుత్వం 2019, ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లడ్డాఖ్ అని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. ఆ తర్వాత నుంచి లడ్డాఖ్ రాష్ట్రహోదా పునరుద్ధరణ కోసం ఎప్పటినుంచో డిమాండ్లు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే లడ్డాఖ్‌కు రాష్ట్రహోదా ఇవ్వడంతో పాటు భారత రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ చేర్చాలనే డిమాండ్‌తో ఆందోళనకారులు బుధవారం ఉదయం లేహ్ వీధుల్లోకి వచ్చారు. లడ్డాఖ్‌కు ఆరవ షెడ్యూల్‌ను వర్తింపజేసే ఉద్యమం వేగంగా జరుగుతోంది. అక్టోబర్ 6న హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఎల్ఏబీ, కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కేడీఏ) సభ్యులతో కూడిన లడ్డాఖ్ ప్రతినిధుల మధ్య చర్చలు జరగనున్నాయి. ఈ రెండు సంస్థలు తమ డిమాండ్లకు మద్దతుగా గత నాలుగు సంవత్సరాలుగా సంయుక్తంగా ఆందోళనకు నాయకత్వం వహిస్తున్నాయి. గతంలో ప్రభుత్వంతో అనేక రౌండ్ల చర్చలు జరిపాయి.

వాంగ్‌చుక్ దీక్ష విరమణ

లడ్డాఖ్‌కు రాష్ట్ర హోదా ఉద్యమం హింసాత్మకంగా మారడంతో పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ బుధవారం తన 15 రోజుల నిరాహార దీక్షను విరమించుకున్నారు. "లడ్డాఖ్ యువత హింసను వెంటనే ఆపాలని నేను అభ్యర్థిస్తున్నాను ఎందుకంటే ఇది మా లక్ష్యానికి హాని కలిగిస్తుంది. పరిస్థితిని మరింత దిగజార్చుతుంది. లడ్డాఖ్ సహా దేశంలో అస్థిరతను మేము కోరుకోవడం లేదు "అని వాంగ్‌చుక్ దీక్షా శిబిరం వద్ద పెద్ద సంఖ్యలో గుమిగూడిన తన మద్దతుదారులతో అన్నారు. ఘర్షణలు తీవ్రమవుతుండటంతో వాంగ్‌చుక్ తన 'ఎక్స్' ఖాతాలోయువత శాంతియుతంగా ఉండాలని, హింసను ఆపాలని విజ్ఞప్తి చేస్తూ ఒక వీడియో సందేశాన్ని కూడా పోస్ట్ చేశారు.

విద్య, ఉద్యోగాల్లో ఈబీసీలకు రిజర్వేషన్

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ అత్యంత వెనుకబడిన తరగతుల (ఈబీసీ) వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లపై దృష్టిపెట్టింది. 10 అంశాల కార్యక్రమాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా ఐక్యసంఘటన విజయం సాధించగానే రాష్ట్రంలో తక్షణం దీనిని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. పట్నాలో ని సదాకత్ బుధవారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశం లో ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ తీర్మానం చేసింది. రాజకీయ, బీహార్ ఓటర్లకు ఇచ్చే సందేశంపై కూడా తీర్మానాలు ఆమోదించింది. సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే అధ్యక్షత వహించగా, పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, కోశాధికారి అజయ్ మాకెన్, ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరామ్ రమేశ్, సచిన్ పైలట్, బీహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ కుమార్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. సమావేశం తర్వాత నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సీడబ్ల్యూసీ చేసిన తీర్మానాలను రాహుల్ గాంధీ విడుదల చేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, 15 రోజుల పాటు బీహార్‌లో తాము చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా వివిధ జిల్లాల్లో పర్యటించామని, రాజ్యాంగం జరుగుతున్న దాడిని ప్రజలకు వివరించామని చెప్పారు. కేవలం బీహార్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా పౌరుల హక్కులను హరిస్తున్నారని ఆయన ఆరోపించారు. పార్లమెంటులో సైతం తాను ప్రధాని నరేంద్ర మోదీ ముందు రెండు విషయాలు చెప్పానని, దేశవ్యాప్తంగా కులగణన జరగాలని, 50 శాతం రిజర్వేషన్ గోడను తాము కూల్చివేస్తామని చాలా స్పష్టంగా చెప్పడం జరిగిందని తెలిపారు.

ఈబీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలివే...

కాంగ్రెస్ 10 అంశాల కార్యక్రమంలో భాగంగా ఈబీసీల కోసం 'ఈబీసీ అట్రాసిటీస్ ప్రివెన్షన్ యాక్ట్' తీసుకువస్తామని హామీ ఇచ్చింది. ఎస్సీ/ఎస్టీలకు ప్రస్తుతం దేశంలో అమల్లో ఉన్న చట్టాల తరహాలోనే ఇది ఉంటుందని తెలిపింది. ఆర్టికల్ 15(5) కింద రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో రిజర్వేషన్లకు హామీ ఇచ్చింది. పంచాయతీలు, అర్బన్ లోకల్ బాడీస్‌లో ప్రస్తుతం ఉన్న 20 శాతం ఈబీసీ రిజర్వేషన్‌ను 30 శాతానికి పెంచుతామని తెలిపింది. 50 శాతం రిజర్వేషన్ పరిమితిని పెంచుతామని, జనాభా ప్రాతిపదికన కోటా అమలు చేస్తామని వాగ్దానం చేసింది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించి రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాల్సిందిగా కేంద్రాన్ని కోరుతామని తెలిపింది. నియామకాల ప్రక్రియలో 'నాట్ ఫౌండ్ సూటబుల్' (ఎన్ఎఫ్ఎస్) కాన్సెప్ట్ సరికాదని కాంగ్రెస్ పేర్కొంది. ఇది చట్టవిరుద్ధమని ప్రకటిస్తామని హామీ ఇచ్చింది. ఈ నిబంధన కింద వేకెన్సీలను భర్తీ చేయడం లేదని ఎస్సీలు, ఇతర వెనుకబడిన వర్గాలు ఆరోపిస్తున్నాయని తెలిపింది. ఈబీసీల జాబితాలో అండర్, ఓవర్ ఇన్‌క్లూజన్‌కు సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ క్యాటగిరిలో భూములు లేనివారికి రెసిడెన్షియల్ భూములు కేటాయిస్తామని, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో రూ.25కోట్ల వరకూ ఉండే కాంట్రాక్టుల్లో ఈ కమ్యూనిటీలకు రిజర్వేషన్ కల్పిస్తామని స్పష్టం చేసింది.

ఎస్ఐఆర్ ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ముప్పు

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) భారతదేశ ప్రజాస్వామ్యానికి ప్రస్తుతం ఉన్న అతిపెద్ద ముప్పు అని సీడబ్ల్యూసీ తీర్మానం పేర్కొంది. ఓటర్ల జాబితాను తారుమారు చేసి అధికారంలో కొనసాగడానికి బీజేపీ దుర్మార్గపు ఆలోచనల నుండి వచ్చిన మరొక నీచమైన కుట్ర ఇదని దుయ్యబట్టింది. జైరామ్ రమేశ్ మాట్లాడుతూ... రాబోయే నెలరోజుల్లో ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ 'హైడ్రోజన్ బాంబు', 'ప్లూటోనియం బాంబు' లాంటి విషయాలను బయటపెడతారని తెలిపారు. బీహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, రెండు నెలల్లో మహాఘట్‌బంధన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. రాజకీయ తీర్మానం గురించి వివరించారు. "ఓట్ల చోరీ, ఓటర్ల జాబితాలోని అవకతవకలు మన ప్రజాస్వామ్య పునాదులపై ప్రజల నమ్మకాన్ని కదిలించాయి. బరితెగించిన 'ఓటు చోరీ'ని ధైర్యంగా బహిర్గతం చేసినందుకు, ప్రజాస్వామ్యాన్ని కూలదోయడానికి జరిగిన ప్రయత్నాలకు ఎదురొడ్డి ధైర్యంగా పోరాడినందుకు రాహుల్ గాంధీకి సెల్యూట్ చేయాలి" అని సీడబ్ల్యూసీ రాజకీయ తీర్మానం పేర్కొంది. దేశంలో రాజ్యాంగం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక న్యాయం, జాతీయ భద్రతపై జరుగుతున్న దాడుల మాదిరిగానే ఓటు చోరీని కూడా భావిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇది చట్ట విరుద్ధ పాలన, దాని చర్యలను బహిర్గతం చేసే ఏకైక ముప్పు అని తీర్మానం పేర్కొంది. బీహార్ నుండి ఎన్డీఏను తరిమి కొట్టాలని నిర్ణయించుకున్న పేదలు, కార్మికులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ ప్రజలను ఓటు హక్కును తొలగించడమే బీజేపీ లక్ష్యమని పేర్కొంది. బీహార్ ప్రజలు తమ ఓటుశక్తిని గుర్తించాలని సీడబ్ల్యూసీ విజ్ఞప్తి చేసింది. ప్రాథమిక రాజ్యాంగ హక్కుల రక్షణ, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం కోసం పార్లమెంట్ లోపల, వీధుల్లో పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. బీహార్‌లోని ప్రతి పౌరుడికి, అలాగే భారతదేశంలోని ప్రతి పౌరుడికి సంక్షేమ ప్రయోజనాలను న్యాయంగా అందించడానికి కృషి చేస్తామని పేర్కొంది.

ఏపీకి హోదా ఇవ్వాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

రూ.10 లక్షల కోట్లకు చేరడంతో రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. 2014 ఫిబ్రవరి 20న జరిగిన రాష్ట్ర పునర్విభజన చట్టం చర్చల సందర్భంగా అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించారు. అదే ప్రకటన ఆ తర్వాత కేంద్ర కేబినెట్‌లో ఆమోదం పొందింది. అంతేకాకుండా విభజన ప్రక్రియలో భాగంగా ఉన్న బీజేపీ నేతలు కూడా ఆ హోదాకు మద్దతు పలికారని తీర్మానంలో పేర్కొంది. ఆ తరువాత ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ నాయకులంతా ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారని సీపీఐ గుర్తు చేసింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ అమలు చేయకుండా బీజేపీ ఆంధ్రప్రదేశ్ ప్రజలతో ఆటలాడుతోందని మండిపడింది.

ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్ర సమస్యలపై రాజకీయ లాభనష్టాలను బట్టి వ్యవహరిస్తోందని సీపీఐ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పోలవరం ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్, సాగు నీటి ప్రాజెక్టుల నిధులు సైతం కేంద్రం విడుదల చేయడం లేదని విమర్శించింది. సాగునీటి ప్రాజెక్టులు ముందుకు కదలకపోవడం, రైతుల ఆత్మహత్యలు పెరగడం, పరిశ్రమలు పెట్టుబడులు పెట్టడంలో వెనుకంజ వేయడం లాంటివన్నీ కేంద్ర నిర్లక్ష్యం వల్లేనని ఆరోపించింది. రాష్ట్ర పునర్విభజన చట్టంలోనే కొత్త రాజధానికి కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తుందని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ... అమలు చేయడం లేదు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని రక్షించడానికి ఒకే ఒక మార్గం ఆంధ్రప్రదేశ్‌కు తక్షణమే ప్రత్యేక హోదా ఇవ్వడమేనని సీపీఐ స్పష్టం చేసింది.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో భద్రతా బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపగా... పోలీసులు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు ప్రారంభించినట్లు చెప్పుకొచ్చారు. ఘటనా స్థలం నుంచి కీలక ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. 2025లో ఇప్పటివరకు మొత్తం 32 మంది మావోయిస్టులను మట్టుబెట్టినట్లు జార్ఖండ్ పోలీస్ శాఖ వెల్లడించింది. మంగళవారం చత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టు అగ్రనేతలు హతమైనట్టు అధికారులు పేర్కొన్నారు. వీరిని మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులైన రాజు దాదా అలియాస్ కట్టా రామచంద్రారెడ్డి, కోస దాదా అలియాస్ కదారి సత్యనారాయణ రెడ్డిగా గుర్తించారు. వీరిద్దరూ తెలంగాణలోని కరీంనగర్‌కు చెందినవారని నారాయణపూర్ ఎస్పీ రాబిన్‌సన్ గురియా తెలిపారు.

71 మంది మావోయిస్టుల లొంగుబాటు

చత్తీస్‌గఢ్‌లో బుధవారం 71 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దంతెవాడ జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ వద్ద లొంగిపోయిన మావోయిస్టులలో 50 మంది పురుషులు, 21 మంది మహిళలు ఉన్నారు. వీరిలో 30 మందిపై రూ.64 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు ముమ్మరం చేయడం, ప్రభుత్వ పునరావాస విధానం అమలుతో మావోయిస్టుల కార్యకలాపాలు పూర్తిగా తగ్గిపోతున్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ చెప్పారు. మావోయిస్టుల ఏరివేతను కేంద్ర ప్రభుత్వం ముమ్మరం చేస్తుండడంతో లొంగిపోవడం తప్ప వారికి మరో మార్గం లేదన్నారు. వీరంతా గతంలో అనేక విధ్వంసక ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు బస్తర్ ఐజీ వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి పునరావాసం కల్పిస్తామని స్థానిక అధికారులు పేర్కొన్నారు. మావోయిస్టులు హింసాయుత విధానాలు వదిలివేసేలా చేయడమే తమ ఉద్దేశమని, జనజీవన స్రవంతిలో కలిసే వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. 'ఆపరేషన్ కగార్'తో మావోయిస్టుల వైపు భారీగా నష్టం వాటిల్లుతుండటంతో పెద్దసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారు.

టీజీఎస్ ఆర్టీసీలో ఏఐ వినియోగం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంస్థను ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేయడం కోసం 2021 నుంచే అమలు చేస్తున్న స్ట్రాటజిక్ డిప్లాయ్‌మెంట్ ప్లాన్ (ఎస్డీపీ) కీలక పాత్ర పోషిస్తున్నదని మంత్రి దృష్టికి ఆర్టీసీ ఉన్నతాధికారులు తీసుకెళ్లారు. ప్రతి నెలా ఎస్డీపీ సమీక్షా సమావేశాలను నిర్వహిస్తూ, స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి అమలులో సంస్థ చురుకైన చర్యలు తీసుకుంటున్నదని వివరించారు. తమ పనితీరు మెరుగుపరచుకోవడానికి ఏఐని వినియోగించుకోవడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారుల కృషిని అభినందించారు. ప్రపంచంలో ప్రస్తుతం ఏఐ ప్రభావితం చేయని రంగమే లేదని, రవాణా వ్యవస్థలో మార్పులను గుర్తించి ప్రజల రవాణా అవసరాలకు అనుగుణంగా ఏఐని వినియోగించుకోవాలని భావించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ఈ ఏఐ ప్రాజెక్ట్ అమలుకు సమష్టిగా పనిచేసి.. ఆర్టీసీ మరింత అభివృద్ధి సాధించేలా అధికారులందరూ కృషి చేయాలని సూచించారు. సంస్థ అభివృద్ధిలో భాగస్వాములుగా పనిచేస్తూ 2021 నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద ఎస్డీపీ అమలు, ఏఐ ప్రాజెక్ట్ రూపకల్పనలో విశేషంగా తోడ్పడిన హన్స ఈక్విటీ పార్ట్నర్స్ ఎల్ఎల్‌పీకి చెందిన త్రినాథబాబు, సునీల్ రేగుళ్లను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. సంస్థను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా బలోపేతం చేయడం కోసమే ఏఐ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నామని ఎండీ సజ్జనార్ తెలిపారు. ప్రజా రవాణా రంగంలో సాంకేతికతను వినియోగించి దేశంలోనే తొలి మోడల్‌గా టీజీఎస్‌ఆర్టీసీ నిలవడం గర్వకారణమని అన్నారు. సంస్థ ఈడీలు మునిశేఖర్, ఖుస్రోషా ఖాన్, వెంకన్న, రాజశేఖర్, సీటీఎం శ్రీదేవి, సీపీఎం ఉషాదేవి, సీఈఐటీ శ్రీదేవి పాల్గొన్నారు.

మున్నేరుకు మహర్దశ

(మొదటిపేజీ తరువాయి)

పాటు, సర్వీసు రోడ్డు , డ్రైనేజ్ వ్యవస్థ పనులు వేగంగా జరుగుతున్నాయి. వరంగల్ నీట్ నిపుణులతో పనుల ప్రమాణాలను తనిఖీ చేయిస్తోంది. పనులను మంత్రు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మల్లేమడుగు, దానవాయి గూడెం, బుర్హాన్ పురం, పోలేపల్లి, గొల్లపాడు, గుడిమల్ల, గుర్రాలపాడు, ఏదులాపురం గ్రామాలకు చెందిన మొత్తం 245.12 ఎకరాల భూసేకరణలో 106.21 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. 138.31 ఎకరాల పట్టా భూమిలో ఇప్పటివరకు 69.12 ఎకరాలు సేకరించారు. నిర్వాసితులకు పరిహారంతో పాటు, ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు పోలేపల్లిలో 139.27 ఎకరాల్లో లే-అవుట్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. 1,666 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించనున్నారు. మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు పూర్తయితే ఖమ్మం పురోభివృద్ధికి మైలు రాయిగా నిలుస్తుంది. దశాబ్దాల సమస్యను పరిష్కరించిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుంది.

డీఎస్సీ అభ్యర్థులకు నేడు నియామకపత్రాలు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాట్లుచేశారు. అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖుల కోసం 34వేల కుర్చీలు ఏర్పాటుచేశారు. రాయలసీమ, దక్షిణ కోస్తా, గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల వారీగా ప్రాంగణంలో నాలుగుజోన్లు , ఇందులో మళ్లీ జిల్లాలు, నియోజకవర్గాల వారీగా సబ్ జోన్లు ఏర్పాటుచేశారు.

కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి పాఠశాల విద్యాశాఖ తరపున ఒక ఇంచార్జిని నియమించారు. ఆయా జిల్లాల్లో ఎంపికైన నాన్ లోకల్ అభ్యర్థుల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటుచేశారు. 1994 నుంచి 2025 వరకు గత 31సంవత్సరాల్లో 14 డీఎస్సీలను నిర్వహించి 1,96,619 టీచర్ పోస్టులను తెలుగుదేశం, కూటమి ప్రభుత్వాలు భర్తీ చేశాయి. మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు 106 కేసులు దాఖలు చేశారు. నోటిఫికేషన్ విడుదల చేసి 150 రోజుల వ్యవధిలో నియామక ప్రక్రియను పూర్తి చేశారు. 16,347 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా ఎంపికైన 15,941 మందికి నియామక పత్రాలు అందజేయనున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 5.3 లక్షలమంది అభ్యర్థులు డీఎస్సీ పరీక్షకు హాజరయ్యారు. పూర్తి పారదర్శకంగా పరీక్షలను నిర్వహించిన ప్రభుత్వం, ఆ తర్వాత కీ, మెరిట్ జాబితాను ఆన్ లైన్‌లో ప్రచురించారు. అన్నిస్థాయిలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటుచేసి సమర్థవంతంగా ఫిర్యాదులను పరిష్కరించారు. ఎస్సీ వర్గీకరణతోపాటు తొలిసారిగా మూడు శాతం క్రీడాకోటాను కూడా అమలుచేశారు. 372 మంది క్రీడాకారులకు టీచర్ ఉద్యోగాలు లభించాయి. మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, క్రీడా కోటా సహా అన్ని కేటగిరిల్లో వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేశారు. ప్రస్తుతం మిగిలిపోయిన 406 పోస్టులతోపాటు కొత్తగా ఖాళీ అయ్యే పోస్టులతో వచ్చే ఏడాది మరో డీఎస్సీ ప్రకటించనున్నారు. అత్యధికంగా రాయలసీమలోని కర్నూలు జిల్లాలో 2,590 టీచర్ పోస్టులను భర్తీచేయనున్నారు.

జీఎస్టీ తగ్గింపు ఫలాలు పేద ప్రజలకు అందాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ఇటీవల కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టి స్లాబ్ విధానం వల్ల పేద ప్రజలకు న్యాయం జరగటం లేదని తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన నేరేడుచర్లలోని సిపిఐ కార్యాలయం ప్రజాభవన్‌లో పార్టీ సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తూ ముఖ్యంగా కిరాణం సామాన్లపై ఏమాత్రం రేటు తగ్గలేదని 22వ తేదీకి ముందు ఉన్న విధంగా ఉన్నాయి తప్ప ఏ ఒక్క కిరాణం వస్తువుపై ఒక్క రూపాయి కూడా ధర తగ్గలేదని ఇది ప్రభుత్వానికి చేరాలి గత ఎనిమిది సంవత్సరాలుగా పేద మధ్యతరగతి వర్గాల రక్తాన్ని పీల్చిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని జీఎస్టీ రేటు తగ్గిస్తే అది మధ్య దళారులకే లాభం చేకూరే విధంగా ఉంది తప్ప సామాన్యులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని ఆయన ఆరోపించారు. జీఎస్టీ వల్ల సామాన్యుడు తాగే టీ దగ్గర నుంచి ఉప్పు దగ్గర నుంచి అన్ని రెట్లు రెట్టింపు అయ్యాయని పది రూపాయలు ఉప్పుప్యాకెట్టు 20 రూపాయలు అయిందని రూ.60 కందిపప్పు రూ.160 అయిందని జీఎస్టీ స్లాబు తగ్గినప్పటికీ ఆ రేట్లు అలాగే కొనసాగుతున్నాయని తక్షణమే కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని జీఎస్టీ ఫలాలు పేదవారికి అందే విధంగా జాగ్రత్త వహించాలని ముఖ్యంగా పెట్రోల్ డీజిల్‌ని జీఎస్టి పరిధిలోకి తేవాలన్నారు. మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ అన్నారు.

యూరియా కొరత తీర్చాలి

విశాలాంధ్ర - వనపర్తి : అన్నదాత కష్టాలను పట్టించుకోకపోతే కేంద్ర రాష్ట్ర పాలకులకు పుట్టగతులు ఉండవని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ విమర్శించారు. యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో పానగల్ అంబేద్కర్ చౌక్ నుంచిఎమ్మార్వో ఆఫీస్ కార్యాలయం వద్దకు ర్యాలీ నిర్వహించి, ఆఫీస్ వద్దధర్నా నిరసన చేపట్టారు. డిప్యూటీ ఎమ్మార్వో అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్తా ఏరియా కోసం నెలల తరబడి పంపిణీ కేంద్రాల వద్ద అన్న పానీయాలు మాని పడిగాపులు పడుతున్నారని కొందరు సొమ్మసిల్లి పడిపోగా మరికొందరు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఎన్నికల్లో వేదికలపై అన్నదాత దేశానికి వెన్నెముక అంటూ గొప్ప మాటలు చెప్పే పాలకులు, యూరియా లేక అల్లాడుతుంటే పంపిణీ కేంద్రాల వైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. జిల్లాలో ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి యూరియా కేంద్రాల దగ్గరికి వెళ్లి వారి పరిస్థితి పరిశీలించిన దాఖలాలు లేవన్నారు. యూరియా కొరత ఉండడంతో బస్తా యూరియా దక్కించుకు నేందుకు క్యూలైన్‌లో రైతులు కొట్లాడుకునే పరిస్థితి వచ్చిందన్నారు. రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఉందన్నారు. యూరియా సరఫరా చేయాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వాన్నిదన్నారు. రైతు యూరియా కొరతను తీర్చకుంటే రైతులను సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేశ్, చిన్న రాముడు, కమ్మావు పెంటయ్య, మాల కురుమయ్య, అంజి, సంతోష్, కుర్వ హనుమంతు, చిన్న కురుమయ్య, సహదేవుడు, మల్లెపు బాలస్వామి, కురుమమ్మ పాల్గొన్నారు.

25న బీసీ రిజర్వేషన్లపై సత్యాగ్రహ దీక్ష

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానికసంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య చేపట్టబోయే సత్యాగ్రహ దీక్షకు జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి మద్దతు తెలపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ కోరారు. శుక్రవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు బీసీ సంఘం నాయకులతో కలిసి సత్యాగ్రహ దీక్ష ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి మనోజ్ గౌడ్, తాడూరి శ్రీమన్నా రాయణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా బీసీలు రిజర్వేషన్ల విషయంలో అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డి (6) ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా బీసీల రిజర్వేషన్ల విషయం లో స్పష్టమైన వైఖరితో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం ప్రసాద్, జిల్లా యూత్ అధ్యక్షులు నోమూరి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు కర్రె కుమార్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి బొద్దుల అరుణ, బింగి రాజు, మల్యాల సంజీవ్, కందుకూరి సత్యనారాయణ, పనుగట్ల శేఖర్ గౌడ్, బొమ్మకుంట రవి, రంగు రాజేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పై సమీక్షా సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ఇప్పటి వరకు మంజూరైన ఇండ్లు, మార్కౌట్, బేస్ మెంట్ తదితర అంశాలను సమీక్షిం చారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నెల 30లోపు అనుమ తులు పొందిన ఇందిరమ్మ ఇండ్లకు మార్కౌట్ ప్రక్రియ పూర్తిచేసి, వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో పంచా యతీ కార్యదర్శులు నిరంతరం ఇళ్ల నిర్మాణంపై పర్యవేక్షణ చేయాలని, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవా లని, అలాగే ప్రతి దశకు సంబంధించిన ఫోటోలను నిబంధనల ప్రకారం సంబంధిత వెబ్‌సైట్‌లో సమయానికి అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : మైనార్టీల కోసం తెలంగాణ ప్రభుత్వం రేవంత్ అన్నా కా సహారా" పథకం, ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన" పథకం రెండు పథకాలు ప్రవేశ పెట్టిందని, ఈ రెండు కొత్త పథకాలకు ములుగు జిల్లా మైనార్టీలు దరఖాస్తులు చేసుకోవాలని, ములుగు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం. సర్దార్ సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దుతూ వారి ఆర్థిక స్థితిని మెరుగుపరిచే ఉద్దేశ్యంతో రెండు కొత్త పథకాలను ప్రకటించిందని, ఈ పథకాల కింద ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు (వెబ్‌సైట్: tgobmms.cgg.gov.in) స్వీకరించబడుతున్నాయని, అర్హత కలిగిన మైనార్టీ అభ్యర్థులు ఈ స్వర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా రాష్ట్ర ప్రభుత్వంచే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి బుధవారం ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించి పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆరెంపుల గ్రామంలో నిర్మించి పూర్తి చేసిన జెల్ల విజయ కుమారి, చెన్నబోయిన నరేష్, షేక్ నాగుల్ పాషా, చిర్ర రాజ్యం, సమర్థపు మమత, షేక్ రంజాన్ పాషాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్లను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించి లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు చిర్ర రాజ్యం ఇంట్లో మంత్రి, కలెక్టర్, సిపిలు భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అధికారం, స్వార్థం కోసం కాకుండా పేద ప్రజల ఆత్మగౌరవం కోసం ఉపయోగపడాలనే తాపత్రయంతో రేవంత్ రెడ్డి నాయకత్వంలో గృహ నిర్మాణ శాఖను తనకు కేటాయించడం జరిగిందన్నారు. పేద ప్రజలకు భరోసా, ధైర్యం అందించేలా ఇందిరమ్మ ఇండ్లను ప్రజా ప్రభుత్వం నిర్మిస్తుందని అన్నారు. గిరిజన ప్రాంతంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం జరిగిందని, తర్వాత రాష్ట్రంలోనే పాలేరు నియోజకవర్గంలో నేడు గృహ ప్రవేశాలు జరుగుతున్నాయని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పేద ప్రజల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఉగాది నుంచి నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, 11 లక్షల నూతన రేషన్ కార్డుల పంపిణీ చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి ఆరెంపుల గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో నేడు 6 గృహ ప్రవేశాలు మంత్రి చేతుల మీదుగా జరగడం సంతోష కరమని అన్నారు. అనంతరం ఆరెంపుల నుండి ఖమ్మం - వరంగల్ ఆర్ అండ్ బి రోడ్డు వయా యన్.డి.ఆర్. గోదాము వరకు 77 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న పశు సంవర్ధక ఉప కేంద్రం నూతన భవనం, ప్రహరీ గోడ, మరుగుదొడ్ల నిర్మాణాలకు, ఎం.పి.పి.ఎస్. ఆరెంపులలో 13.50 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గది నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేసారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు హరినాథ బాబు, వెన్నపూసల సీతారాములు, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడివో శ్రీదేవి, ఎంఇఓ శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

28న చలో మానుకోట

విశాలాంధ్ర - గూడూరు: మానుకోట లంబాడీల రిజర్వేషన్ పర్యవేక్షణ జేసీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గూడూరు మండల కేంద్రంలోని చంద్రుగూడెంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఎల్.రాజకుమార్ మాట్లాడుతూ బ్రిటిష్ నైజాం పాలనలోనూ మా లంబాడీలను ఎస్టీలకు గుర్తించారని తమ స్వార్థ రాజకీయాల కోసం వ్యక్తిగత స్వార్థం కోసం ఆదివాసీలు అన్నదమ్ముల కలిసి ఉన్న మమ్మల్ని గిరిజన తెగల మధ్య చిచ్చుపెట్టి స్వార్థం ఆలోచిస్తున్నా ప్రభుత్వాలకి బుద్ధి చెప్పాలని సెప్టెంబర్ 28న చలో మానుకోటకు పిలుపు నిచ్చారు. మానుకోటలో జరిగే బహిరంగ సభకు లంబాడీలంతా ఏకమై తరలిరావాలని సాక్షర ఆదివాసి గిరిజన సోదరులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలని లంబాడీల ఆత్మగౌరవ శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. డాక్టర్ రాజకుమార్ జాదవ్ ఎల్ జె సి రాష్ట్ర కన్వీనర్ భూక్య బాలు నాయక్ ఉపాధ్యాయ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ గుగులో హరినాయక్, ఎల్ హెచ్ పి ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి వీరు నాయక్, టీఎస్ టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు లంబాడి రిజర్వేషన్ ఉపరిరక్షణ జేఏసీ సభ్యులు డాక్టర్ వాంకుడోతూ గోపీనాథ్, వాంకుడోత్ కటార్ సింగ్, బానోతు రాజకుమార్, బానోత్ మంగీలాల్, బానోత్ లక్ష్మణ్ నాయక్, ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ మానుకోట జిల్లా అధ్యక్షులు టిడబ్ల్యూజే ఏ రాష్ట్ర నాయకులు బానోతు నరసింహ, నాయక్ బోడ శరత్ పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశిం చారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఈ ఖరీఫ్‌కు గ్రేడ్-ఏ రకానికి క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధరను, సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్‌ను ప్రకటించినట్లు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో 10 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి రానుందని, అందులో 4.30 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.జిల్లా వ్యాప్తంగా 336 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గతంలో తప్పులు చేసిన కేంద్రాలకు ఈసారి బాధ్యతలు ఇవ్వబోమని హెచ్చరించారు. కొనుగోలు సమయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సంవత్సరం కోసం 1.77 కోట్ల గన్ని బ్యాగులు అవసరమ ని, అందుబాటులో ఉన్న వాటికి తోడు మరిన్ని బ్యాగులు సమకూర్చే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ధాన్యం రవాణా సమస్యలు లేకుండా ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జిల్లా అధికారులు, పౌరసరఫరా శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: జిల్లాలోని జేఎన్టీయూ హెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో బతకమ్మ ఉత్సవాలు బుధవారం మహబూబాబాద్ లోని జేఎన్టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తెలంగాణ సాంప్రదాయం ఉట్టిపడేలా బతకమ్మ ఉత్సవాలను ఇంజనీరింగ్ కళాశాలలో మొట్టమొదటిసారిగా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని విద్యార్థిని విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బలరాం నాయక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే బతుకమ్మ పండుగను కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులతో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహా అన్నదానం

విశాలాంధ్ర - కోదాడ : కోదాడ పట్టణంలోని నయా నగర్‌లో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలల్లో భాగం గా బుధవారం సర్వేజనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బండారు కవిత అమరేందర్ రెడ్డి మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని, అన్నదానం పుణ్యకార్యమని, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. సర్వేజనా ఫౌండేషన్ ద్వారా ఆధ్యాత్మిక, సామాజిక, విద్యా సంబంధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేసారు. బాణాల వసంత వెంకటరెడ్డి, నయా నగర్ శ్రీ దేవిశరన్నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, వేద పండితులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన రవాణా శాఖ వెహికల్ ఇన్‌స్పెక్టర్

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖలో నూతనంగా ఎన్నికైనటువంటి 102 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్‌లో, ములుగు జిల్లాకి కేటాయించిన యరబోలు వినోద్ రెడ్డి ఆరు నెలల శిక్షణ పూర్తి చేసుకుని సోమవారం విధులలో చేరడం జరిగిందని ములుగుజిల్లా రవాణా శాఖ అధికారి బారగాడి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ములుగు రవాణా శాఖ కార్యాలయంలో నూతనంగా విధుల్లో చేరిన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌కి, రవాణా శాఖ అధికారి బారాగాడి శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

జ్వర బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: ప్రభుత్వ ఆసుపత్రులకు జ్వరబాధితులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం ఆయన మంథని, రామగిరి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథని ఆసుపత్రికు వచ్చే ఫీవర్ కేసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధుల లక్షణాలు గల వారికి ల్యాబ్‌లో నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మంథని పట్టణ కేంద్రంలోని జెబిఎస్ పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 9 లక్షల రూపాయలతో చేపట్టిన మరమ్మత్తు పనులు ప్రారంభించాలని, బేగంపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో డయాస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట మంథని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, మంథని ఏఈ పిఆర్ అనుదీప్, రామగిరి ఏఈ పిఆర్ వరలక్ష్మి,అధికారులు పాల్గొన్నారు.

దుర్గామాతకు రమేష్ నాయక్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద బుధవారం బిఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్యా రమేష్ నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దస్రు నాయక్, రమేష్ నాయక్, జగ్రు బావోజీ, భీమా నాయక్, కోటేష్ స్వాములు బత్తుల పరమేష్, భూతరాజు భరత్, నెల్లికంటి గోపి గుండెబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర - తొర్రూరు : తొర్రూరు మండలంలోని నిర్మాణాలు పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిరుపేద లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లా డుతూ గత ప్రభుత్వంలో కోట్ల రూపాయలు వెచ్చించి రెండు పడక గదుల ఇల్లు నిర్మాణాలు పూర్తి చేసి ఉన్న ఇండ్లను గత ప్రభుత్వం పంచకపోగా, ప్రజాపాలన వచ్చిందంటూ చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భారీ మెజారిటీతో గెలిపిస్తే రెండు సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇండ్లు పంపిణీ చేయకుండా విస్మరించడం ఎంతవరకు సమంజసమని ఆయన విమర్శించారు. అధికారులు కూడా రాజకీయ నాయకుల లాగానే పూటకో మాట చెప్పి కాల యాపన చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతుందని.. ఇప్పటి వరకు పంపిణీ చేయకుండా ఉండడం సరి కాదని ఇప్పటికైనా పూర్తయిన డబల్ బెడ్ రూములు అర్హులైన నిరుపేదలకు అందించాలని సిపిఐ మండల సమితి డిమాండ్ చేస్తుందన్నారు.

యువ నాయకుడు సాజిద్‌ను కోల్పోవడం బాధాకరం : ఎమ్మెల్యే



విశాలాంధ్ర - కొత్తగూడెం : చంటిగుండా మండల కాంగ్రెస్ పార్టీ స్నేహశీలి, సౌమ్యుడైన క్రియాశీల యువనాయకుడు సాజిద్ (సజ్జు) 27 కోల్పోయిందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేసారు. చంద్రుగొండ గ్రామానికి చెందిన సాజిద్ కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్ ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఎమ్మెల్యే విషయం తెలుసుకొని హుటాహుటిన వచ్చి కొత్తగూడెం ఆసుపత్రిలో ఉన్న సాజిద్ మృతదేహాన్ని సందర్శించి నివాళలర్పించారు. యువనాయకుడి అకాల మరణంతో ఆయన చలించిపోయారు. అక్కడే ఉన్న నాయకులు, కార్యకర్తలతో సాజిద్‌తో ఉన్న సాన్నిహిత్యం, అనుబంధాన్ని పంచుకున్నారు. చంద్రుగొండ నుంచి కొత్తగూడెంలో అత్తగారింట్లో ఉన్న భార్య, ఏడునెలల తన కుమారుని కోసం బైక్‌పై వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీ కొనడంతో ప్రమాదం జరిగిందని వివరిం చారు. తలకు తీవ్ర గాయాలైన సజ్జును కొత్త గూడెం ప్రభుత్వాసుపత్రికి తర లించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సాయంత్రం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్నేహితుల నడుమ సజ్జు అంతిమక్రియలు జరిగాయి.

ప్రభుత్వాసుపత్రుల్లో పేదలకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర - నల్గొండ బ్యూరో : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం దేవరకొండ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, శానిటేషన్ స్థితి, ఓపి మరియు ఏఎన్‌సీ వార్డుల పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. రిజిస్టర్‌ల నిర్వహణపై సిబ్బందిని ప్రశ్నించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి ప్రకాష్ ఆసుపత్రి పని తీరు, సిబ్బంది విధులు, రోగులకు అందిస్తున్న సేవలపై కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. కలెక్టర్ పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి అన్ని వైద్య సదుపాయాలు అందేలా చూడాలని వైద్య అధికారులను ఆదేశించారు. తదుపరి కలెక్టర్ డిండి రోడ్‌లో నిర్మించబోయే ఆర్డీవో కార్యాలయ నూతన భవన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, జిల్లా గృహ నిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్ కుమార్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో డేనియల్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

రాబోయే మూడేళ్లలో ప్రతి అర్హుడికి ఇల్లు : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని రాబోయే మూడేళ్లలో ప్రతి అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేసారు. బుధవారం 966 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, 19 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ. 19 లక్షల 2204 చెక్కులను పంపిణీ చేసారు. జిల్లాలోని అశ్వరావుపేట డివిజన్లో కొత్తగా ఏర్పాటైన సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారం లో ఆయన పాల్గొన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్గా సుంకవెల్లి వీరభద్రరావు తో పాటు 24 మంది సభ్యులు ప్రమాణం చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి తోపాటు అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఆత్మ కమిటీ చైర్మన్ గా నియామకం ఒక పెద్దాయనకు ఇచ్చామన్నారు. తద్వారా రైతుల సంక్షేమం, పేదవర్గాల ఆత్మగౌరవం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ రోజున ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రతి పేదవాడికి నిజమవ్వాలని, రాబోయే మూడు సంవత్సరాల్లో పరువు లేని ప్రతివారికి ఆర్థిక భరోసా ఇస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఇళ్ల నిర్మాణం, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500 కే గ్యాస్, తోపాటు ప్రజా ప్రభుత్వం ఏర్పడిన త్వరత సుమారు 11 లక్షల మందికి నూతన రేషన్ కార్డులు, సుమారు 7 లక్షల మంది పాత రేషన్ కార్డులలో పేర్ల నమోదు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ఈ విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలు అయ్యాయని గుర్తు చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ ఆత్మ కమిటీ చైర్మన్ నియామకం రాష్ట్రంలోనే మొదటిసారిగా తన అశ్వరావుపేట నియోజకవర్గంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, ఇళ్ల లబ్ధిదారులు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. ఆత్మ కమిటీ సభ్యులు పంటల, వ్యవసాయ, చేపల పెంపకం, ఇతర సబ్సిడీ స్కీమ్స్‌లో నేరుగా లబ్ధి పొందే విధంగా జిల్లా యంత్రాంగం మద్దతు ఇస్తుందని చెప్పారు. అలాగే, రాష్ట్రంలో కొత్త వ్యాపార, ఉపాధి అవకాశాలు, రైతుల సమస్యల పరిష్కారం, సబ్సిడీ స్కీమ్స్ లో పారదర్శకత, ఇళ్ల నిర్మాణ పథకాల్లో సక్రమ పేమెంట్లు పేదవర్గాల సంక్షేమానికి ప్రధాన మార్గదర్శకమని కలెక్టర్ తెలిపారు. కొత్తగూడెం ఆర్డీవో మధు, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, హౌసింగ్ పిడి రవీంద్రనాథ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, రైతులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: ఖరీఫ్ వరి ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ మొదటి వారం నుంచి ఖరీఫ్ వరి ధాన్యాన్ని సేకరించుటకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో 2025- 26 ఖరీఫ్ వరి ధాన్య సేకరణ సన్నద్ధతపై జిల్లా సేకరణ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ధాన్యం కొనుగోలులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ఠ ప్రణాళిక ద్వారా కొనుగోలు ప్రక్రియ జిల్లాలో కొనసాగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాకు 2,389 రూపాయలను, సాధారణ రకానికి క్వింటాకు 2,369 రూపాయలను కనీస మద్దతు ధరగా నిర్ణయించినట్లు చెప్పారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఖరీఫ్‌లో 4 లక్షల 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. మిల్లులు సిద్ధంగా ఉన్నాయని సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. మిల్లుల టాగింగ్, తనిఖీపై దృష్టి సారించాలన్నారు. ధాన్యం తరలించే వాహనాలన్నిటికీ జీపిఎస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. గత సీజన్లో మిల్లులకు 5,67,841 మెట్రిక్ టన్నుల ధాన్యం చేరగా, 3,82,502 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం మాత్రమే వారి నుంచి వచ్చింది. ఇంకా 1,58,497 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం రావాల్సి ఉంది, త్వరితగతిన రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఏఓ దేవ్ కుమార్, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, రవాణా శాఖ అధికారి వెంకన్న, కో-ఆపరేటివ్ అధికారి కరుణాకర్, జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్, అడిషనల్ డిఆర్డిఓ సరస్వతి, మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బూర్గంపాడు : పేదల సంక్షేమంతో పాటు అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజల అవసరాలు తెలుసుకొని ప్రజల కోసం పాటుపడే ప్రభుత్వం తమదన్నారు. బుధవారం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే పాయం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని ప్రారంభించారు. అనంతరం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఆయన పలుగు, పారలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. రోగులకు నాణ్యమైన, సరైన వైద్యం అందేలా చూడాలని వైద్య సిబ్బందిని ఆయన ఆదేశించారు. మండలంలో ఏ సమస్య ఉన్న నిస్సంకొచంగా నేరుగా తలను సంప్రదించాలని ఎమ్మెల్యే చెప్పారు. ఈ పర్యటనలో ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

సంపాదకీయం

అమ్మకానికి వైద్య విద్య

నూతన ఆర్థిక విధానాలను అందరికన్నా ఎక్కువగా సమర్థించినవారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి. ఆ క్రమంలో ఇదివరకు ఆయన ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అనేక ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ప్రైవేటు రంగానికి అప్పగించారు. చాలా సందర్భాలలో కనీసం ఆ ప్రభుత్వరంగ సంస్థలు ఉన్న ఆవరణలున్న భూమికి గల ధర కూడా రాలేదన్న విమర్శలు ఆనాడు జోరుగా సాగాయి. ఇప్పుడు చంద్రబాబు ప్రైవేటు రంగంలో వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తామంటున్నారు. అయితే ఇవి ప్రైవేటు వైద్య కళాశాలలు కాదని, అవి ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో ఉంటాయని చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేశ్ గట్టిగా వాదిస్తున్నారు. వైద్య విద్యను ప్రైవేటు రంగానికి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్న వారి మీద తండ్రీ కొడుకులు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల నిర్మాణం రెండేళ్లలో పూర్తి అవుతుందని మంగళవారం శాసనసభలో చెప్పారు. జగన్ నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ఈ విషయంలో అనవసరమైన రాద్ధాంతం చేస్తోందని చంద్రబాబు దెప్పి పొడిచారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో తనను మించిన వారు లేరని అనుకునే చంద్రబాబు... ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో నెలకొల్పే వైద్య కళాశాలల గురించి బోలెడు సమాచారం అందించడమే కాక పవర్ పాయింట్ మాధ్యమంగా కూడా వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనను త్వరితంగా ఏర్పాటు చేయడానికి, పేదలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిని అనుసరిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వాదిస్తున్నారు. అంటే పేదలకు నాణ్యమైన వైద్య విద్య అందించే బాధ్యతను ప్రైవేటు రంగానికి అప్పగిస్తారన్నమాట. ఇప్పటికే ప్రభుత్వం క్రమంగా ప్రజారోగ్య రంగంలో తన బాధ్యతల నుంచి తప్పుకుంటోంది. నాణ్యత, మౌలిక సదుపాయాల మిషతో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తామని చంద్రబాబు చెప్పకనే చెప్తున్నారు. 1995లో తాను మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో కేవలం ఆరు వైద్య కళాశాలలే ఉండేవని చంద్రబాబు చెప్పిన మాట నిజమే కావొచ్చు. రాష్ట్రం విడిపోయిన తరవాత ఇప్పుడు 38 వైద్య కళాశాలలు ఉన్నాయని, అందులో 18 ప్రభుత్వ వైద్య కళాశాలలని చంద్రబాబు గుర్తు చేస్తున్నారు. ఆ లెక్కన కూడా ప్రైవేటు వైద్య కళాశాలల సంఖ్యే ఎక్కువ. ఒక ఎయిమ్స్ కూడా ఉంది. గీతం విశ్వవిద్యాలయంలో ఓ వైద్య కళాశాల ఉంది. రాష్ట్ర విభజన తరవాత ఎన్డీయే ప్రభుత్వం 1,819 వైద్య సీట్లు సాధించిందని, 2014-2019 మధ్య మరో 1,212 వైద్య సీట్లు పెంచామని కూడా ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ప్రతి కళాశాలలో కన్వీనర్ కోటా సీట్ల సంఖ్య 64 నుంచి 75 కు పెంచారట. కన్వీనర్ కోటా అంటే ప్రభుత్వ అధీనంలో ఉండే సీట్లు. పనిలో పనిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంటే 2019-2024 మధ్య 452 సీట్లు మాత్రమే పెరిగాయని చంద్రబాబు చెప్పారు. జగన్ ప్రభుత్వం 17 వైద్య కళాశాలల కోసం 8,480 కోట్ల రూపాయలు కేటాయించినా ఖర్చు పెట్టింది రూ.1,550 కోట్లేనని ముఖ్యమంత్రి వివరించారు. అదే రాష్ట్ర విభజన తరవాత రెండోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం కేవలం 15 నెలల సమయంలో రూ.787 కోట్లు కేటాయించిందని ఆయన అన్నారు. కొత్తగా ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో ఏర్పాటు చేయబోయే పది వైద్య కళాశాలల్లో అదనంగా ఒక్కో వైద్య కళాశాలలో 110 సీట్లు పెరుగుతాయట. ఇది ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు మేలు చేస్తుందట. పేదలకు మేలు చేయడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తూ ఉంటే ప్రతిపక్షాలు "చౌకబారు" రాజకీయాలు చేస్తున్నాయని చంద్రబాబు చెప్తున్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం కింద ఏర్పాటైన వైద్య కళాశాలలు కొంతకాలం తరవాత ప్రభుత్వ అధీనంలోకి వస్తాయట. యాజమాన్య హక్కు వదులుకోకుండానే మౌలిక సదుపాయాలు సత్వరం ఏర్పాటు చేయడం కోసమే ప్రైవేటు భాగస్వామ్యం ఉంటుందట. మరి ప్రైవేటు పెట్టుబడిదార్లు కూడా ఏ మాత్రం లాభాపేక్ష లేకుండా ప్రజాసేవలో నిమగ్నమవుతారని చంద్రబాబు నమ్మమంటారేమో.

ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉంటే వైద్యులు, నర్సులు, బోధనేతర సిబ్బంది కలిసి కనీసం ఒక్కో కాలేజీలో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుంది. ప్రైవేటు యాజమాన్యాలైతే తక్కువ సిబ్బందితో బండి నడిపిస్తాయి. అంటే ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతాయి. ఒక వైద్య కళాశాల ఏర్పాటుచేస్తే దానికి అనుబంధంగా మూడు నాలుగు వందల పడకల ఆసుపత్రి కూడా వస్తుంది. ప్రైవేటు వర్గాలు ఈ సూత్రాన్ని ఉల్లంఘించడానికి శక్తి మేరా కృషి చేస్తాయి. కనీసంగా ఎంతమంది సిబ్బందిని నియమించుకోవాలో ఆదేశించే అవకాశం ప్రభుత్వానికి ఉండదు. ప్రైవేటు ఆసుపత్రులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది. ఇవన్నీ చాలా చౌక ధరకే ప్రభుత్వం అందజేస్తుంది. అందుకే ఆ ఆసుపత్రుల్లో 25-30 శాతం మంది పేదలకు ఉచితంగా చికిత్స చేయాలి. వైద్య పరీక్షలకు అయ్యే ఖర్చు కూడా చాలా తక్కువే ఉంటుంది. ఈ నియమాలను ఎన్ని ప్రైవేటు ఆసుపత్రులు పాటిస్తున్నాయో చంద్రబాబు లెక్క తేల్చగలరా! ప్రైవేటు ఆసుపత్రిలో ఉచిత చికిత్స అందిందని చెప్పేవారు ఎంతమంది ఎక్కడ కనిపిస్తారు? అయితే ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో ఏర్పడే వైద్య కళాశాలల్లోనూ అవుట్ పేషెంట్లకు సేవలు, మందులు, చికిత్స ఉచితమేనని ముఖ్యమంత్రి అంటున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకాలు ఈ ఆసుపత్రుల్లోనూ వర్తిస్తాయట. ప్రభుత్వాలు తమ ఔదార్యాన్ని ప్రదర్శించడానికి ఈ మాటలన్నీ చెప్పొచ్చు. ఆరోగ్య శ్రీ గురించి ఎంత టముకు వేసుకున్నా ఆ సేవలు అందించిన ఆసుపత్రులకు ప్రభుత్వం చెల్లించవలసిన సొమ్ము చెల్లించనందువల్ల అనేక చోట్ల ఈ సేవలు అందడం లేదు. జగన్ హయాంలో వైద్య కళాశాలల నిర్వహణలో కొంత భారం విద్యార్థులు కూడా మోయక తప్పదన్నారు. దీనికోసం జగన్ హయాంలో ఓ జీఓ కూడా జారీ చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఉంటే ఏటా రూ.15,000 ఫీజుతో చదువుకోవచ్చు. అదే యాజమాన్య కోటాలో సీటు కావాలంటే లక్షలు కుమ్మరించాలి. చంద్రబాబు ఆలోచన ప్రకారం ఈ పరిస్థితి మారుతుందన్న హామీ ఎందుకు ఇవ్వడం లేదు? రాష్ట్రాన్ని "ఆరోగ్య ఆంధ్రప్రదేశ్" గా మార్చి అధునిక వైద్యం అందరికీ అందుబాటులోకి తేవాలన్నది తమ లక్ష్యం అని ముఖ్యమంత్రి అంటున్నారు. అదే నిజమైతే ప్రభుత్వ అశక్తతకు కారణం ఏమిటో! ప్రైవేటు రంగం ప్రభుత్వం కన్నా మెరుగ్గా పని చేసిన దాఖలాలు ఉన్నాయా? లాభాపేక్ష లేకుండా ప్రైవేటురంగం వారు రూపాయి అయినా ఖర్చు పెట్టిన సందర్భాలు ఉన్నాయా? అంతర్జాతీయ స్థాయి వైద్య సదుపాయాలు ప్రభుత్వమే కల్పించి కీర్తి సంపాదించొచ్చుగా! ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో వైద్య కళాశాలల లోగుట్టు అంతిమంగా వైద్య విద్యను అమ్మకానికి పెట్టడమే. ప్రైవేటు ఆసుపత్రుల్లో హంగు ఆర్భాటాలు ఎన్ని ఉన్నా నాణ్యతకు ఎవరు పూచీ పడతారో?

అసెంబ్లీలో ప్రజావాణి శూన్యం

టి. లక్ష్మీనారాయణ

ఆంధ్రప్రదేశ్‌లోని చట్టసభల పనితీరును చూస్తే రాజకీయ శూన్యత కొట్టొచ్చినట్లు కనపడుతున్నది. శాసనసభలో ప్రజలవాణి వినిపించే కర్తవ్యాన్ని నిర్వర్తించలే మని ప్రతిపక్షపార్టీ చేతులెత్తే సింది. కూటమిలోని మూడు పాలకపార్టీలు ప్రత్యర్థిలేని శాసనసభలో ఏకపక్షంగా వ్యవహరించడం సహజమే కదా! ప్రభుత్వ పనితీరును పర్యవేక్షించే, ప్రశ్నించే, ప్రజా సమస్యలపై గళమెత్తే, చట్టాల రూపకల్పన సందర్భాల్లో ముసాయిదా బిల్లులను విమర్శనాత్మక దృష్టితో పరిశీలించి చర్చల్లో పాల్గొనే వారెవరు, అవసరమైతే సవరణలు ప్రతిపాదించే వారెవరు, లోపభూయిష్టమైన విధానాలను ప్రభుత్వం అమలు చేస్తుంటే ప్రత్యామ్నాయ విధానాలను సూచించేవారెవరు, పార్లమెంటరీ ప్రజాస్వా మ్యాన్ని బలోపేతంచేసే ఈ ప్రక్రియ నేడు ఆంధ్రప్రదేశ్‌లో ఆచరణలో లేదు. ఒక రకమైన విచిత్రమైన పరిస్థితి నెలకొని ఉన్నది.

శాసనసభలో ఉన్న ఏకైక ప్రతిపక్ష పార్టీ "ప్రతిపక్ష హోదా" చుట్టూ పరిభ్రమిస్తున్నది. మొత్తం సభ్యుల సంఖ్యలో 10% ప్రాతినిధ్యం లేకపోతే ప్రతిపక్ష హోదా కల్పించని నిబంధన లేదా పార్లమెంటరీ సాంప్రదాయం అమలులో ఉన్నది. అది అందరికీ విదితమే. అది ఇస్తేనే సభకు వస్తానని భీష్మించుకుని నేను పట్టిన కుందేలుకు మూడే కాళ్లన్న చందంగా వ్యవహరించడమంటే అసలు కారణం అది కాదని ఎవరికైనా అర్థమవు తుంది.

శాసనసభకు హాజరయ్యే నైతికబలం లేదని చెప్పకనే చెప్పినట్లుంది.

శాసన సభాపతి ఒకటికి పదిసార్లు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇచ్చే అవకాశమే లేదని తేల్చేశారు. హైకోర్టును ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై విశ్వాసం, చట్టసభలపై గౌరవం ఉంటే, ప్రజా తీర్పుకు బద్ధులై తమ నియోజకవర్గంలోని ప్రజలకు, రాష్ట్ర ప్రజానీకానికి ప్రాతినిధ్యం వహిస్తూ శాసనసభలో క్రియాశీలకంగా పాల్గొనాలి. గడిచిన శాసనసభ ఎన్నికల్లో వైస్సార్‌సీపీకి దాదాపు 40% ఓట్లు వచ్చాయి. ఆ ప్రజలపక్షాన నిలిచి శాసనసభలో తమ పాత్ర పోషించాలి కదా! ఆ పార్టీ తరుపున గెలిచిన వారిలో ఒక్కరు కూడా హాజరు కాలేదంటే ఆ పార్టీ నిర్మాణ వ్యవస్థ అప్రజాస్వామికంగా ఉన్నదని వేరే చెప్పనక్కరలేదు. రాజకీయ పార్టీలు, శాసన వ్యవస్థ, పాలనా వ్యవస్థ ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రయాణిస్తేనే సామాజికాభివృద్ధి సాధ్యపడుతుంది.

అవినీతి, నేర చరిత్ర ఉన్న వారిని ఎన్నుకొంటే చట్టసభలకు వన్నెరాదు. నాణ్యతా ప్రమాణాలు, నైతిక విలువలు పతనమౌతాయి. ప్రజలు ఎన్నుకున్న సభ్యులు పాలక పక్షంలో ఉంటే దర్జాగా అధికారదర్పంతో చట్టసభలకు వెళుతున్నారు. స్వప్రయోజనాలపైనే వారి దృష్టి ఉంటున్నది. అలాంటి వారి వల్ల సుపరిపాలన ఎండమావే. ప్రతిపక్షంలో ఉంటే చట్ట సభలకే వెళ్లకుండా ముఖం చాటేస్తున్నారు. కారణం అనైతిక చరిత్ర. చైతన్యం ప్రజల్లో వచ్చిన నాడే మన ప్రజాస్వామ్యానికి భవిష్యత్తు ఉంటుంది.

నిజాయితీ గల, బాధ్యతా యుతమైన ప్రతినిధులను చట్టసభలకు ఎన్నుకుంటే పాలక పక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిర్మాణాత్మకంగా సమాజంకోసం ఎంతో కొంత కృషి చేస్తారు. ఆంధ్రప్రదేశ్ సమస్యల వలయంలో చిక్కి విలవిల్లాడుతున్నది. రాజకీయ చైతన్యరాహిత్యం రాజ్యమేలుతున్నది.

శ్రామికుడిపై బాబు పనిభారం

బొల్లిముంత సాంబశివరావు

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం 16 నెలలుగా ప్రజా, రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు అమలు జరుపుతోంది. అందులో భాగమే ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీల చట్ట సవరణ బిల్లు. ఇది కార్మిక, శ్రామిక వ్యతిరేక బిల్లు. ఆంధ్రప్రదేశ్ దుకాణాల, వాణిజ్య సంస్థల చట్ట సవరణ బిల్లు 2025ను కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది. సవరణ బిల్లు ప్రకారం దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేసే రోజువారీ వేళలు 8 నుంచి 10 గంటలకు, ఫ్యాక్టరీ కార్మికుల రోజు వారి పని గంటలు 9నుంచి 10 గంటలకు పెరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు పనిచేసేందుకు బిల్లులో ఆమోదం తెలిపారు. గతంలో మూడు నెలల్లో 75 గంటలుగా ఉన్న ఓవర్ టైమ్ పనిని బిల్లు ద్వారా 144 గంటలకు పెంచారు. బిల్లులో సవరించిన అంశాలన్నీ 1948 ఫ్యాక్టరీల చట్టంలో పేర్కొన్న కార్మిక హక్కులకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయి.

సవరణ బిల్లు కోసం ఏపీ ఫ్యాక్టరీల చట్టంలోని అనేక నిబంధనల్లో మార్పులు చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం 2025 జూన్16న ముసాయిదా బిల్లు విడుదల చేసింది. ఈ ముసాయిదా బిల్లునే ఇప్పుడు శాసనసభ, శాసనమండలి ఆమోదించాయి. చట్టంలోని సెక్షన్ 54 అనేది కార్మికుల పని గంటలకు సంబంధించినది. కార్మికుడు రోజుకు, వారానికి ఎన్ని గంటలు పని చేయాలి అనేది ఈ సెక్షన్ పేర్కొంటుంది. దీని ప్రకారం కార్మికుడు రోజుకి 8.30 గంటలు పని చేయాలి. ఇందులో భోజన విరామం 30 నిమిషాలు ఉంటుంది. చట్టంలోని సెక్షన్ 54లో మార్పులు చేసి రోజుకి 10.30 గంటలు పని చేయాలని, అందులో భోజన విరామం అర్ధ గంటగా బిల్లులో పేర్కొనటం జరిగింది. ప్రస్తుతం చేస్తున్న 9గంటల కన్నా అదనంగా గంట పని చేయాలి. దుకాణాల్లో పనిచేసేవారు అదనంగా రెండు గంటలు పని చేయాలి. ఈ సవరణతో ఎటువంటి వేతనం లేకుండా కార్మికుని అదనపు శ్రమశక్తిని యజమానులు కొల్లగొట్టి లాభాలు పొందుతారు. అదనపు శ్రమ చేయటంవల్ల కార్మికుడు దోపిడీకి గురౌతాడు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మారుస్తానని చంద్రబాబు చెప్పటం అంటే కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేసి జీవితాలను అంధకారంలోకి నెట్టి, యజమానుల లాభాలు పెంచటమా!

చట్ట సవరణ బిల్లులో వారానికి 48 గంటల పని యథాతథంగా ఉంటుందని చెప్పటం ఆశ్చర్యంగా ఉంది. రోజుకి 10 గంటల ప్రకారం వారంలో 60 గంటలు పని చేయాలి. అలాంటప్పుడు 48 గంటలు ఎలా అమలు జరుగుతుంది. అందుకు సంబంధించిన వివరాలు ఏమీ చెప్పలేదు. పనిదినాలు తగ్గితేనే అది సాధ్యం అవుతుంది. ఫ్యాక్టరీల చట్ట సవరణ బిల్లుకు ముందు ప్రతి మూడు నెలలకు 50 నుంచి 75 గంటలు కార్మికుని రాత పూర్వక అనుమతితో అదనంగా ఓవర్ టైమ్ పనిచేయించవచ్చు. సవరణల బిల్లులో దాన్ని 144 గంటలకు పెంచారు. దీనివల్ల విశ్రాంతి లేకుండా పనిచేయడంవల్ల కార్మికులపై పనిభారం పడడంతో వత్తిడికిలోనై ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు ఏర్పడతున్నాయి. ఓవర్ టైమ్ పనిచేసినందుకు ఇచ్చే వేతనంలో కూడా వ్యత్యాసం ఉంది. ఇద్దరు చేయాల్సిన పనిని ఒకరి చేత చేయిస్తారు. దీనివల్ల ఫ్యాక్టరీ యజమాని అదనంగా కార్మికులను నియమించుకునే అవసరం లేకుండా అధిక లాభాలు పొందితే, మరోపక్క ఉపాధి లేమితో నిరుద్యోగం పెరుగుతుంది. చట్ట సవరణలకు ముందు అత్యవసర సర్వీసుల్లో సమ్మె చేయాలంటే 14 రోజుల ముందు సమ్మె నోటీసు ఇవ్వాలి. దీన్ని అత్యవసరం కాని సర్వీసులకు కూడా సవరణల తర్వాత వర్తింపచేశారు. ఫలితంగా అత్యవసరం కాని సర్వీసుల్లో నోటీస్ ఇవ్వకుండానే సమ్మె చేసే హక్కును కార్మికులు కోల్పోతారు.

చట్ట ఉల్లంఘున పైన, ఫ్యాక్టరీల్లో ప్రమాదాల పైనా యాజమాన్యం చిన్నపాటి నష్టపరిహారంతో తప్పించుకునేందుకు చట్టంలో సవరణ చేశారు. దీన్ని అవకాశంగా తీసుకుని యాజమాన్యం ప్రమాదాల బాధ్యత నుంచి, చట్ట ఉల్లంఘనల నుంచి శిక్షను తప్పించుకునే అవకాశం ఏర్పడింది. ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు లభించే పరిహారం నిరుపయోగంగా మారుతుంది. ఫ్యాక్టరీల చట్టంలోని సెక్షన్ 66 ప్రకారం మహిళా కార్మికులతో రాత్రి ఏడు గంటల తర్వాత ఉదయం 6గంటలలోపు పని చేయించకూ డదు. దీన్ని సవరిస్తూ బిల్లులో మహిళలు రాత్రిపూట కూడా పని చేయవచ్చని పేర్కొన్నారు. ఇది మహిళలకు సమాన హక్కు కల్పించటంగా పేర్కొంది. వాస్తవంలో తక్కువ వేతనంతో మహిళల శ్రమశక్తిని యజమానులు కొల్లగొట్టే అవకాశం బిల్లు ద్వారా కల్పించటమే. భారత సామాజిక వ్యవస్థ అర్ధ భూస్వామ్య సంస్కృతిని కొనసాగిస్తున్నది. ఫలితంగా పురుషాధిక్యత కొనసాగుతూ స్త్రీని విలాస వస్తువుగా చూస్తున్నది. స్త్రీలపై నిరంతరం అనేక అత్యాచారాలు, హత్యలు కొనసాగుతున్నాయి. ఫ్యాక్టరీల్లో పట్ట పగలే స్త్రీలు అత్యాచారాలకు గురౌతున్నారు. అలాంటి పరిస్థితుల్లో రాత్రిపూట పనిచేసే మహిళా కార్మికులకు భద్రత ఎలా ఉంటుంది. యజమానులు కల్పించే మహిళా భద్రత ఎలాంటిదో స్త్రీలకు, ప్రజలకు తెలిసిన విషయమే.

2022లో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను ఏకీకృతం చేయటం పేరుతో కార్మిక హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా తయారుచేసి వాటిని చట్టాలుగా మార్చేందుకు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టినప్పుడు టీడీపీ దానికి మద్దతు తెలిపింది. అప్పుడే తన కార్మిక వ్యతిరేకతను చాటుకుంది. కార్మిక వ్యతిరేక విధానాలు అమలు జరపడంలో మోదీ విధానాలనే చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఏపీ ఫ్యాక్టరీల చట్ట సవరణ బిల్లు ద్వారా పరిశ్రమలు, సంస్థలపై ప్రస్తుత చట్టం వల్ల కలిగే విధానపరమైన ఇబ్బందులు తొలగించేందుకు చేసిందిగా కూటమి ప్రభుత్వం చెప్పటం ద్వారా పరిశ్రమల, యజమానుల ప్రయోజనాలు కాపాడి, కార్మిక హక్కులను కాల రాయటం అనే కూటమి ప్రభుత్వ విధానం బయటప డింది. 2004కు ముందు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రభుత్వరంగాన్ని, సోషలిస్టు ఆర్థిక విధానాలను బహిరంగంగానే విమర్శించారు. ఆయన ఆలోచనలు, విధానాలు పెట్టుబడిదారుల, ఫ్యాక్టరీల యజమానుల చుట్టూ తిరుగుతూ, కార్మిక హక్కులను హరించేవిగా ఉంటాయి. అందులో భాగమే కార్మిక వ్యతిరేక ఫ్యాక్టరీల చట్ట సవరణ బిల్లు. ఈ బిల్లును వెంటనే ఉపసంహరించాలని, కార్మిక హక్కులు కాపాడాలని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మిక, శ్రామిక వర్గం ఉద్యమించాలి.

సెల్: 9885983526

ఆదర్శ కమ్యూనిస్టు డా.చెలికాని

పీఎస్ ప్రకాశరావు

తొలితరం పార్లమెంటేరియన్, అభ్యుదయవాది, ఆదర్శ కమ్యూనిస్టు డా. చెలికాని వెంకటరామారావు 1901, జులై 15వ తేదీన కాకినాడ దగ్గరున్న తిమ్మాపురంలో వారి మాతామహులు రావు తిరుపతిరావు, వెంకాయమ్మ ఇంటివద్ద నారాయణస్వామి, సూరమ్మ దంపతులకు జన్మించారు, పిఠాపురం పక్కనున్న కొండెవరంలో పెరిగారు. 1918లో పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ హైస్కూల్లో ఎస్ఎస్ఎల్‌సీ చదివి ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. తెలివైన విద్యార్థులను ప్రోత్సహించే పిఠాపురం రాజా ఎఫ్ఏ (నేటి ఇంటర్‌కి సమానం) చదవడంలో రామారావుకి సాయం చేశారు. కానీ కాకినాడలో చదువు ప్రారంభించాక రామారావుని జాతీయోద్యమం ఆకర్షించింది. ఉద్యోగం వచ్చే చదువుకంటే ఉద్యమమే ముఖ్యమనే భావం ఆయనలో బలపడిపోయింది. ఫలితంగా పరీక్ష ఫెయిలయ్యారు. తిరిగి పరీక్ష రాయమని తండ్రి, అన్న చేసిన బోధలు ఆయన మనో సంకల్పాన్ని కదల్చలేకపోయాయి. నిండా 20 ఏళ్ల వయసులేదు. ఉద్యమంలో తానూ ఒక సమిధను కావాలనుకున్నారు. 1921 జనవరి 26 తెల్లవారుఝామున కన్నవాళ్లనూ, ఉన్నవూరిని, పై చదువులకి పిఠాపురం రాజా ఇచ్చే సాయాన్నీ వదిలి, కట్టుబట్టలతో కాలినడకన వెళ్లిపోయి స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రవేశించారు. వెళ్లే ముందు తన అన్నకి రాసిన ఉత్తరంలో తన చదువుకి తోడ్పాటునందించిన పిఠాపురం రాజాకి కృతజ్ఞతలు తెలిపారు. తను వెళ్లేది పూలబాట కాదని తెలిసే వెళ్లారు. కడుపు మాడ్చుకోవలసి వచ్చినా, బుల్లెట్లు దిగే సందర్భం వచ్చినా కాళ్లబేరానికి దిగలేదు. హరిజనోద్ధరణ కార్యక్రమాలలోనూ, మద్యపాన వ్యతిరేక కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. 1922 లో జైలుకెళ్లి మొదటిసారిగా నూతన సిద్ధాంతాల గురించి తెలుసుకున్నారు. అఖిలభారత కాంగ్రెస్ మహాసభ కాకినాడలో జరిగినప్పుడు వేలాదిమందికి వసతులు, భోజనాలు, స్నానాలు, రవాణా వంటి సదుపాయాల బాధ్యత నిర్వర్తించారు. 1922 నాటి జైలు జీవితం ఓ రకమైన ప్రభావం చూపితే, ఈ కాకినాడ సభ ఆయనలో మరో స్ఫూర్తిని కలిగించింది. దేశానికి డొమినియన్ ప్రతిపత్తా? పూర్ణ స్వరాజ్యమా? సామ్రాజ్య వ్యతిరేక విధానం అవలంబించాలా? అనే బేధాభిప్రాయాలు తలెత్తాయి. ఒక సంవత్సరంలో స్వరాజ్యం వస్తుందని నమ్మి వచ్చిన రామారావులో ఇవి ఆత్మవిమర్శకు దారితీశాయి. సమాజసేవ చేయాలనుకున్నారు. మధ్యలో వదిలేసిన ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. వైద్యవృత్తి చేపట్టాలనుకున్నారు. వైద్యవిద్య ఖర్చుల కోసం హైదరాబాద్‌లో ఇంగ్లిష్ ట్యూషన్ చెప్పారు. సరోజినీ నాయుడు భర్త గోవిందరాజులు నాయుడే వైద్యకళాశాలలో రామారావుకి గురువు. నాయుడుగారి ఇల్లు (గోల్డెన్ త్రెషోల్డ్)ఆ రోజుల్లో సంస్కరణవాదులకు, జాతీయవాదులకు నిలయం. రామారావు తన ఖాళీ సమయాన్నంతా అక్కడే గడిపారు. ఆ కాలంలోనే ఆంధ్ర మహాసభ కార్యకలాపాలు, భాషోద్ధరణ, సాంస్కృతిక విద్యా సంస్కరణ ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. వైద్య పట్టా పరీక్షలు పదిహేను రోజుల్లో ప్రారంభమవుతాయనగా బులుసు సాంబమూర్తి కోరిక మేరకు తూర్పుగోదావరి జిల్లాలో జరిగే ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనడానికి కాలేజీ వదిలిపెట్టారు. గాంధీజీ పుట్టిన రోజున సభలలో ప్రసంగించకూడదని ప్రభుత్వం విధించిన 144 సెక్షన్‌ని ధిక్కరించినందుకు ఆయనను అరెస్ట్ చేశారు. రాజమండ్రి జైలులో పరిచయమైన బెంగాల్ సోషలిస్టు నాయకుల ద్వారా సోషలిజం పట్ల ఆకర్షితులయ్యారు. పుచ్చలపల్లి సుందరయ్యతో పరిచయం ఇక్కడే జరిగింది. ఈ పరిచయమే సుందరయ్య కాకినాడలో ఉన్న రామారావు ఇంట్లో కొన్నాళ్లు ఉండటానికి పనికొచ్చింది. జైల్లోనే రష్యా విప్లవం గురించి, మార్క్సిజం గురించి తెలుసుకున్నారు. రాజమండ్రి జైలునుంచి విడుదలయ్యాక ప్రభుత్వం మళ్లీ అరెస్ట్ చేసి బళ్ళారి జైలుకు పంపింది. లాకప్‌లు, లాఠీలు, తూటాలు ఉక్కులాంటి ఆయన దృఢ సంకల్పాన్ని అణువంత కూడా కదల్చలేకపోయాయి. ఖద్దరు వస్త్రాలు రోడ్డుమీద కనిపించడమే ప్రమాదకరంగా మారిన రోజుల్లో ఆయన పోలీసువారి ఇళ్లకెళ్లి ఖద్దరు అమ్మడం విశేషం. రామచంద్రపురంలో జరిగిన మహిళా సమావేశంలో పాల్గొన్నప్పుడు జరిగిన పోలీసుల లాఠీచార్జీలో రామారావు స్పృహ కోల్పోయినా ఆయన పట్టుదల అణువంత కూడా తగ్గలేదు. సత్యాగ్రహోద్యమం కాలంలో రణదుందుభి, తిరుగుబాటు వంటి పత్రికలను రహస్యంగా పంచారు. కాకినాడలో కాంగ్రెస్ ఆఫీసుకు ఇల్లు ఎవరు అద్దెకిచ్చినా జైలు పాలవుతారని ప్రభుత్వం దండోరా వేయించినా రామారావు పెద్దాడ కామేశ్వరమ్మతో కలిసి పిండాల చెరువు గట్టుమీద పట్టమర్తి మార్తాండ రామమూర్తి ఇల్లుని ఆఫీసుకు ఇచ్చేలా చేశారు. 1930 లో ఉద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా అరెస్ట్ చేసి బళ్లారి జైలులో పెడితే అక్కడ రామారావుకి టీబీ సోకింది. వైద్యం చేయించుకుని హైదరాబాద్‌లో వైద్య పరీక్ష రాసి పట్టాతో తిరిగొచ్చారు. హరిజనోద్యమంలో మళ్లీ అరెస్ట్ చేస్తే కోరాపుట్, కడలూరు జైళ్లలో 18 నెలల జైలు శిక్ష అనుభవించారు. 1937లో బర్మా వెళ్లి రంగూన్ లో వైద్యవృత్తి చేస్తూ జిల్లాలోని హరిజన సేవాకేంద్రాలకు ప్రతి నెలా డబ్బు పంపించేవారు.

1952 లో తొలిపార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. రామారావు కమ్యూనిస్టు పార్టీ తరుపున కాకినాడ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండి ప్రచారానికి వెళ్లకుండానే ప్రజాపార్టీ నాయకుడైన బులుసు సాంబమూర్తినీ, కాంగ్రెస్ అభ్యర్థి మొసలికంటి తిరుమల రావునీ ఓడించారు. పార్ల మెంటేరియన్‌గా నెహ్రూ వంటివారి మెప్పును పొందారు. అల్లూరి సీతారామరాజు సహచరుడైన గాము(గాం) మల్లుదొర పార్లమెంట్ సభ్యునిగా ఉన్నప్పటికీ ఏ రకమైన అలవెన్సులూ ఇవ్వకుండా మోసం చేస్తున్నారని తెలిసి ఆయన్ని నెహ్రూ దగ్గరకు స్వయంగా తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేశారు. ఆయన చరమదశలో స్వాతంత్ర సమరయోధులకు పెన్షన్లు వచ్చేవి. ఉద్యమంలో పాల్గొని సాంకేతిక కారణాలవల్ల పెన్షన్ రాని కుటుంబాలవారికి, పోరాటయోధుల సంతతికి తన పెన్షన్ నెలకింతని ఇచ్చేవారు తప్ప తన కోసం ఖర్చు చేసుకునే వారు కాదు. తనను కలవలేని వారికి మనియార్డర్ చేసేవారు. ఆయన నుంచి ఆ విధమైన ధన సహాయం పొందినవారిలో ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన చింతం సత్యనారాయణ దాసు భార్య ఒకరు.

రామారావు ఆదర్శప్రాయమైన దాంపత్య జీవితం గురించి కూడా చెప్పుకోవాలి. క్షయ వ్యాధిపై డిప్లొమా చేయడానికి 1934లో మైసూర్ వెళ్లారు. అక్కడ అనుకోకుండా వైద్య విద్యార్థిగా ఉన్న కమలమ్మని కలిశారు. ఆమె తండ్రి రామస్వామి నాయుడు బ్రహ్మ సామాజికులూ, వీరేశలింగం అనుచరులు కూడా కావడం వల్ల తన కుమార్తెలను వీరేశలింగం సంరక్షణలో పెంచి పెద్దజేశారు. ఆ విధంగా రామారావు కమలమ్మ పరిచయం వివాహానికి దారితీసింది. 1940లో కమలమ్మ రామచంద్రపురం హాస్పిటల్‌కి మెడికల్ ఆఫీసర్‌గా రావడంతో రామారావు కార్యక్రమాలకు అదే కేంద్రస్థానమైంది. 1948 నుంచి 1951 వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టులను అతిదారుణంగా హింసకు గురిచేసింది. రామారావు రామచంద్రపురంలో వైద్యం చేస్తూ ఉంటే ప్రజా ఉద్యమాన్ని ఆపడం కష్టమని ప్రభుత్వం ఆయన్ని అరెస్టు చేసి కడలూరు జైలులో పెట్టింది. అక్కడ కాల్పులు జరిగి అనుమర్లపూడి సీతారామారావు అనే రైతునాయకుడు చనిపోవడం, కొందరు గాయాల పాలవడం జరిగినా, తుపాకీ గుండ్ల మధ్య వెళ్లి రామారావు తోటి ఖైదీలకు వైద్య సేవలందించారు. స్త్రీ విద్య అంతంత మాత్రంగా ఉన్న ఆ రోజుల్లో ఆయన సోదరి కుమార్తెను కుటుంబంలో మొదటి మహిళా డాక్టర్‌ని చేశారు. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని పార్లమెంటులో వాదించడమే కాదు కమలమ్మ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఎప్పుడూ గుర్తిస్తూ ఉండేవారు. ఇద్దరూ వైద్యులే అయినా రామారావు పేషెంట్లు బీదప్రజలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలే కాబట్టి ఆయనకు సేవ ఎక్కువా పొదుపు తక్కువా అయింది. ఒకవేళ పదో పరకో వచ్చినా దాన్ని కూడా తిరిగి పేదల మందులకో ఆహారానికో ఖర్చుపెట్టేసేవారు. తన ఆస్తిపై వచ్చే ఆదాయాన్ని దేశసేవలో భాగంగా అమ్మేశారు. ఒక గృహస్థుగా వేలమందికి ఆతిథ్యమిచ్చారు.

రామారావు తొలి పార్లమెంటులో లేవనెత్తిన సమస్యలు ఈనాటికీ అలాగే ఉన్నాయి. ప్రజాప్రతినిధుల జీతభత్యాలు, మతం, ఆత్మరక్షణార్థం పేరుతో అమాయకులను కాల్చి చంపడం, మద్యనిషేధం, నాణ్యమైన ఉచిత వైద్యం, కాకినాడ కోటిపల్లి రైలు మార్గపునరుద్ధరణ, ప్రజలకు చౌకగా ఔషధాల సరఫరా చేసే పరిశ్రమ, నదీ జలాలు, రాష్ట్రాల పునర్విభజన, స్త్రీల వారసత్వ హక్కులు, ఆహార కల్తీ , మందుల మాయాజాలం... ఇలా పార్లమెంట్‌లో ఆయన లేవనెత్తిన సమస్యల గురించి చెప్పాలంటే ఒక పెద్దగ్రంథం తయారవుతుంది. సంఘ సంస్కరణ, విప్లవభావాల సమ్మేళనం అయిన రామారావు భౌతికవాదిగా, కమ్యూనిస్టుగా పరిణామం చెందారు. ఆ జన్మాంతం ఆదర్శజీవితాన్ని గడిపి భావితరాల వారికి ఆదర్శంగా నిలిచి తన 84 వ యేట 1985 సెప్టెంబరు 25న తుదిశ్వాస విడిచారు. స్థానిక పెద్దలంతా కలిసి ఆయన స్మారకార్థం ఒక భవనం నిర్మించారు. 1988 సెప్టెంబరు 25న వావిలాల గోపాలకృష్ణయ్య దానికి శంకుస్థాపన చేశారు. కమ్యూనిస్టు పార్టీ జాతీయకార్యవర్గ సభ్యులు నీలం రాజశేఖరరెడ్డి భవనాన్ని ప్రారంభించారు. ఆయన వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా ప్రముఖులు ఇచ్చిన ఉపన్యాసాలను 'వీక్షణం' పేరుతో పుస్తక రూపంలో తీసుకొచ్చారు. పార్లమెంట్‌లో ఆయన ప్రసంగాలను చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ 'తొలి పార్లమెంట్ లో డాక్టర్ రామారావు' పేరుతో పుస్తక రూపం తీసుకువచ్చింది. రామారావు గురించి కమ్యూనిస్టు అగ్ర నాయకులు చంద్ర రాజేశ్వరరావు చెప్పినట్టు "వారు తమ జీవితాన్నంతా దేశఔన్నత్యానికి, ప్రజాసేవకు, సంఘ సంస్కరణకు, సాంఘిక న్యాయానికి అంకితం చేశారు.

సెల్: 99637 43021

ఆధారాలు సీఐడీకి ఇచ్చేదెప్పుడు?

ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు రాహుల్ సూటి ప్రశ్న

న్యూఢిల్లీ: కర్నాటకలోని అలంద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 'ఓట్ల దొంగతనం' పై దర్యాప్తు చేస్తున్న సీఐడీ అడిగిన మేరకు ఆధారాలు ఎప్పుడు ఇస్తారని కాంగ్రెస్ అగ్రనేత లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఓట్ల చోరీ జరిగినట్లు గుర్తించిన తర్వాతే ఈసీ చర్య తీసుకుందని రాహుల్ తెలిపారు. ఓటర్లను చేర్చడం లేదా తొలగించడం కోసం ధృవీకరణను తప్పనిసరి చేసే ఈసీ యొక్క కొత్త ఆధార్ ఆధారిత 'ఇ-సైన్' ఫీచర్‌ను హైలైట్ చేస్తూ మీడియా నివేదికలను రాహుల్ ఉదహరించారు. ఇదంతా ఆలస్యంగా అమలు చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. "జ్ఞానేశ్ జీ, మేము దొంగతనాన్ని నిరూపించాక మాత్రమే మీకు తాళం వేయడం గుర్తొచ్చిందా? ఇప్పుడు మేము దొంగలను కూడా పట్టుకుంటాము. కాబట్టి మాకు చెప్పండి, మీరు సీఐడీ కి ఎప్పుడు ఆధారాలు ఇవ్వబోతున్నారు?" అంటూ రాహుల్ పోస్ట్ చేశారు.

సత్వరం వరద సాయం అందించండి

కోల్‌కతాలో కుండపోత వర్షాలు, వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం సంతాపం తెలిపారు. సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. "ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదల కారణంగా సంభవించిన విధ్వంసాన్ని సహిస్తున్న కోల్‌కతా, పశ్చిమ బెంగాల్‌లోని ఇతర ప్రాంతాల ప్రజలతో నా ఆలోచనలు ఉన్నాయి. తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు హృదయపూర్వక సంతాపం" అని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో స్పందించారు. సాధ్యమైన అన్ని సహాయాలను బాధితులకు అందించాలని కాంగ్రెస్ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు: మమత

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా వర్ష సంబంధిత సంఘటనలలో ప్రాణాలు కోల్పోయిన వారి బంధువులకు రూ. 2 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. కోల్‌కతా, పరిసర ప్రాంతాలలో విద్యుత్ ప్రదాత అయిన కలకత్తా విద్యుత్ సరఫరా సంస్థ (సీఈఎస్‌సీ) మహానగరంలో విద్యుదాఘాతానికి గురైన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందించాలని ఆమె కోరారు. రాష్ట్రంలో మంగళవారం నుంచి వర్ష సంబంధిత సంఘటనల కారణంగా కనీసం 10 మంది మరణించారు. వారిలో తొమ్మిది మంది కోల్‌కతాలో వరద నీటిలో వేలాడుతున్న విద్యుత్ వైర్లను తాకి విద్యుత్ షాక్‌కు గురై మరణించారని అధికారులు తెలిపారు. దక్షిణ కోల్‌కతాలో దుర్గా పూజ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబ సభ్యులకు ఉపాధి కూడా కల్పిస్తుందన్నారు. 'నిన్న విద్యుదాఘాతానికి గురైన వారి బంధువులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియాను అందిస్తుంది. డబ్బు ప్రాణాలను భర్తీ చేయదు. కానీ సీఈఎస్‌సీ ఉద్యోగాలు ఇవ్వకపోయినా, కుటుంబ సభ్యులకు ప్రత్యేక ఉపాధి కల్పించేలా చూస్తాము' అని తెలిపారు. విద్యుదాఘాత మరణాలకు బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి సీఈఎస్‌సీకి విజ్ఞప్తి చేశారు. 'వారి నిర్లక్ష్యం వల్లే మరణాలు సంభవించినందున ఆ కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించాలని కూడా నేను సీఈఎస్‌సీని అభ్యర్థిస్తాను' అని ఆమె అన్నారు. మంగళవారం కోల్‌కతా, పరిసర జిల్లాల్లో వరదల వంటి పరిస్థితిని సమీక్షిస్తున్న బెనర్జీ, నగరంలోని చాలా ప్రాంతాల్లో వరద నీరు తగ్గిందని చెప్పారు. దశాబ్దాలుగా జల మార్గాల త్రవ్వకం తగినంతగా లేకపోవడం వల్ల సమస్య తీవ్రమైనదని అన్నారు.

సింగిల్ మార్కెట్లపై ఆధారపడటం తగ్గిద్దాం

విదేశాంగమంత్రి జైశంకర్

న్యూఢిల్లీ: ప్రపంచ దేశాలపై సుంకాలతో అమెరికా విరుచుకుపడుతు ఉండటం, మార్కెట్లు అనిశ్చితికి గురవుతున్న వేళ భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సరఫరా గొలుసును సుస్థిరపరచుకోవడం ద్వారా సింగిల్ మార్కెట్, ఒకే సరఫరాదారుపై ఆధారపడటం తగ్గించుకోవాలని గ్లోబల్ సౌత్ దేశాలకు విజ్ఞప్తి చేశారు. ఐరాస సాధారణ సభ 80వ సమావేశాల్లో భాగంగా భావసారూప్యత కలిగిన దక్షిణాది దేశాల ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'పెరుగుతున్న అనిశ్చితులు, ప్రపంచ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్న సమయంలో మనం సమావేశమయ్యాం. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాలు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. మహమ్మారి నుంచి తేరుకోక ముందే ఉక్రెయిన్, గాజా యుద్ధాలు మొదలు ప్రతికూల వాతావరణ ఘటనలు, అస్థిర వాణిజ్యం... పెట్టుబడుల ప్రవాహం, వడ్డీ రేట్లలో అనిశ్చితితోపాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అజెండాలో గణనీయ క్షీణత కనిపించడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నాం' అని జైశంకర్ పేర్కొన్నారు. ఈ స్థాయిలో ఆందోళనలు, ప్రమాదాలు ముంచుకొస్తున్న వేళ గ్లోబల్ సౌత్ దేశాలు బహుపాక్షికత వైపు చూడడం సహజమేనని అన్నారు. దురదృష్టవశాత్తు ఇక్కడ కూడా నిరాశాజనకంగా కనిపిస్తోందని, బహుపాక్షికత అనే భావనపై దాడులు, అంతర్జాతీయ సంస్థలు అసమర్థంగా మారడం లేదా వనరుల కొరతను ఎదుర్కోవడం సమస్యలను మరింత పెంచుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ వ్యవస్థలో తగిన ప్రాధాన్యం కోసం గ్లోబల్ సౌత్ దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛాయుత ఆర్థిక పద్ధతులు అనుసరించడంతోపాటు దక్షిణాది వాణిజ్యాన్ని పెంచుకోవడం, సాంకేతిక సహకారం అందించుకోవడం వంటివి ఎంతో ముఖ్యమని జైశంకర్ స్పష్టం చేశారు.

మోదీ అవినీతి పాలన అంతానికి బీహార్ ఎన్నికలే నాంది

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దేశంలో మోదీ ప్రభుత్వ అవినీతి పాలన ముగింపుకు నాంది పలుకుతాయని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే అన్నారు. బీహార్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఓట్ చోరీ విషయంలో బీజేపీని మరింత ఇరుకున పెట్టడంపై చర్చించేందుకు బీహార్ రాజధాని పట్నాలో బుధవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) బుధవారం భేటీ అయ్యింది. సదాకత్ ఆశ్రమంలో మల్లికార్జున ఖడ్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, అజయ్ మాకెన్, కేసీ వేణుగోపాల్ తో పాటు సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, కాంగ్రెస్ పాలిత రాష్ట్ర సీఎంలు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు హాజరయ్యారు. స్వాతంత్ర్యం తర్వాత బీహార్‌లో సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఖడ్గే మాట్లాడుతూ.. బీజేపీ మతతత్వ రాజకీయాలపై బీహార్ ప్రజలు ఆసక్తి చూపడం లేదని, అభివృద్ధి, సంక్షేమం ఆధారంగా రాజకీయాలను కోరుకుంటున్నారని అన్నారు. బీహార్‌లో ఎన్డీఏ కూటమిలో లుకలుకలు మొదలయ్యాయని... సీఎం నితీశ్ కుమార్‌ను బీజేపీ ఒక భారంగా భావిస్తోందని ఆరోపించారు. దౌత్యంలో అంతర్జాతీయ స్థాయిలో మోదీ, ఆయన ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. మోదీ నా స్నేహితుడు అని చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు ట్రంపే ఇండియాను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని విమర్శించారు. ఓట్ చోరీ విషయంలో ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, పారదర్శకతపై ఆందోళనలు తలెత్తుతున్నాయని అన్నారు. వివిధ రాష్ట్రాల్లో ఓట్ చోరీపై రాహుల్ గాంధీ లేవనెత్తే విషయాలను పరిష్కరించకుండా... అఫిడవిట్లు సమర్పించాలని ఈసీ ఒత్తిడి చేస్తోందని అసహనం వ్యక్తం చేశారు. స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో బీహార్ తరహాలో దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఓట్లను చీల్చడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఓట్ చోరీ చేయడమంటే దళితులు, గిరిజనులు, వెనుకబడినవారు, అత్యంత వెనుకబడినవారు, మైనారిటీల హక్కులను దొంగలించడమేనని అన్నారు. ఈ విషయంలో దేశ ప్రజలు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి దబహిరంగంగా మద్దతుగా నిలిచారని ఆయన అన్నారు.

ఎనిమిదేళ్ల ప్రజల సొమ్ము పిండుకున్నారు....

ఎనిమిదేళ్ల అస్తవ్యస్త జీఎస్టీతో లక్షల కోట్ల రూపాయల ప్రజలసొమ్మును మోదీసర్కారు దోచేసిందని ఖడ్గే విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ మొదటి రోజు నుంచి డిమాండ్ చేస్తున్న అదే సంస్కరణలను జీఎస్టీలో ప్రవేశపెట్టారని ఖడ్గే తెలిపారు. "మోదీజీ మహాత్మా గాంధీ 100 ఏళ్ల నాటి 'స్వదేశీ' మంత్రాన్ని గుర్తు చేసుకుంటున్నారు. దీనిని కాంగ్రెస్ పార్టీ బ్రిటిష్ వారిని ఓడించడానికి ఉపయోగించింది. మరోవైపు, చైనాకు బహిరంగంగా ఎర్ర తివాచీలు పరుస్తున్నారు. గత ఐదు సంవత్సరాలలో చైనా నుంచి మన దిగుమతులు రెట్టింపు అయ్యాయి" అని ఆయన అన్నారు.

డబుల్ ఇంజిన్ ఖాళీగా!

నితీశ్ కుమార్‌కు తిరిగి మద్దతు ఇవ్వడం ద్వారా బీజేపీ జనవరి 2024లో ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని ఖడ్గే అన్నారు. "నితీశ్ ప్రభుత్వం అభివృద్ధికి హామీ ఇచ్చింది, కానీ బీహార్ ఆర్థిక వ్యవస్థ వెనుకబడి ఉంది. కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ లేకుండా 'డబుల్ ఇంజిన్' ఖాళీగా ఉంది. నిరుద్యోగిత రేటు 15 శాతం కంటే ఎక్కువగా ఉంది. ఏటా లక్షలాది మంది యువత వలస వెళుతున్నారు. నియామకాల కుంభకోణం కారణంగా యువకులు వీధుల్లో నిరసనలు తెలుపుతున్నారు. పోలీసుల లాఠీచార్జీని ఎదుర్కొంటున్నారు" అని ఖడ్గే తెలిపారు. బీ హార్‌లో రైతుల పరిస్థితి బహుశా దేశంలోనే అత్యంత దారుణంగా ఉందన్నారు. పతి సంవత్సరం కోసి, గండక్ నదుల వరదల కారణంగా లక్షలాది మంది ప్రజలు నష్టపోతున్నారని... వరద నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనడానికి ఇది నిదర్శమని ఆయన పేర్కొన్నారు. బీహార్ చక్కెర పరిశ్రమను పునరుజ్జీవింపజేస్తామని ప్రధానమంత్రి అనేక సందర్భాల్లో హామీ ఇచ్చారని, పదేళ్ల తర్వాత కూడా ఆయన హామీ నెరవేర్చలేదని విమర్శించారు.

ఆరు సీట్లిస్తే 'ఇండియా'లో చేరతాం: ఒవైసీ



కిషన్‌గంజ్ (బీహార్): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీహార్‌లో ఆరు స్థానాల్లో పోటీకి అవకాశమిస్తే ఇండియా ఐక్య సంఘటనలో తాము కలుస్తామని ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ బుధవారం తెలిపారు. బీహార్‌లో 'బీజేపీకి సహాయం చేస్తున్నారనే' ఆరోపణలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దాదాపు మూడింట రెండు వంతుల ముస్లిం జనాభా ఉన్న ఉత్తర బీహార్ జిల్లా కిషన్‌గంజ్‌లో మూడు రోజుల 'సీమాంచల్ న్యాయ్ యాత్ర'ను హైదరాబాద్ ఎంపీ ప్రారంభించారు. 'నా పార్టీ బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడికి (తేజస్వీ యాదవ్) అనేక లేఖలు రాశారు. చివరి లేఖలో 243 మంది సభ్యుల అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో ఏఐఎంఐఎంకి ఆరు స్థానాలు కల్పించాలని అభ్యర్థించారు' అని ఒవైసీ తెలిపారు. 'ఇప్పుడు బంతి ఇండియా ఐక్య సంఘటన కోర్టులో ఉంది. బీజేపీకి సహాయం చేస్తున్నారనే ఆరోపణలు రాకుండా ఉండేందుకు మేము ఈ చర్య తీసుకున్నాము. ఇండియా ఐక్య సంఘటన వైపు నుంచి సరైన స్పందన లేకపోవడం వల్ల కాషాయ పార్టీకి ఎవరు సహాయం చేస్తున్నారో స్పష్టంగా తెలుస్తుంది' అని ఆయన అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం 20 సీట్లలో పోటీ చేసి... ఐదు స్థానాలు గెలుచుకుంది. ముఖ్యంగా మైనారిటీ జనాభా ఎక్కువగా ఉన్న సీమాంచల్ ప్రాంతంలో ముస్లిం ఓట్లను చీల్చడం ద్వారా మహాఘట్బంధన్ మెజారిటీని పొందలేకపోయిందని ఆరోపణలు వచ్చాయి. అయితే బీహార్ అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ తప్ప ఎంఐఎం నుంచి ఎన్నికయిన ఎమ్మెల్యేలందరూ ఎన్నికలు జరిగిన రెండేళ్ల తర్వాత ఆర్‌జేడీలో చేరారు. 'హైదరాబాద్‌లో పోటీ చేయడానికి మాకు కొన్ని సీట్లు లభిస్తే' ఆర్‌జేడీ బీహార్‌లో ఎంఐఎంకి అవకాశం కల్పించగలదని తేజస్వీ చేసిన వ్యాఖ్యపై ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వారు ఇండియా ఐక్య సంఘటనలో భాగం. కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలో ఉంది. వారు కోరుకుంటే అక్కడ ఎన్నికల్లో పోటీ చేసి ఓట్లు పొందనివ్వండి.

నాకు ఎటువంటి సమస్య లేదు' అని అన్నారు. కాంగ్రెస్, వామపక్షాల వంటి ఇతర కూటమి భాగస్వాములను కాకుండా ఆర్‌జేడీని మాత్రమే ఎంఐఎం ఎందుకు సంప్రదిస్తున్నదని అడిగినప్పుడు... 'అది రాష్ట్రంలో ఇండియా ఐక్య సంఘటనకు నాయకత్వం వహిస్తుంది' అని అన్నారు. 'ఐ లవ్ మహ్మద్' నినాదంతో పోస్టర్లు వేసినందుకు ఉత్తరప్రదేశ్‌లోని ముస్లిం యువకులపై నమోదయిన కేసులను 'తప్పు, రాజ్యాంగ విరుద్ధం'గా ఒవైసీ అభివర్ణించారు. 'ఎఫ్ఐఆర్‌లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 25లో హామీ ఇవ్వబడిన మత స్వేచ్ఛ హక్కును ఉల్లంఘిస్తున్నాయి. కొత్త ఆచారాన్ని అనుమతించలేమనే యూపీ పోలీసుల వాదన చెల్లదు. ముస్లింలు ఎల్లప్పుడూ తమ ప్రవక్తను ఆరాధిస్తారు' అని తెలిపారు.

ప్రతి కేసు అత్యవసర విచారణ చేయలేం: సుప్రీం

న్యూఢిల్లీ: అత్యవసర విచారణకు సంబంధించి దాఖలు చేసిన ఓ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. ఎవరినైనా ఉరి తీస్తున్నారంటే తప్ప మరే కేసునూ అదేరోజున అత్యవసరంగా విచారించబోమని జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వెల్లడించింది. న్యాయమూర్తులపై ఉండే ఒత్తిడి, పని గంటల గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా అని ప్రశ్నించింది. తాము ఎన్ని గంటలు నిద్రపోతున్నామో తెలుసా అని ఆగ్రహం వ్యక్తంచేసింది. బుధవారం ధర్మాసనం అత్యవసర జాబితా కోసం కేసులను పరిశీలిస్తున్న నేపథ్యంలో శోభా గుప్తా అనే న్యాయవాది ఓ పిటిషన్‌ను న్యాయస్థానానికి అందజేశారు. రాజస్థాన్‌లోని ఒక నివాసగృహాన్ని ఈరోజు వేలం వేయనున్నారని, ఈ రోజు విచారణ జరపకపోతే ఇల్లు చేజారిపోతుందని పేర్కొన్నారు. అందువల్ల దానిపై అత్యవసర విచారణ జరపాలని సుప్రీంకోర్టును కోరారు. దీనిపై స్పందిస్తూ జస్టిస్ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒకరి స్వేచ్ఛ ప్రమాదంలో ఉంటే తప్ప తాము అత్యవసరంగా విచారణ చేపట్టబోమని స్పష్టంచేశారు. అనంతరం ఇల్లు వేలం నోటీసు ఎప్పుడు జారీ చేశారని జస్టిస్ సూర్యకాంత్ న్యాయవాదిని అడిగారు. గతవారం వేలం నోటీసు జారీ చేశారని, బకాయి ఉన్న మొత్తంలో ఇప్పటికే సగం చెల్లించారని న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో శుక్రవారం ఈ పిటిషన్‌ను జాబితాలో చేర్చాలని న్యాయమూర్తి సూచించారు.

భారత మహిళలకు దక్కని ఉద్యోగాలు

పురుషుల వైపే కంపెనీల మొగ్గు



న్యూఢిల్లీ: హెచ్ -1 బి వీసా లక్ష డాలర్లకు పెంచడంతో యువత ఉపాధిపై తీవ్ర ప్రభావం పడనుంది. ముఖ్యంగా భారత యువత ఉపాధిపై కోలుకోలేని దెబ్బ పడింది. మరీ ముఖ్యంగా మహిళల పరిస్థితి దారుణంగా మారింది. మగవారికంటే మహిళలు ఎక్కువ చదువుకున్నా... ఉద్యోగాల విషయంలో కంపెనీలు మాత్రం పురుషుల వైపే మొగ్గుచూపుతున్నాయి. దీంతో అమెరికాలో మహిళల ఉపాధి అవకాశాలు బాగా తగ్గే అవకాశం ఉందని అనేక సర్వేలు వెల్లడించాయి. హెచ్-1బి వీసా ద్వారా గతేడాది అమెరికా వెళ్లిన కార్మికుల్లో ఉద్యోగాలు కొనసాగించడానికి అవకాశం ఉన్న కార్మికుల్లో 74 శాతం మంది పురుషులు ఉంటే... 26 శాతం మంది మాత్రమే మహిళలున్నారు. జీతాల విషయానికొస్తే... స్త్రీ-పురుష జీతాల్లో చాలా వ్యత్యాసం ఉంది. 2024 సంవత్సరం ప్రకారం చూస్తే... ప్రారంభంలో కొద్దినెలల ఉద్యోగానికి మహిళల జీతం 77 వేల డాలర్లు. అదే పురుషులకైతే 1,02,000 డాలర్లు. మిడిల్ వర్కర్ (50 శాతం) మహిళలకు 97 వేల డాలర్లు, పురుషులకు 1,32,000 డాలర్లు. టాప్ క్వార్టర్ (75 శాతం) మహిళలకు 1,30,000 డాలర్లు, పురుషులకు 1,69,000 డాలర్లు ఇస్తున్నారు. చదువు అయిపోగానే ఉద్యోగం చేసే మహిళలు, పురుషుల జీతాల్లో వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంది. బోటమ్ క్వార్టర్ (25 శాతం)లో మహిళలకు 71,000, పురుషులకు 80,000 డాలర్లు. మిడిల్ వర్కర్ (50 శాతం) మహిళలు 91,000 డాలర్లు, పురుషులు 99,000 డాలర్లు. ఇక టాప్ క్వార్టర్ అయితే మహిళలకు 1,25,000 డాలర్లు. పురుషులు 1,31,000 డాలర్లు సంపాదిస్తున్నారు. పురుషుల కంటే మహిళలు చాలా తక్కువ జీతంతోనే పనిచేస్తున్నారు. అమెరికా వెళ్లి ఉద్యోగం చేయాలని పురుషుల కంటే మహిళలే ఎక్కువ శాతం మంది కోరుకుంటున్నారు. 35 ఏళ్లలోపు మహిళలు 75 శాతం మంది ఉంటే... పురుషులు 65 శాతం మందే ఉద్యోగానికి మొగ్గుచూపుతున్నారు. మహిళలు మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసినవారు 44 శాతం మంది ఉంటే... పురుషులు 39 శాతమే. బాగా చదువుకున్నప్పటికీ... కంపెనీలు మాత్రం పురుషులకే మొగ్గుచూపడంతో మహిళల విద్యార్హతలు ఎక్కువ ఉన్నప్పటికీ ఉద్యోగావకాశాల్లో వారు వెనక్కి తగ్గాల్సి వస్తోంది. ట్రంప్ తెచ్చిన వలస విధానం వల్ల మహిళలకు ఉద్యోగ అవకాశాలు 60 శాతం ఉంటే... పురుషులకు 75 శాతం పొందే అవకాశం ఉన్నట్లు సర్వేలు వెల్లడించాయి.

బీజేపీకి అధికారం దక్కనందుకే రాష్ట్ర హోదా ఇవ్వలేదు

ఒమర్



శ్రీనగర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ... జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్రహోదా ఇవ్వకపోవడంపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మండిపడ్డారు. జమ్మూకశ్మీర్‌లో బీజేపీ అధికారం కోల్పోయిందని, అందుకే రాష్ట్ర హోదా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా కల్పించడంలో జాప్యం చేయడమంటే అది ఇక్కడి ప్రజలకు అన్యాయం చేయడమేనని వ్యాఖ్యానించారు. ఒమర్ అబ్దుల్లా బుధవారం మీడియాతో మాట్లాడుతూ... 'జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో బీజేపీ గెలువకపోవడం వాళ్ల దురదృష్టం. చూడబోతే ఎన్నికల్లో బీజేపీ గెలువలేకపోయినందుకే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా ఇవ్వడం లేదేమో అనిపిస్తున్నది. ఇది ప్రజలపాలిట అన్యాయం. ఫలితాలు బీజేపీ అనుకూలంగా ఉంటేనే రాష్ట్రహోదా ఇస్తామనుకోవడం సరి కాదు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదాపై వ్యతిరేకత బీజేపీ నుంచే వస్తోంది' అన్నారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా కల్పించే విషయంలో తాము డీలిమిటేషన్, ఎలక్షన్స్, స్టేట్‌హుడ్ అనే 'త్రీ స్టెప్ ఫార్ములా'ను అమలుచేస్తామని కేంద్రం సుప్రీంకోర్టుకు చెప్పిందని, ఇప్పుడు త్రీ స్టెప్స్ పూర్తయినా రాష్ట్రహోదాను మాత్రం కల్పించలేదని ఒమర్ అబ్దుల్లా ఆరోపించారు.

బీహార్‌లో మార్పు అనివార్యం

ఈసీ పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా చూడాలి

కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలట్

పట్నా: బీహార్‌లో మార్పు అనివార్యమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ బుధవారం నొక్కి చెప్పారు. రాబోయే ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని ఎన్నికల సంఘం (ఈసీ)ను కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాలతో కలిసి తమ పార్టీ స్పష్టమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలి ప్రకటనలు, సుంకాలు విధించడం, ఒకసారి హెచ్1బి వీసా రుసుములు పెంచడం వంటి చర్యలకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీపై ఆయన విమర్శలు గుప్పించారు. ఇద్దరు నాయకుల మధ్య స్నేహం భారతదేశానికి 'చాలా ఖరీదయినదిగా' నిరూపితమైందని అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం సందర్భంగా విలేకరుల సమావేశంలో పైలట్ మాట్లాడుతూ '2017 నుంచి ఎనిమిది సంవత్సరాలుగా కాంగ్రెస్, రాహుల్ గాంధీ ఇది గబ్బర్ సింగ్ పన్ను అని చెబుతూ తప్పులు ఎత్తి చూపారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం జీఎస్టీ తీసుకురావాలనుకున్నప్పుడు బీజేపీ దానిని వ్యతిరేకించింది. ఆపై అధికారంలోకి రావడానికి యూ-టర్న్ తీసుకుంది' అని తెలిపారు. 'తప్పులు సరిదిద్దుకోవడానికి ఎనిమిది సంవత్సరాలు పట్టింది. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తన వెన్ను తట్టుకుంటోంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. 'ఓట్ల దొంగతనం' ఆరోపణలకు సంబంధించి రాహుల్ గాంధీ లేవనెత్తిన అంశాలపై దర్యాప్తు ప్రారంభించడానికి బదులుగా ఎన్నికల కమిషన్ తనను అఫిడవిట్ సమర్పించమని అడుగుతోందని పైలట్ అన్నారు. ఈసీని ప్రశ్నలు అడిగినప్పుడు సమాధానం బీజేపీ నుంచి వస్తుందని ఆయన అన్నారు. బీహార్‌లో మహాఘట్‌బంధన్ మిత్రదేశాలతో కలిసి కాంగ్రెస్, ఎన్డీఏను ఐక్యంగా, బలంగా ఎదుర్కొంటోందని ఆయన నొక్కి చెప్పారు. ఆర్‌జేడీకి నేత తేజస్వీ యాదవ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించడంలో కాంగ్రెస్ విముఖత చూపుతున్నట్లు వచ్చిన వార్తల గురించి అడుగగా... సరైన సమయంలో అన్ని నిర్ణయాలు తీసుకుంటామని పైలట్ అన్నారు. అంతకుముందు, మరొక విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భూపేశ్ బఘేల్ కూడా ట్రంప్ చర్యలపై ప్రధాని మోదీని విమర్శించారు. మోదీ విదేశాంగ విధానం పూర్తిగా విఫలమైనట్లు స్పష్టంగా తెలుస్తుందన్నారు.

24న 4 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు

ఈసీ వెల్లడి

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో 2021 నుంచి ఖాళీగా ఉన్న నాలుగు రాజ్యసభ స్థానాలను భర్తీ చేయడానికి ద్వైవార్షిక ఎన్నికలు అక్టోబరు 24న జరుగుతాయని ఎన్నికల కమిషన్ బుధవారం తెలిపింది. కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన దాదాపు సంవత్సరం తర్వాత నాలుగు రాజ్యసభ స్థానాలకు రాజ్యసభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యేలు తమ రాష్ట్రాల రాజ్యసభ సభ్యులను ఎన్నుకుంటారు. గులాం నబీ ఆజాద్, నజీర్ అహ్మద్ లావే పదవీకాలం ముగిసిన 2021 ఫిబ్రవరి 15 నుంచి ఈ కేంద్ర పాలిత ప్రాంతం పార్లమెంటు ఎగువ సభలో ప్రాతినిధ్యం వహించడం లేదు. మరో ఇద్దరు సభ్యులు ఫయాజ్ అహ్మద్ మీర్, షంషీర్ సింగ్ మన్హాస్ అదే సంవత్సరం ఫిబ్రవరి 10న తమ పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకటిస్తూ మునుపటి జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్ (శాసనసభతో కూడుకున్నది), లడ్డాఖ్ (శాసన సభ) కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించినట్లు ఈసీ తెలిపింది. జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం, జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి కేటాయించిన సీట్లను భర్తీ చేయడానికి ప్రస్తుత జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు సిట్టింగ్ రాజ్యసభ సభ్యులు ఎన్నికయినట్లు పరిగణించబడుతుంది. ఖాళీలు ఏర్పడే సమయంలో ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన ఓటర్లు అందుబాటులో లేకపోవడంతో సిట్టింగ్ సభ్యుల పదవీకాలం ముగిసినప్పటి నుంచి నాలుగు సీట్లు ఖాళీగా ఉన్నాయి. జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత రాష్ట్ర శాసన సభ ఏర్పాటు తర్వాత ద్వైవార్షిక ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన ఓటర్లు ఉన్నారని ఈసీ పేర్కొంది. పోలింగ్ ముగిసిన గంట తర్వాత అక్టోబరు 24న సాయంత్రం ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

విద్యార్థినులపై ఢిల్లీ బాబా లైంగిక వేధింపులు

న్యూఢిల్లీ: అసభ్య పదజాలంతో దూషించాడని, లైంగికంగా వేధించాడని ఒక ప్రముఖ ఆశ్రమానికి చెందిన బాబాపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. అతడిపై 17 మంది విద్యార్థినులు చేసిన ఫిర్యాదులు సంచలనం సృష్టిస్తున్నాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఢిల్లీలోని వసంత్‌కుంజ్ ప్రాంతంలో శ్రీ శారద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ స్వామి చైతన్యానంద సరస్వతి(స్వామి పార్థసారథి)పై విద్యార్థినులు లైంగిక ఆరోపణలు చేశారు. ఆర్థికంగా బలహీనవర్గాలకు చెందినవారంతా ఉపకార వేతనాలతో ఈ విద్యాసంస్థలో చదువుకుంటున్నారు. 32 మంది విద్యార్థుల్లో 17 మంది వాంగ్మూలం ఇచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. అసభ్య పదజాలం వాడుతూ దుర్భాషలాడటం, సందేశాలు పంపడమే కాకుండా లైంగికంగా వేధింపులకు గురిచేశాడని విద్యార్థినులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన చెప్పినట్టుగా నడుచుకోవాలని ఇతర మహిళా అధ్యాపకులు, ఇతర సిబ్బంది కూడా ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. ఆశ్రమంలో పనిచేసే వార్డెన్లే తమను నిందితుడికి పరిచయం చేశారని వాపోయారు. ఈ వాంగ్మూలాల ఆధారంగా తాము కేసు నమోదు చేశామని పోలీసు ఉన్నతాధికారి అమిత్ గోయల్ వెల్లడించారు. ఈ వ్యవహారంలో పోలీసులు సీసీటీవీ ఫుటేజీని విశ్లేషించారు. నిందితుడు ఉండే ప్రాంతం సహా బాధితులు పేర్కొన్న స్థలాల్లో తనిఖీలు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, చివరిగా అతడి లొకేషన్‌ను ఆగ్రా సమీపంలో గుర్తించినట్లు తెలిపారు. విద్యాసంస్థకు చెందిన బేస్‌మెంట్‌లో ఒక కారు గుర్తించిన పోలీసులు... దానికి ఉన్నది నకిలీ నంబర్ ప్లేట్ అని వెల్లడించారు. ఒడిశాకు చెందిన ఈ బాబా 12 ఏళ్లుగా ఢిల్లీలోని ఆశ్రమంలో ఉంటున్నాడు. ఆయనపై ఆరోపణలు రావడం ఇదే తొలిసారి కాదు. 2009లో మోసం, లైంగిక వేధింపు కేసు నమోదైంది. 2016లో వసంత్ కుంజ్ ప్రాంతంలోని ఒక మహిళ కూడా ఈతరహా వేధింపుల ఫిర్యాదు చేసింది. తాజా ఆరోపణల నేపథ్యంలో శ్రీ శృంగేరీ మఠం పాలకమండలి అతడిని డైరెక్టర్ పదవి నుంచి తొలగించింది. అతడితో అన్ని సంబంధాలు తెంచుకున్నామని ఓ ప్రకటనలో తెలిపింది. విద్యాసంస్థ ఈ మఠం ఆధ్వర్యంలోనే నడుస్తోంది.

ఈడీ విచారణకు సోనూసూద్

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కేసుకు సంబంధించి బుధవారం ఈడీ విచారణకు బాలీవుడ్ సినీనటుడు సోనూసూద్ హాజరయ్యారు. బెట్టింగ్ యాప్ ప్రచారానికి సంబంధించి ఆయనకు గతంలోనే ఈడీ సమన్లు పంపింది. ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు సోనూసూద్ విచారణకు హాజరయ్యారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌నకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో సోనూసూద్‌తో పాటు క్రికెటర్లు కూడా ఉన్నారు. ఇప్పటికే వారిని కూడా అధికారులు విచారించారు. నిషేధం ఉన్న బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన పలువురు టాలీవుడ్, బాలీవుడ్ సెలబ్రిటీలు కూడా విచారణ ఎదుర్కొంటున్నారు. విజయ్ దేవరకొండ, రానా, ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మి వంటి స్టార్స్‌తో పాటు మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, హర్భజన్‌సింగ్, యువరాజ్‌సింగ్, సురేశ్ రైనాలను కూడా ఈడీ విచారించింది.

విశాలాంధ్ర హైదరాబాద్

27న జరిగే బతుకమ్మ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఈనెల 27న మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్లు మహిళా సంఘం మహిళా సంఘం కో చైర్ పర్సన్ మంజులా రెడ్డి తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టరేట్‌లోని సర్వే అండ్ ల్యాండ్స్ కార్యాలయంలో టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కృష్ణ యాదవ్‌తో కలిసి మహిళా అధికారులు, సిబ్బంది సమక్షంలో బతుకమ్మ వేడుకల పోస్టర్ ను ఆవిష్కరించారు. తెలంగాణ సాంస్కృతిక గౌరవాన్ని ప్రతిబింబించే బతుకమ్మ వేడుకల్లో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కుటుంబ సభ్యులు అందరితో కలసి పాల్గొని విజయవంతం చేయాలని సంఘం ఆహ్వానం పలికింది. ఈ కార్యక్రమంలో టీజీఏ సెక్రెటరీ ఎం.ఏ ఖాదర్‌అ, సోసియేట్ ప్రెసిడెంట్ ఆశన్న, వైస్ ప్రెసిడెంట్ వి.శ్రీరామ్, భవాని, శృతి, లావణ్య, యాదమ్మ, రత్న. సాధిక, లక్ష్మీ పరిమళ, నిర్మల, విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, ఎండి అన్సార్ ఉల్ హక్, కిరణ్, శేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

వందే భారత్ రైళ్లు మల్కాజిగిరి నుండి నడపాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : దక్షిణ మధ్య రైల్వేకు మరో రెండు వందే భారత్ రైళ్లు మంజూరు చేయడం చాలా హర్షణీయం. ఈ రైళ్ళను చర్లపల్లి నుండి కాకుండ మల్కాజిగిరి నుండి నడపాలి. హైదరాబాద్ డివిజన్ కు కేవలం ఇంత వరకు ఒకటే మంజూరు చేశారు. నగరం నుండి చర్లపల్లి వెళ్ళడానికి, చర్లపల్లి నుండి నాందేడ్ వెళ్ళడానికి ఛార్జ్ సమానంగా ఉంటుంది. సికింద్రాబాద్ నుండి కానీ లేదా హైదరాబాద్ డివిజన్‌కు ఇస్తే మల్కాజిగిరి నుండి నాందేడ్, ముంబై వరకు నడపాలి. 28 కోట్లు ఖర్చుపెట్టి మల్కాజిగిరిని అమ్రిత్ భారత్‌స్టేషన్‌ను అభివృద్ధి చేసి ఏ రైలు నిలపక, ఇక్కడి నుండి ప్రారంభించక పోతే అభివృద్ధి చేసి డబ్బు వృధానేనని, మల్కాజిగిరి స్టేషన్‌లో లిఫ్ట్, ఎస్కలేటర్లు, విశాలమైన పార్కింగ్ వసతులు ఉన్నందున ఇక్కడి నుండి రైళ్ళను ప్రారంభించడం మంచిదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చర్లపల్లి మీదుగా పలు రైళ్లు నేరుగా నాందేడ్ వెళ్తున్నాయి. ఇంకో రైలు అక్కడి నుండి ప్రారంభించడం పునః పరిశీలించాలని ప్రయాణికుల సంఘం ప్రధాన కార్యదర్శి, జెడ్‌ఆర్.యు.సీసీ సభ్యులు నూర్ అహ్మద్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. చర్లపల్లి నుండే నడపాలని అనుకొంటే మల్కాజిగిరి వరకు తేవాలని, దీనివల్ల అటు కాచిగూడ, లింగంపల్లి, సికింద్రాబాద్, హైదరాబాద్ ప్రయాణికులు మల్కాజిగిరి నుండి ప్రయాణిస్తారు. ముంబై వరకు పొడిగించే అవకాశాలు ఉంటాయి..రాయలసీమ, దేవగిరి, ఏపి సంపర్క్ క్రాంతి, ఇతర ఎక్స్ ప్రెస్ లను మల్కాజిగిరిలో నిలిపి కాచిగూడ, సికింద్రాబాద్‌లలో రద్దీ తగ్గించ వచ్చని, పండుగ సమయాల్లో అన్ని పాసెంజర్, డెము, రైళ్లను మేడ్చల్ వరకు అన్ని స్టేషన్‌లలో ఆపితే ప్రయాణికులకు ఉపయోగంగా వుంటాయని నూర్ కోరారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో బతుకమ్మ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : బతుకమ్మ ప్రకృతి పండుగ ప్రకృతిలో దొరికే గునుగా తంగేడు తీరు రుద్రాక్షాలు బంతి చామంతి తీరొక్క పూలతో తీరు బతుకమ్మను పేర్చి అవే పువ్వులను నీటిలో వేసే ప్రకృతి పండుగ ఇది పర్యావరణాన్ని కాపాడే పండుగ ఈ బతుకమ్మ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జిల్లా తహసీల్దార్ల యూనియన్ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఎస్ డిసిఎల్ సూపరింటెండెంట్ మాలతి లు పాల్గొన్నారు. నాల్గవరోజైన బుధవారం నాన బియ్యం బతుకమ్మను తయారు చేసి బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. తెలంగాణ సాంప్రదాయాలు, సంస్కృతి స్ఫురించేలా బతుకమ్మల అలంకరణ, పాటలు, నృత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. జిల్లాలోని తహసీల్దర్లందరు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎంతో ఉత్సహంగా బతుకమ్మను ఆడారు.

బతుకమ్మ వీడియో సాంగ్ విడుదల

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సమర్పించిన మన బతుకమ్మ 2025 పూర్తి పాటల వీడియో అధికారికంగా విడుదలైంది. సంగీతం, దృశ్యాల ద్వారా పండుగ సాంస్కృతిక ఉత్సాహాన్ని జీవం ఉట్టిపడే విధంగా రూపకల్పన చేశారు. ప్రభుత్వం చొరవతో ప్రపంచంలోని పూల పండుగలలో అత్యంత చారిత్రక వారసత్వాలలో ఒకటైన బతుకమ్మ పండుగ గొప్పతనాన్ని దృశ్యమానంగా సంగ్రహించడానికి అంకితభావంతో దీనిని విడుదల చేశారు. తెలంగాణ బతుకమ్మ పువ్వుల నుండి ప్రేరణ పొందిన లయబద్ధమైన దరువుల నుండి మహిళలు ఐక్యంగా జరుపుకునే రంగురంగుల దృశ్యాల వరకు, ఈ గీతం బతుకమ్మ ఆత్మను ప్రతిబింబిస్తుంది. ఈ వీడియో ఇప్పటికే ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేసింది. తెలంగాణ సంస్కృతి యొక్క కళాఖండం, “ఈ సీజన్‌లో ప్రతి ఇల్లు జరుపుకునే పాట” అని అభివర్ణించారు. బూసం జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో పాటల రచయిత గోరేటి వెంకన్నతో పాటు సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు. అదితి బావరాజు, మంగ్లి, గోరేటి వెంకన్న వాయిస్ అందించారు. ఈశ్వర్ పెంటి కొరియోగ్రఫీ అందించగా గాజుల భద్రప్ప దర్శకత్వం వహించారు. శ్యామ్ కెమెరా సహకారం అందించారు.

మహిళల సమగ్రాభివృద్ధే ధ్యేయం

మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళల సమగ్రాభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందనీ మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలు అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని ఎన్‌బిటి నగర్‌లో 93.50 లక్షలతో నిర్మించిన మహిళా భవన్‌ను ఎమంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్‌లు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతలు ప్రారంభించారు. అనంతరం 29.80 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడి నూతన భవనానికి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమానికి మహిళకు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చాలా కాలంగా మాటలకే పరిమితమై ఆచరణ కానీ పనులు ఇప్పుడు హైదరాబాద్ మొత్తం అమలవుతున్నాయి. దానికి నిదర్శనమే ఈ మహిళా భవనం ప్రారంభోత్సవమన్నారు.

నూతన రేషన్ కార్డులు పంపిణీ...

200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పేదల పంపిణీ ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు అందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మహిళలు అన్ని రంగాలలో ఎదిగేందుకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. స్వయం ఉపాధి పథకాలలో మహిళలను వారి కాళ్ళ మీద నిలబడేలా ప్రోత్సహిస్తుందన్నారు.

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్‌బీటీ నగర్‌లోమహిళా భవన్ నిర్మించాలన్న ఈ ప్రాంత ప్రజల 15 ఏండ్ల కలను ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ నెరవేర్చిందన్నారు. ఈ క్రమంలో ఎదురైన కోర్టు కేసులు పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేశామన్నారు. మహిళలకు వివిధ కార్యక్రమాల నిర్వహణకు, శిక్షణలకూ, గ్రూప్ సమావేశాలకూ వేదికగా మహిళా భవన్ ఉపయోగపడనుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు.

సమాజ చైతన్యంలో కవులు, కళాకారుల పాత్ర కీలకం

మంత్రి జూపల్లి కృష్ణారావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమాజ చైతన్యంలో కవులు, కళాకారుల పాత్ర కీలకమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా బుధవారం రవీంద్రభారతీలో ఏర్పాటుచేసిన కవి సమ్మేళనం కార్యక్రమాన్నిజ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు, సాహితీవేత్తలు పాత్ర అమోఘమని, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఎంతగానో కృషి చేశారని అన్నారు. మన తెలుగు సాహిత్యానికి ఏనలేని చరిత్ర ఉందని, నన్నయ, తిక్కన, ఎర్రప్రగడ నుంచి కృష్ణ శాస్త్రి, శ్రీశ్రీ తర్వాత ధాశరధి, కాళోజీ లాంటి వారి రచనలు ప్రజలను చైతన్యం, జాగృత పరిచాయని చెప్పారు. ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు కవులు, పండి తులు, రచయితల ద్వారా సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా వారిలో ఉన్న సృజనాత్మకతను బయటకు తెచ్చి సమాజం లో మార్పు కోసం కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. సామాజిక రుగ్మతలు, యువతలో పెడధోరణులు నేటి సమాజాన్ని పట్టిపీడిస్తున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను రేపటి పౌరులుగా గురువులు తీర్చిదిద్దినట్లు, సమాజాన్ని తట్టిలేపే శక్తి కవులు, కళాకారులు, సాహితీవేత్తలకే ఉందని చెప్పారు. తెలంగాణ సమాజంలో ఒక సామాజిక చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత కవులు, రచయితలు, సాహితీవేత్తలు, మేధావులు, కళాకారులపై ఉందన్నారు. సమాజాన్ని అవలోకనం చేసుకుంటూ అందరి మన్ననలు పొందుతూ కవులు చైతన్యస్ఫూర్తితో తమ రచనలు కొనసాగిస్తూ.. సమాజ చైతన్య ఉన్నతికి కృషి చేయాలని కోరారు. రచయితలు, సాహితీవేత్తలు, కవులు, కళాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, మీరిచ్చే సలహాలు సూచనలను స్వీకరిస్తామని మంత్రి తెలిపారు. ప్రజల వద్దకు సాహిత్యాన్ని తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన, పుస్తకాలను గ్రామగ్రామాన చేరవేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, నెల్లుట్ల రమాదేవి, ఇతర కవులు, సాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యులు సదస్సులో పాల్గొని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

గాంధీ జయంతి వేడుకల ఏర్పాట్లు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అక్టోబర్ 2న, నిర్వహించనున్న గాంధీ జయంతి వేడుకల ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో వ్యవహరించి, నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణ అన్నారు. బుధవారం లంగర్ హౌస్ బాపు ఘాట్‌లోని మ్యూజియం హాల్ నందు అక్టోబర్ 2న, బాపూఘాట్‌లో నిర్వహించే గాంధీ జయంతి వేడుకల చేపట్టవలసిన ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులతో కలిసి ఆర్డీఓ సమీక్షించి బాపుఘాట్ ప్రాంతాన్ని కలియ తిరిగి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయంతి వేడుకల్లో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, అలాగే ఉన్నతాధికారులు బాపూఘాట్‌లో నివాళులర్పించి అలాగే మ్యూజియం హాల్‌ను సందర్శిస్తారని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని శాఖల వారీగా కేటాయించిన పనులను ప్రణాళిక ప్రకారం సిద్ధం చేసుకుని, అధికారులందరు సమన్వయంతో వ్యవహరించి ఈ నెల 29 వరకు పూర్తి చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ వేడుకల్లో పారిశుధ్య పనులు, నిరంతర విద్యుత్ త్రాగునీరుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల అలాగే సౌండ్ ప్రూఫ్ జనరేటర్లు ఏర్పాటు, భారీ కెట్స్, మెడికల్ స్టాల్స్‌తో పాటు అంబులెన్స్ ఏర్పాటు, మీడియా పాయింట్, సౌండ్ సిస్టం ఏర్పాటు, పోలీస్ బందోబస్తు, వాటర్ ప్రూఫ్ షామియానాల ఏర్పాటు చేయాలని సూచించారు. సంబందిత అధికారులకు సూచించారు. బాపుఘాట్ కూడళి వద్ద అదికంగా ట్రాఫిక్ ఉండే ప్రాంతం అయినందున, ట్రాఫీక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆయన తెలిపారు. ఈ వేలడుకలకు విద్యార్థులను రప్పించుటలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గైడ్ తప్పక ఉండాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు చేపట్టిన పనులను నిరంతరం పర్యవేక్షించి, పనుల ప్రగతిని నివేదించాలని తహాసీల్లార్‌కు సూచించారు.

ఈ నెల 30న జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి బాపుఘాట్ సందర్శించి చేపట్టిన ఏర్పాట్లను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేషంలో డిప్యూటీ కమిషనర్ కార్వాన్ సర్కిల్ సైపుల్లా, గొల్కొండ తహాశీల్దార్ అహల్య, హర్టికల్చర్ ఎడి రాధాకృష్ణ, టూరిజం ఇఇ అజయ్, జనరల్ మేనేజర్ కె.నాథన్, వాటర్ బోర్డ్ మేనేజర్ రమేష్, లంగర్ హౌస్ సిఐ వెంకట్రాములు, అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ భాను ప్రతాప్, ఆర్ అండ్ బి (ఎలక్ట్రికల్)ఈ ఈ పూనం, వైద్య, విద్యుత్, విద్యా, జిహెచ్‌ఎంసి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

1258 మంది సింగరేణి బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరణ

విశాలాంధ్ర, హైదరాబాద్ : సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్లుగా చేరి భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ గనులు లేదా సర్ఫేస్‌లో పనిచేస్తూ 190/240 మస్టర్లు పూర్తి చేసిన వారిని జనరల్ అసిస్టెంట్ కేటగిరి-1గా క్రమబద్ధీకరించేందుకు వీలుగా సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు విడుదల చేసింది. 2024 డిసెంబర్ 31, అంతకు ముందు తమ సంవత్సరకాలం సర్వీసు చేసిన వారిని భూగర్భ గనుల్లో అయితే 190 మస్టర్లు, ఓపెన్ కాస్ట్ గనుల్లో లేదా సర్ఫేస్‌లో అయితే 240 మస్టర్లు పూర్తి చేసి ఉన్న బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్ కేటగిరి-1 గా క్రమబద్ధీకరించడానికి యాజమాన్యం అంగీకరించిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ క్రమబద్ధీకరణ విషయమై సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, డైరెక్టర్ పర్సనల్ గౌతమ్ పొట్రులతో గుర్తింపు కార్మిక సంఘం అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జరిపిన చర్చల అనంతరం యాజమాన్యం ఈ సానుకూల నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు క్రమబద్ధీకరణ ప్రతిపాదనలు పంపించాల్సిందిగా జనరల్ మేనేజర్ (పర్సనల్) , ఐఆర్, పిఎం బుధవారం అన్ని ఏరియాలకు ఒక సర్క్యులర్ జారీ చేశారు. రామగుండం-2 ఏరియాలో 303 మంది బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్ కేటగిరి-1 గా క్రమబద్ధీకరించటం జరుగుతుంది. అలాగే భూపాలపల్లి ఏరియాలో 250 మందికి, శ్రీరాంపూర్ ఏరియాలో 241 మందికి, రామగుండం-3, అడ్రియాల ఏరియాలలో 167 మందికి, రామగుండం-1లో 156 మందికి, మందమర్రిలో 64 మందికి, కార్పోరేట్‌లో 21 మందికి, కొత్తగూడెం ఏరియాలో 20 మందికి, మణుగూరు ఏరియాలో 19 మందికి, బెల్లంపల్లి ఏరియాలో 11 మందికి, ఇల్లందు ఏరియాలో ఆరుగురికి జనరల్ అసిస్టెంట్ కేటగిరి-1గా క్రమబద్ధీకరించే ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతి, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్లలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై ఉప కమిషనర్‌తో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడలని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లి అధిక మొత్తంలో నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని, పనులలో వేగం పెంచాలని సకాలంలో నిధులు మంజూరు అయ్యేలా చూడలని, అభివృద్ధి పనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, అవసరమున్న చోట రోడ్ల విస్తరణ పనులు చేపట్టడం ద్వారా ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుండి ఉపశమనం లభిస్తుంది అని, విధి దీపాల సమస్యను పరిష్కరించాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని గాంధీ తెలియచేసారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, వర్షాకాలంలో గల ఎదురయ్యే సమస్యల పట్ల పూర్తి స్థాయిలో సన్నద్ధం అయ్యేలా అధికారులకు అదేశాలు ఇవ్వాలని, మాన్ సున్ సిబ్బందిని అప్రమత్తంగా ఉండేలా చూడలని, అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని, ఇటీవల కురిసిన వర్షాల వలన దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని గాంధీ తెలియచేసారు. అదేవిధంగా చెరువుల సుందరికరణ, పార్కులు అభివృద్ధి చేపట్టాలని, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజి పడకూడదు అని, అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేయాలని గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ మెహ్రా, ఏసీపీ వెంకటరమణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

29న గిన్నిస్ వరల్డ్ రికార్డు బతుకమ్మ పండగ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈనెల 28న ఎల్.బీ. స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన వరల్డ్ గిన్నిస్ బుక్ రికార్డ్ బతుకమ్మ ఈవెంట్‌ను 29వ తేదీకి వాయిదా వేసినట్లు రాష్ట్ర పర్యాటక శాఖ తెలియచేసింది. ఈ వరల్డ్ బుక్ రికార్డ్ బతుకమ్మ ఉత్సవాన్ని ఎల్.బీ. స్టేడియంలో కాకుండా సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు తెలిపింది. సరూర్‌నగర్‌లో సెప్టెంబర్ 29న నిర్వహించే అతిపెద్ద బతుకమ్మ ఉత్సవానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరవుతారని తెలిపింది. వరసగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో ఎల్.బి స్టేడియం నుండి సరూర్ నగర్ స్టేడియంకు మార్చినట్లు ఒక ప్రకటనలో పర్యాటక శాఖ తెలియచేసింది.

కిక్ బాక్సింగ్ క్రీడాకారులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కిక్ బాక్సింగ్ పేరిట నకిలీ సంఘాలు ఇచ్చే బోగస్ సర్టిఫికెట్లుతో క్రీడాకారులకు నష్టం కలిగించవద్దని తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎం మహిపాల్ కోశాధికారి పి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ గుర్తింపు ఇచ్చిన ఏకైక సంఘం అని, జాతీయ కిక్ బాక్సింగ్ సంస్థ వాకో ఇండియా కిక్ బాక్సింగ్ ఫెడరేషన్‌ను యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని అధికారిక గుర్తింపులు ఉన్న ఏకైక సంస్థ తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ 2017లో స్థాపించబడి అప్పటి నుండి దాని పరిధిని దినదినం విస్తరిస్తూ దాదాపు 25 జిల్లాల్లో పటిష్టమైన సభ్యత్వం నాయకత్వం ఉందని వారు తెలిపారు. ఉండగా కొంతమంది అనధికారికంగా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ పేరిట చెల్లుబాటు కానీ రిజిస్ట్రేషన్‌లతో క్రీడాకారులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని దీని నుండి కిక్ బాక్సింగ్ క్రీడాకారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వారు నిర్వహించే పోటీలకు వారు ఇచ్చే సర్టిఫికెట్లకు ఎటువంటి గుర్తింపు లభించదని వారు తెలిపారు. కాబట్టి బోగస్ సంఘాలతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. కిక్ బాక్సింగ్ క్రీడా పట్ల వారికి అభిమానం ఉంటే తమతో కలిసి పని చేయాలని అంతేకానీ చెల్లుబాటు కానీ సంఘాలు పెట్టి క్రీడాకారుల మోసం చేయడం తగదన్నారు. అధికారికంగా అన్ని గుర్తింపులు ఉన్న తమ సంఘంకు సహకరించాలని క్రీడాకారులకు వారి తల్లిదండ్రులకు క్రీడా అధికారులకు వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: యువత స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని ఆర్థికంగా స్థిరపడాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మనికంట బేక్స్ అండ్ కేక్స్ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక యువత వ్యాపార రంగంలో అడుగుపెడుతూ స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడం ఆనందదాయకమన్నారు. స్థానిక వ్యాపారాలకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ వెంకటరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు బండారు ఆగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, మాజీ జెడ్పిటిసి మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి, సర్పంచ్ల సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు మధు సూధన్ గుప్తా, బేక్స్ అండ్ కేక్స్ నిర్వాహకులు ఉన్నారు.

మిని ట్యాంక్ బండ్‌పై బతుకమ్మ సంబరాలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : బతుకమ్మ సంబరాలలో భాగంగా బుధవారం మినీ ట్యాంక్ బండ్ పై నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ జాకియా సుల్తానా, గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవులు పాల్గొని బతుకమ్మ ఆట పాటల్లో పాల్గొన్నారు.

బాక్స్ డ్రైన్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ డివిజన్, భవాని నగర్ కాలనీలో జరుగుతున్న బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని భవాని నగర్ కాలనీ కామన్ వద్ద 78 లక్షల రూపాయలతో జరుగుతున్న ఆర్ సిసి బాక్స్ డ్రైన్ పనులను బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాక్స్ డ్రైన్ పనుల నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి, కాప్రా సర్కిల్ ఏ ఈ శ్రవంతి, స్థానిక నాయకులు కటర్ల భాస్కర్, ఫైళ్ల ప్రవీణ్, సంతోష్ యాదవ్, రంగారెడ్డి, మల్లారెడ్డి, సతీష్ రెడ్డి, స్థానిక కాలనీ వాసులు, బాబు, అజీమ్, శ్రీమన్నారాయణ, హనుమాన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

గిగ్ కార్మికులకు కాంగ్రెస్ తీరని ద్రోహం : కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్ : అభయహస్తం డిక్లరేషన్‌లో గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే రేవంత్ సర్కార్ అమలు చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో గిగ్ కార్మికుల కోసం ప్రత్యేక డిక్లరేషన్‌ను విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక ఈ సంగతే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు కలిశారు. వారు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చింది కానీ అందులో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గిగ్ కార్మికులకు అండగా ఉంటామని, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్టుగా గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, బీమాతో కూడిన సామాజిక భద్రత, సరైన వేతనాలతో పాటు మరణించిన కార్మికులకు పరిహారం చెల్లింపును వెంటనే అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ హామీల అమలు బాధ్యతను తీసుకుంటానన్న రాహుల్ గాంధీ, వీరి సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన గిగ్ కార్మికులు అహ్మద్ బిన్ అబ్దుల్ ఖుదర్, శ్యామ్ సుందర్, లొకుర్తి సరేష్‌కు ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల ప్రమాద బీమా పరిహారం ఇప్పటికీ అందలేదని తెలిపారు. గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తే బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. కరీంనగర్‌కు చెందిన ప్రముఖ డాక్టర్ దంపతులు ఒంటెల రోహిత్ రెడ్డి, గోగుల గౌతమి రెడ్డి (సీనియర్ గైనకాలజిస్ట్) కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు.

శ్రీ గాయత్రి దేవిని దర్శించుకున్న మాజీ కార్పొరేటర్

విశాలాంధ్ర - మేడిపల్లి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ సాయినగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ యందు ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారు శ్రీ గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారిని మాజీ కార్పొరేటర్ దొంతిరి హరీశంకర్ రెడ్డి, అమ్మవారిని దర్శించుకున్నారు. పూజ కార్యక్రమంలో లక్ష్మి నరేందర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మండపం దగ్గర అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. 25వ డివిజన్ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు, కాలనీ వాసులు పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా లేఅవుట్ పరిధిలోని కూచిపూడి నృత్య అకాడమీ బిహెచ్‌ఎల్ టౌన్‌షిప్‌లో శ్రీ కనకదుర్గ దేవి ఆలయం ఆధ్వర్యంలో ఘనంగా కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రముఖ నృత్య గురువు షణ్ముఖి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ నృత్య ప్రదర్శనలో చిన్నారులు ఆకట్టుకునే ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. కోస్గి సాన్వి ముదిరాజ్, కోస్గి వేదాంకిత ముదిరాజ్, జాహ్నవి ముదిరాజ్, ది సాన్వి, అనగా, పూర్ణచంద్రిక, కియారా, దీక్ష, తన్వి తదితర బాలనర్తకులు సాంప్రదాయ కూచిపూడి నృత్యానికి వన్నె తెచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొ న్న నృత్య కళాకారులకు బహుమతులు ప్రధానం చేసి వారిని ప్రోత్స హించారు. గురువు షణ్ముఖి మాట్లాడుతూ ఇలాంటి సాంప్రదా య నృత్యాలు యువతలో కళాసంపదను నిలబెడతాయని, భవిష్యత్తులో మరిన్ని ప్రతిభావంతులు వెలువడేలా కృషి చేస్తామని తెలిపారు.

వాకింగ్ ట్రాక్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - కాప్రా : హెచ్‌ఎంటి నగర్ చెరువు కట్టపై హెచ్‌ఎంటి నగర్ నుండి హైకోర్టు కాలనీ వరకు ఉన్న వాకింగ్ ట్రాక్ మట్టి రోడ్డు గుంతలు ఏర్పడి స్థానిక వాకర్లకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో, రూ.17 లక్షల వ్యయంతో వాకింగ్ ట్రాక్ రోడ్డును పునరుద్ధరించే పనులు చేపట్టారు. గుంతలను పూడ్చి, మట్టిని వేసి రోడ్డును చదును చేసి వాకింగ్ చేసుకునే వారికి అసౌకర్యం కలగకుండా సౌకర్యవంతమైన వాకింగ్ ట్రాక్ పనులను బుధవారం నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. హెచ్‌ఎంటి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు యాదగిరి రెడ్డి, నర్సింగ్‌రావు, కిరణ్, రామరాజు, సాయి జన్ శేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్, విటల్ యాదవ్, భూపాల్ రెడ్డి, దాసరి కర్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేడారం అభివృద్ధి పనులపై వేగం పెంచిన ప్రభుత్వం

అధికారులతో మంత్రులు సీతక్క కొండ సురేఖ సమీక్ష

విశాలాంధ్ర - హైదరాబాద్ : మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు సంబంధించి చేపట్టిన మేడారం అభివృద్ధి పనులపై ప్రభుత్వం వేగం పెంచింది. సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రణాళికను ఖరారు చేయగా, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచనలతో సచివాలయం నుంచి మంత్రి సీతక్క, వరంగల్ నుంచి మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశానికి దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్, పంచాయతీ రాజ్ ఈఎన్సీ ఎన్.ఆశోక్, దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు హాజరయ్యారు. సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ, "మేడారం అభివృద్ధి ప్రణాళిక సీఎం రేవంత్ రెడ్డి ఖరారు చేయడంతో కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఇది ఒక మహాఘట్టం. ఈ చరిత్రాత్మక పనిలో మీరు అందరూ భాగమవుతున్నారు. ఈ కృషి శాశ్వతంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. మేడారం కీర్తి వెయ్యేళ్లు నిలిచేలా అభివృద్ధి పనులు ఉండాలని... భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని అని మంత్రులు స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యాల కోసం మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులు ఆదేశించారు. అలాగే మేడారం అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి వర్కింగ్ డ్రాయింగ్స్, స్ట్రక్చరల్ డిజైన్స్‌ను అత్యంత వేగంగా పూర్తి చేయాలని, తదనుగుణంగా పనుల అంచనాలను సిద్ధం చేసి టెండర్లు తక్షణమే పిలవాలని మంత్రులు ఆదేశించారు.

తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభకు పట్టం కడుతుంది

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారాల ఎంపికలో ఎలాంటి ఒత్తిడిలకు, ప్రలోభాలకు తావుండదని నిష్పక్షపాతంగా తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభకు పట్టం కడుతుందనీ, తెలుగు సాహిత్య సాంస్కృతిక సామాజిక తదితర రంగాలలో లబ్ధప్రతిష్ఠులై ఆయా రంగాలకు చేస్తున్న కృషిని, వారి అనుభవాన్ని, ప్రతిభను మాత్రమే తెలుగు విశ్వవిద్యాలయం గుర్తించి వివిధ పురస్కారాలను అందజేస్తుందని తెలుగు వర్సిటీ వి.సి ఆచార్య నిత్యానందరావు అన్నారు. బుధవారం నాంపల్లి ప్రాంగణంలోని నందమూరి తారకరామారావు కళామందిరంలో తెలుగు విశ్వవిద్యాలయం వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన 24 మంది ప్రముఖులను 2024 సంవత్సరానికి గాను కీర్తి పురస్కారాలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నిత్యానందరావు మాట్లాడుతూ, ఈ ఏడాది ముప్పై ఏళ్ల బోధనా అనుభవంతో పరిణిత వయస్కులై ఎందరో విద్యార్థులను కళారంగానికి పరిచయం చేసిన తెలుగు వర్సిటీ అధ్యాపకులను పురస్కార ఎంపిక కమిటీ గుర్తించి కీర్తి పురస్కారాలతో సత్కరించడంలో ఔచిత్యముందని అభిప్రాయపడ్డారు. పురస్కార గ్రహీతలకు 5,116ల నగదుతో పాటు శాలువ, అభినందన పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్టణ పర్యావరణ ప్రాంతీయ అధ్యయన కేంద్ర పూర్వ సంచాలకులు ఎస్.భూపతి రావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలకు బోధన కేంద్రాల పరిమితులుంటాయని తెలుగు విశ్వవిద్యాలయానికి మాత్రం విశ్వవ్యాప్తంగా తెలుగు భాష, సాహితీ సంస్కృతుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తుందని ఆ దిశగా ఆచార్య నిత్యానందరావు పనిచేస్తున్నారని అన్నారు. వ్యక్తిత్వ వికాసరంగంలో కీర్తి పురస్కారాన్ని అందుకున్న 92 ఏళ్ల వయసుగల ప్రముఖ ఇంజనీర్ తిరువక్కల్ శోభనాద్రి మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్యం, కళల ద్వారా సమాజాన్ని మేల్కొలిపి చైతన్యవంతులను చేస్తున్న ప్రతిభామూర్తులను తగురీతిన పురస్కారాలను అందించడం హర్షణీయమని అందుకుగాను తనవంతుగా యాభై వేల రూపాయల విరాళాన్ని తెలుగు విశ్వవిద్యాలయానికి అందజేశారు. ఈ కార్యక్రమానికి విస్తరణసేవా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామ్మూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు.

పురస్కార గ్రహీతలు వీరే...

ఆచార్య కె.సత్యలక్ష్మి (మహిళాభ్యుదయం), పద్మ మధునాపంతుల (లలిత సంగీతం), బి.వి.దుర్గాభవాని (శాస్త్రీయ సంగీతం), గిద్దె రామనర్సయ్య (జానపద గాయకులు), ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి (జానపద కళలు), గోవిందరాజు చక్రధర్ (పత్రికా రచన), కె.వీణారెడ్డి (ఉత్తమ రచయిత్రి), ఆచార్య కె.లావణ్య (ఉత్తమ రచయిత్రి), డా. బిహెచ్.పద్మప్రియ (ఉత్తమ నటి), మేకా రామకృష్ణ (ఉత్తమ నటుడు), డా. వెంకట్ గోవాడ (పద్యరచన), పి.ఉమామహేశ్వర పాత్రుడు (ఆంధ్రనాట్యం), డా. కె.రత్నశ్రీ (కూచిపూడి నృత్యం), టి.శోభనాద్రి (వ్యక్తిత్వ వికాసం), బి.సాంబశివరావు (హేతువాద ప్రచారం), డా.ఎస్.యాదగిరి (గ్రంథాలయ సమాచార విజ్ఞానం), ఎస్.సుభాషిణి (గ్రంథాలయకర్త), కమలాకర భారతీదేవి (సాంస్కృతిక సంస్థా నిర్వహణ), కుమారి జి.రమ్యశ్రీ (ఇంద్రజాలం), నెల్లుట్ల వెంకటరమణ రావు (కార్టూనిస్ట్), డా. పి.కల్పవల్లి (జ్యోతిషం), పురిమళ్ల సునంద (ఉత్తమ ప్రధానోపాధ్యాయులు), డా. కె.శ్రీనివాసాచారి (చిత్రలేఖనం), కుంట సదయ్య (జానపద కళలు) తదితరులు పురస్కారాలు అందుకున్నారు.

పార్కు స్థలం కాపాడాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: కోట్లు విలువచేసే పార్కు కబ్జాను అడ్డుకోవాలని కమిషనర్‌కు ఓం విహార్ కాలనీ వాసులు బుధవారం ఉదయం వినతి పత్రం అందజేశారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓం విహార్ కాలనీలో సుమారు 700 గజాల స్థలాన్ని పార్కు పక్కనే నివసిస్తున్న ప్రతాప్ సింగ్ కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు గుండెబోయిన అయోధ్య యాదవ్, బుచ్చిరెడ్డి, మాట్లాడుతూ 2018లో ఏర్పాటు చేసుకున్న కమిటీలో తాను అధ్యక్షునిగా కొనసాగుతూ ఇప్పటివరకు కమిటీ నిబంధనల ప్రకారం ఎలాంటి నిబంధనలు పాటించకుండా, కమిటీ సభ్యులను సంప్రదించకుండా తానే అధ్యక్షున్ని అంటూ కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేస్తూ ఉన్నాడు. గతంలో ఇదే కాలనీ పార్కు స్థలాన్ని కాపాడాలని అతనే మున్సిపల్ అధికారులకు వినతి పత్రం ఇచ్చి. ఇప్పుడు తానే కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడు. పార్కు స్థలం తనకు దక్కకపోవడంతో కోర్టులను ఆశ్రయిస్తున్నాడని మండిపడ్డారు. ఓం విహార్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌గా ఉన్న కమిటీని రద్దుచేసి తాము కాలనీవాసుల అందరి సమక్షంలో నూతన కమిటీ ఓం విహార్ వెల్ఫేర్ అసోసియేషన్‌గా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. పార్కు కబ్జా అడ్డుకుంటున్న కాలనీలోని కొంతమంది సభ్యులను కులం పేరుతో దూషించడం, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో స్థానిక మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. దానికి స్పందించి నేను మీపై వేసిన హైకోర్టులో ఉన్న కేసును వాపసు తీసుకుంటాను, మీరు నాపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని ఒప్పంద పత్రాన్ని కూడా రాసుకున్నాడు. అయినా ప్రేమ్ సింగ్ ప్రవర్తనలో మార్పు రాకుండా కాలనీ ప్రజలను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతూ ఉన్నాడు. దీనిపైన అధికారులు దృష్టి సారించి అతనిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సంగారెడ్డి, వీరారెడ్డి, బిక్షపతి గౌడ్, కొండలరావు, శ్రీనాథ్ గౌడు, నరసింహమూర్తి, కాలనీవాసులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవుపల్లి డివిజన్ కాటేదాన్ భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేదలపై పన్ను భారం పడకుండా జీఎస్టీ తగ్గించడంతో తగ్గింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి దేశ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పన్ను భారం తగ్గించడంతో సామాన్యులకు లబ్ధి ఎలా చేకూరతుందో వివరించడంలో భాగంగా పాదయాత్ర చేస్తూ దుకాణాలో కిరాణా షాప్, జీఎస్టీ తగ్గించడంతో చేకూరిన ప్రయోజనాలను షాపు ఓనర్స్‌కి అవగాహన కల్పిస్తూ వివరించడం జరిగింది. నరేంద్ర మోడీ ధైర్యం చూసి మూడేళ్లు జీఎస్టీపై అధ్యయనం చేసి పేదలకు ధరలు అందుబాటులో ఉండేలా చేశారు అని పేర్కొన్నారు. ఒకప్పుడు సెల్ ఫోన్లు ఏసీలు కార్లు ఏవి కావాలన్నా ఇతర దేశాల నుంచి తెచ్చుకునే వాళ్ళం మోడీ వచ్చిన తర్వాత మన యువశక్తి మేధా సంపత్తులను వినియోగించుకుని మేకిన్ ఇండియా - మేడ్ ఇన్ ఇండియా అని నినాదానికి పరిమితం కాకుండా ఇక్కడే అన్ని వస్తువులు తయారు చేసే విధంగా మార్చారన్నారు. 11 ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ నాలుగో ఆర్థిక వ్యవస్థగా వచ్చింది అన్నారు. ఇది మూడో ఆర్థిక వ్యవస్థగా వ్యవస్థగా ఎదగాలని మోడీ కలలు కంటున్నారని అన్నారు. పార్టీ నాయకులు శ్రీధర్, మల్లేష్ యాదవ్, జోగి రవి, రావుల భాస్కర్, బుచ్చిరెడ్డి, కొమురయ్య సంతు గౌడ్, జనార్దన్ తలారి చిన్నా, శ్రీకాంత్ రెడ్డి, అడికే మహేందర్, అడికే రాజు, ఉడుత లక్ష్మి, అంజమ్మ, వినయ్ రెడ్డి, మజర్ ప్రభుదాస్, వెంకట రమణ గుప్తా, ఎన్ను శంకర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నరసింహ రెడ్డి, గోపాల్ నాయక్, ఏల్‌వి రెడ్డి, హనుమంత్ రెడ్డి, కుర్మయ్య, షకీల్, సచిన్ శివ, ఉత్తం యాదగిరి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండాలంటే ఊపిరితిత్తులను కాపాడుకోవాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ముఖ్యంగా ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉండాలి. మనిషి జీవనంలో ఊపిరి ఉంటేనే మనుగడ కొనసాగుతుంది. మన ఊపిరితిత్తులు శరీరానికి ఆక్సిజన్ ఇచ్చే ముఖ్యమైన అవయవాలు. గాలిలో ఉన్న ధూళి, పొగ, కలుషిత పదార్థాలు, బ్యాక్టీరియా, వైరసులు నేరుగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతాయి. ప్రపంచంలో సుమారు 90శాతం మంది కలుషితమైన గాలిని పీలుస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా చేసిన మనిషి ఆరోగ్య ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందుకనే ప్రతి ఒక్కరికీ ఊపిరితిత్తుల గురించి అవగాహన ఉండాలి. అందుకే ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న అంతర్జాతీయ ఊపిరితిత్తుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ దినోత్సవాన్ని 2019లో ప్రారంభించారు. ఈ సంవత్సరం థీమ్ "ఆరోగ్యంగా ఉండాలంటే, ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉండాలి. ఆస్తమా, సీఓపిడి, క్షయ వ్యాధి (టీబీ), ఊపిరితిత్తుల క్యాన్సర్ లాంటి వ్యాధులు చాలా మందిని బాధిస్తుంటాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ వల్ల ప్రపంచంలోనే అత్యధికంగా మరణాలకు దారితీస్తున్న క్యాన్సర్. హైదరాబాద్‌లో చాలా వాయి కాలుష్యం వల్ల అనేక మంది తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యలతో ఓపికి వస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా రోగుల సంఖ్య నానాటికి పెరుగుతూనే ఉంది. ఫ్యాక్టరీలలో పని చేసే వారు నేరుగా కలుషితమైన గాలిని పీల్చుతున్నారు. కావున వారు పని చేస్తున్న ప్రాంతంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పిల్లలకు స్వచ్ఛమైన గాలి అందడం లేదు. కాబట్టి చిన్నారులను ఖచ్చితంగా పార్కులకు తీసుకువెళ్లాలి.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-దుండిగల్: పేదల వైద్య సేవలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గనికి చెందిన పలువురు ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన కుంచపు లక్ష్మి, ఎర్రోళ్ళ ఈశ్వరమ్మ, మల్లేశ్వరి, రవి కుమార్ గత నెల మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ముఖ్య మంత్రి సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లో తన నివాసం వద్ద రెండు లక్షల పదివేల రూపాయల సిఎంఆర్‌ఆఫ్ చెక్కులను ఆయన చేతుల మీదగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సిఎంఆర్‌ఆఫ్ నిరుపేదలకు అండగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక కృషితో నియోజకవర్గంలో ప్రజాపాలన ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. టిపిసిసి మాజీ కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి, మహమ్మద్ చాంద్ పాషా, సంజీవ్, రవి గుప్తా, చోటు, నరేంద్ర సింగ్, నాయక్, రఘు గౌడ్, లబ్ధిదారులు, నియోజకవర్గం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత హి సేవ'లో భాగస్వామ్యం కావాలి

విశాలాంధ్ర-దుండిగల్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ "స్వచ్ఛత హి సేవ" కార్యక్రమంలో భాగంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని దుండిగల్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులో హోమ్ స్టేటెడ్ మొక్కలను మహిళా గ్రూపు సభ్యులచే ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, మహిళా గ్రూప్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలబాలికల ఆత్మరక్షణకు కుంగ్‌ఫు కరాటే దోహదం

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: న్యూ పవర్ కుంగ్ ఫు నంది అవార్డు గ్రహీత రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ అహ్మద్ ఖాన్ మాస్టర్, కరాటే మాస్టర్ శివక్రిష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ హీరో సుమన్‌ను కలిసిన విద్యార్థి, విద్యార్థినిలు, మాస్టర్లు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీ హీరో సుమన్ చేతుల మీదుగా విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. హీరో సుమన్ మాట్లాడుతూ బాలబాలికలకు కుంగ్ ఫు, కరాటేలు ఆత్మ రక్షణకై ఎంతో ఉపయోగపడతాయని, మానసిక శారీరక ఉల్లాసాన్ని ఉత్తేజాన్ని కలిగిస్తుందని విద్యార్థులకు తెలియజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ కరాటే, కుంగ్ ఫు తమ పిల్లలకు నేర్పించడానికి ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ నంది అవార్డు గ్రహీత మాస్టర్ అహ్మద్ ఖాన్ (బ్రూస్ లీ), జపాన్ కరాటే మాస్టర్ శివక్రిష్ణ గౌడ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - కొత్తూరు: ఈనెల 26న హలో జర్నలిస్టు, చలో కందుకూరు పేరుతో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల కేంద్రంలోని శుభం గార్డెన్‌లో నిర్వహించే టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సంగెం ఆంజనేయులు గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కొత్తూరు మున్సిపల్ కేంద్రంలో ఆంధ్ర జ్యోతి సీనియర్ విలేఖరి భవాని వేణుగోపాల్‌తో పాటు పలువురు విలేకరులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులందరూ ఐకమత్యంగా ఉంటే తమ హక్కులను సాధించుకోవచ్చని అన్నారు. ఈ మహా సభలో జర్నలిస్టుల హక్కులు, సమస్యలు, భవిష్యత్తు సంక్షేమ పథకాలు, ఇళ్ల స్థలాలు, నైతిక విలువల పరిరక్షణ, భద్రత పై చర్చించనున్నట్టు వివరించారు. అందుకు జర్నలిస్టులందరం చేయి చేయి కలుపుదాం, ఐకమత్యాన్ని చాటుదాం, సభలను విజయవంతం చేద్దాం, తమ హక్కులను సాధించుకుందామని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు భూషమోని రమేష్, జిల్లా ప్రచార కమిటీ సభ్యులు జవ్వాజి మధుసూదన్ గౌడ్, అంబటి కిరణ్, జాండగూడెం శ్రీనివాస్ గౌడ్, బంటారం బాలరాజు గౌడ్, విష్ణుకుమార్ గౌడ్, ఆనంద్ గౌడ్, మాజీద్, సందీప్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: మున్సిపల్ కార్మికులకు జిఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించా లని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జె. రుద్రకుమార్ కోరారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూని యన్ సిఐటియు మొయినాబాద్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ ఆఫీస్ ముందు మున్సిపల్ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జె.రుద్రకుమార్, అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ మొయినాబాద్ మున్సిపల్ ఏర్పడి దాదాపు 9 నెలలు గడుస్తున్న కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించడంలో మొయినాబాద్ మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కార్మికులకు మున్సిపల్ చట్టాల ప్రకారం వేతనాలు, యూనిఫార్మ్, గుర్తింపు కార్డులు తదితర బెనిఫిట్స్ అన్ని కల్పించాలన్నారు. లేనిపక్షంలో విధులు బహిష్కరించి నిరవధికంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మొయినాబాద్ మండల కన్వీనర్ సిహెచ్. ప్రవీణ్ కుమార్, సిఐటియు ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ అజీజ్ నగర్ అధ్యక్షులు డప్పు మహేందర్, సిఐటియు నాయకులు మేకల అశోక్, నాగేష్ గౌడ్, మున్సిపల్ యూనియన్ నాయకులు రత్నం, సుధాకర్, సురేష్, కొమ్ము, కృష్ణ, జగన్, ఏసు, నరసింహ, వెంకటేష్, ప్రమీల, కృష్ణవేణి, మైసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు కొలను పూజలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: కనకదుర్గ అమ్మవారి అనుగ్రహం ప్రజలం దరిపై ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. విజయదశమి మహోత్సవంలో భాగంగా మూడవరోజు ప్రత్యంగిరా దేవి అమ్మవారు అనుగ్రహిస్తుంది. దేవి అమ్మవారి ప్రత్యేకత భక్తులందరినీ కూడా చక్కని అనుగ్రహంతో ఆశీర్వదిస్తుంది. ఈ అలంకారంలో అమ్మవారు సింహాసనంపై కూర్చుని ఉంటుంది. అమ్మను దర్శించుకున్నట్లయితే ఋణ బాధ నివారణ, ఉద్యోగ లాభమునకు స్థిరాస్తి అభివృద్ధి దుష్టశక్తి భయ నివారణ అష్టైశ్వర్య భోగభాగ్యాలు, రాజకీయ పదవీ ప్రాప్తి కలుగును కావున ఆలయ ధర్మకర్త, కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కొలన్ నరసింహారెడ్డి వారి సతీమణి పద్మమ్మ నిజాంపేట్‌లో వెలసినటు వంటి కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం నందు ప్రత్యంగినీ దేవి హోమంలో పాల్గొని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలుకు ఋణ బాధ నివారణ, ఉద్యోగ లాభం, స్థిరాస్తి అభివృద్ధి ప్రాప్తి కలగాలని అమ్మవారిని వేడుకున్నారు. ప్రసాదాలతో మంగళ తోరణాల వాయిద్యాలతో అమ్మవారి విజయదశమి మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. కొలన్ భద్రారెడ్డి, బొర్రా అశోక్, రాజమోహన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నిజాంపేట్ గ్రామ పెద్దలు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రాజకీయ నివేదికపై కమిషన్ సమావేశం

నిర్మాణ నివేదికపై కమిషన్ చర్చలు

సమీక్షా నివేదికపై కమిషన్ భేటీ

మహాసభలో ప్రసంగిస్తున్న శ్రీనివాసరెడ్డి, బొమ్మగాని ప్రభాకర్, డాక్టర్ రజనీ

మాట్లాడుతున్న రావుల వెంకయ్య

పంజాబ్ కళాకారుల నృత్య ప్రదర్శన

మహాసభకు హాజరైన మహిళా ప్రతినిధులు

మహాసభలో తెలుగురాష్ట్రాల ప్రతినిధులు

విద్యుత్‌రంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకం

విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి: సీపీఐ

(చండీగఢ్ నుంచి ఏబీ కూన)

మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారతదేశంలోని యావత్ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడమే లక్ష్యంగా విద్యుత్ (సవరణ) బిల్లు తీసుకురావడానికి నిరంతరాయంగా ప్రయత్నిస్తూనే ఉందని, విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు పూర్తిగా వ్యతిరేకమని సీపీఐ స్పష్టం చేసింది. ఈ మేరకు సీపీఐ 25వ జాతీయ మహాసభల్లో ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ బిల్లు పూర్తిగా ప్రజావ్యతిరేకం, వినిమయదారులకు వ్యతిరేకం, ఉద్యోగులకూ వ్యతిరేకం, అలాగే రాష్ట్రాలూ దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. సర్వం వ్యతిరేకత ఉన్నా... మోదీ ప్రభుత్వం తొలిసారిగా 2014లో ఈ విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. వామపక్షాలతోపాటు విద్యుత్ రంగ కార్మికులంతా దీన్ని వ్యతిరేకించారు. ఈ బిల్లును ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవడానికి ఉద్యోగులు, ఇంజినీర్లు అదే ఏడాది సమ్మెకు దిగారు. అదానీ, అంబానీ, టొరెంట్, టాటా వంటి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం విద్యుత్ శాఖ వరుసగా 2014, 2018, 2020, 2022లో ఈ బిల్లును ప్రవేశపెడుతూనే ఉంది. ఏఐటీయూసీ, సంయుక్త కిసాన్‌మోర్చా, విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్ల జాతీయ సమన్వయ కమిటీ ఈ బిల్లు రాకుండా అన్నిస్థాయిల్లో ఆందోళన చేపట్టాయి. వినియోగదారుల సంఘాలు సైతం దీన్ని తప్పుబట్టాయి. చివరకు ఈ బిల్లును ఆమోదించకుండా స్థాయీసంఘానికి పంపించిన మోదీ సర్కారు...తక్షణమే ఈ బిల్లును పూర్తిగా ఉపసంహరించుకోవాలని సీపీఐ తన తీర్మానంలో డిమాండ్ చేసింది.

యూపీ ఉద్యోగుల దీర్ఘకాల ఆందోళనకు మద్దతు

ఉత్తరాంచల్ అండ్ దక్షిణాంచల్ విద్యుత్ నిగమ్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 295 రోజులుగా ఆందోళన చేస్తున్న ఉత్తరప్రదేశ్ విద్యుత్ కార్మికులు, ఇంజినీర్లకు సీపీఐ మద్దతు పలికింది. చండీగఢ్ విద్యుత్ సంస్థను కైవసం చేసుకున్న గొయెంకా కంపెనీకే యూపీ విద్యుత్‌ను కూడా కట్టబెట్టాలన్నది ప్రభుత్వ ప్రయత్నం. అందుకే సీపీఐ దీన్ని వ్యతిరేకిస్తున్నది. ఇదొక్కటే కాదు... అదానీ పవర్ ముంబైకి ప్రయోజనం చేకూరేలా 33 లక్షల కోట్ల రూపాయల మొత్తానికిగాను ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రూ.50,000 కోట్ల కాంట్రాక్ట్‌లు అప్పగించారు. ఈ మధ్యనే బీహార్‌లోని ఎన్‌డీఏ ప్రభుత్వం భాగల్‌పూర్‌లో 1050 ఎకరాల భూమిని అదానీ పవర్‌కు కేవలం ఒక రూపాయి అద్దెకు సమర్పించింది. విద్యుత్ ప్రైవేటీకరణ చర్యలను వ్యతిరేకించే ఆందోళనలన్నింటికీ సీపీఐ తోడ్పాటు ఉంటుందని మహాసభ ప్రకటించింది.

రక్షణ ఉత్పాదక రంగం ప్రైవేటీకరణను తిప్పికొట్టాలి

దేశ స్వావలంబన, జాతీయ భద్రతను పణంగా పెట్టి రక్షణ ఉత్పాదక వ్యవస్థను ప్రైవేటీకరించడానికి కేంద్రంలోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపిత మోదీ ప్రభుత్వ చర్యలను తిప్పికొట్టాలని సీపీఐ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ 25వ జాతీయ మహాసభల్లో ఏకగ్రీవ తీర్మానం చేసింది. దేశ రక్షణ కోసం ఉపయోగించే వ్యవస్థల ఉత్పాదక రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వల్ల భద్రతకే ముప్పు వాటిల్లుతుందని, దేశం పూర్తిగా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుందని సీపీఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఒకప్పటి సోవియట్ యూనియన్ భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ఏర్పాటుకు, కొత్త ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు, ప్రభుత్వ రంగ రక్షణ పరిశ్రమలను నెలకొల్పడానికి దోహదపడిందని గుర్తుచేసింది. కానీ ఇప్పుడు బీజేపీ రక్షణ రంగంలో పూర్తిగా ప్రైవేటు విధానాన్ని తీసుకువచ్చిందని తెలిపింది. 2025-26 రక్షణ బడ్జెట్ రూ.6,81,210.27 కోట్లు ఉండగా, అందులో రూ.1,80,000 కోట్ల బడ్జెట్ (26.43%) రక్షణ పరికరాల సేకరణ కోసం ఉద్దేశించిందని పేర్కొంది. బీజేపీ ప్రభుత్వం రక్షణ రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐకి బార్లా తలుపులు తెరిచిందని, అదానీ గ్రూప్ ఇప్పటికే వివిధ ఆయుధ ఫ్యాక్టరీలను నిర్మించిందని తెలిపింది. ఈ చర్యలను తక్షణమే ఎదుర్కోవాలని ఇతర పార్టీలు, భావసారూప్య సంఘాలకు విజ్ఞప్తి చేసింది. వీటిని ప్రతిఘటించడానికి ఆయుధ కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికులతో సహా ప్రజలంతా కలిసిరావాలని పిలుపునిచ్చింది.

బీహార్‌కు కేంద్రం ఎన్నికల వరాలు

న్యూఢిల్లీ: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌పై కేంద్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. రాష్ట్రంలో సుమారు రూ.6వేల కోట్ల విలువైన రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. దీంతో పాటు దేశవ్యాప్తంగా వైద్యవిద్య (పీజీ, యూజీ) సీట్ల పెంపునకు పచ్చ జెండా ఊపింది. అలాగే రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనాన్ని బోనస్‌గా ఇవ్వాలని నిర్ణయించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. బీహార్‌లో రైల్వేకు సంబంధించి రూ.2192 కోట్లతో భక్తియార్‌పుర్-రాజ్‌గిర్-తిలయ్యా డబ్లింగ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇక సాహెబ్‌గంజ్-అరెరాజ్-బెతియా మధ్య రూ.3822 కోట్లతో 78.9 కి.మీ నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుతో రాజధాని పట్నా-బెతియా మధ్య కనెక్టివిటీ మెరుగుపడుతుందని వెల్లడించింది. వీటితోపాటు దేశీయ నౌకా నిర్మాణం, సముద్ర రంగాల పునరుజ్జీవనానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.69,725 కోట్ల ప్యాకేజీకి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలను బలోపేతం చేయడంలో భాగంగా కేంద్ర కేబినెట్ మరో నిర్ణయం తీసుకుంది. కొత్తగా 5వేల పీజీ సీట్లకు ఆమోదం తెలిపింది. వీటితోపాటు కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం మూడో దశలో 2028-29 నాటికి ఇప్పటికే ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 5023 ఎంబీబీఎస్ సీట్లను పెంచాలని నిర్ణయించింది. ఈ పథకం అమలుకు సంబంధించి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పూర్తి మార్గదర్శకాలు జారీ చేయనుంది. తాజా మార్పులతో దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్లు 1,18,190కి, పీజీ సీట్లు 74,306కి చేరుకుంటాయి. రైల్వే ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదకత ఆధారిత బోనస్ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో 10.91 లక్షల మంది ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది. బోనస్ గా రూ.1866 కోట్ల చెల్లింపులకు ఆమోదం లభించింది. ఈ బోనస్ ను దీపావళికి ముందు రైల్వే ఉద్యోగులకు చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రతి ఏడాది ఇస్తున్న ఈ బోనస్ ను ఈ ఏడాది కూడా కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. రైల్వే సిబ్బంది కృషితో ఆర్థిక ప్రగతిలో పెరుగుదల సాధ్యమైందని ప్రభుత్వం అభిప్రాయపడింది. నాన్ గెజిటెడ్ కేటగిరీలోని ఒక్కో ఉద్యోగికి రూ.17,951 వరకు బోనస్ గా అందనుంది.

దళితులపై అత్యాచారాలు అదుపుచేయాలి

భావసారూప్య పార్టీలు, సంఘాలతో ప్రచారోద్యమం: సీపీఐ

చండీగఢ్: దేశంలో అస్పృశ్యత, వివక్ష, దళితులపై అత్యాచారాలు ఏదోఒక రూపంలో కొనసాగుతున్నాయని, మోదీ ప్రభుత్వ పాలనలో ఈ తరహా అరాచకాలు మరింత పెరిగాయని సీపీఐ ఆవేదన వ్యక్తం చేసింది. దళితులపై అత్యాచారాలు పూర్తిగా రాజ్యాంగ ఉల్లంఘన, సభ్య సమాజానికి అవమానమని అభివర్ణించింది. ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రిత బీజేపీ పాలనలో మనుస్మృతిని చట్టబద్ధంగా అమలు చేసే వినూత్న పోకడ, ప్రమాదకరమైన ధోరణి తలెత్తిందని పేర్కొంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లింగ వివక్ష, పనికార్మికుల హక్కుల హననం, పుట్టుక ఆధారంగా అసమానత, వర్ణాశ్రమ ధర్మం వంటి మనుస్మృతి ఆచారాలు పెరిగాయని, దళితులపై అత్యాచారాలను, దాడులను తక్షణమే ఆపాలని కోరుతూ సీపీఐ 25వ జాతీయ మహాసభ తీర్మానించింది. 2020లో యూపీలో దళితులపై 12,714 దాడులు జరిగాయని, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఒడిశాలో వేలాది దాడులు జరిగినట్లు జాతీయ నేర నివేదికలు వెల్లడించాయని తెలిపింది. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొత్తంగా దేశంలో ఏటా దాడులు పెరుగుతూనే ఉన్నాయని, 2015లో 38,613 దాడులు జరగ్గా... 2020లో 50,202 దాడులు జరిగాయి. రాజ్యాంగంలోని 15, 17 అధికరణలను ఉల్లంఘించే ఘటనలు విపరీతంగా పెరగడం ఆందోళనకరమైన అంశం. దళితులపై అత్యాచారాలు ఇదేస్థాయిలో కొనసాగితే... వారికి జీవించే హక్కు సైతం దూరమైపోతుందని తెలిపింది. ఇటీవల కాలంలో జరిగిన వివిధ దాడులను సీపీఐ తన తీర్మానంలో ప్రస్తావిస్తూ, ఈ దాడులకు పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, భావసారూప్యత గల పార్టీలు, సంఘాలతో కలిసి ప్రచారోద్యమం చేపడతామని సీపీఐ పేర్కొంది. బాధితులకు రక్షణ కల్పించడానికి తమ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని వెల్లడించింది.

భారత సమాఖ్య వ్యవస్థకు ముప్పు

భారత్ విభిన్న రాష్ట్రాలతో కూడిన సమాఖ్య వ్యవస్థ గల దేశమని, అయితే బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత 11 ఏళ్లలో రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ... కేంద్రీకృత విధానాలతో నియంతృత్వ వ్యవస్థను నెలకొల్పేందుకు కుట్రపూరిత ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీన్ని ఎదుర్కొనేందుకు భావసారూప్యత గల పార్టీలు ఏకతాటిపైకి రావాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ 25వ జాతీయ మహాసభల్లో తీర్మానం చేసింది. రాజ్యాంగం కల్పించిన భారత సమాఖ్య వ్యవస్థను సంఘ్‌పరివార్ నాయకులు అంగీకరించడం లేదని గవర్నర్ల అరాచక విధానాలు చూస్తే అర్థమవుతున్నదని పేర్కొంది. గవర్నర్లను అడ్డం పెట్టుకొని బీజేపీయేతర రాష్ట్రాలను కేంద్రం వేధిస్తున్నదని, ఆర్థిక కమిషన్‌తోపాటు కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల వాటా ఇవ్వడం లేదని తెలిపింది. కేంద్ర ప్రాయోజిత పథకాలను రాష్ట్రాల కోసం ప్రకటిస్తూనే... పూర్వ పథకాలను పూర్తిగా నీరుగారుస్తూ ఏకపక్షంగా వాటిని రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించింది. కార్మిక చట్టాలను రద్దుచేసి... వాటి స్థానంలో ఏకపక్షంగా లేబర్‌కోడ్‌లు తీసుకువచ్చి, వాటిని రాష్ట్రాలు అమలు చేయాల్సిందేనని బలవంతపు చర్యలకు పాల్పడుతున్నదని, ఏకభాష విధానాన్ని సైతం రాష్ట్రాలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నదని పేర్కొంది. ఇవన్నీ ఫాసిస్టు చర్యలకు నిదర్శనమని, తక్షణమే వీటిని ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని సీపీఐ అభిప్రాయపడింది.

ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి

గ్రామీణ ప్రాంతంలో కార్మికులకు ఉపాధి కల్పించే సదుద్దేశంతో యూపీఏ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) ప్రస్తుత మోదీ ప్రభుత్వ హయాంలో నీరుగారిపోతున్నదని సీపీఐ 25వ జాతీయ మహాసభలు ఆందోళన వ్యక్తం చేశాయి. చారిత్రాత్మకమైన ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ తీర్మానం చేసింది. చట్టబద్ధమైన కనీస వేతనాల కన్నా తక్కువ వేతనాలు చెల్లించడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, సంబంధిత రాష్ట్రాల్లో చట్టబద్ధమైన కనీస వేతనాలకు సమానంగా ఉపాధి హామీ పథకం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేసింది. అలాగే, రోజుకు కనీసం రూ.800 చొప్పున వేతనంతో యేటా 200 పనిగంటలు ఉపాధి కల్పించాలని, నరేగా పథకం సక్రమ అమలుకు అవినీతిని కఠినంగా అదుపు చేయాలని కోరింది. అంతేగాకుండా, పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని కూడా సీపీఐ డిమాండ్ చేసింది.

రాజధాని అమరావతిలో 85 అభివృద్ధి పనులు

మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజధాని నిర్మాణ పనుల్లో ప్రస్తుతం 10 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శాసన సభలో అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అమరావతిలో సీఆర్‌డీఏ నుంచి 21 పనులు, ఏడీసీ నుంచి 64 పనులు జరుగుతున్నాయని అన్నారు. అమరావతిలో అడవిలా పెరిగిన చెట్లను తొలగించేందుకే దాదాపు రూ.30 కోట్లు ఖర్చు పెట్టాల్సి వచ్చిందని మంత్రి తెలిపారు. రాజధానిలో ట్రంక్ రోడ్లు, లే అవుట్ రోడ్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్జీల బంగ్లాలు, అధికారులు, ఉద్యోగుల నివాసాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, మార్చి 31 నాటికి 3,500 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. 2019కి ముందు పనులు చేసిన కొందరు కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంపై ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రశ్నించారు. పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం... చిన్న కాంట్రాక్టర్ల విషయంలో తేడా ఎందుకు చూపుతోందని అడిగారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపును పరిశీలిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. గతంలో పనులు చేసిన కొందరు కాంట్రాక్టర్లు ఇప్పుడు ముందుకు రాకపోవడంతో మళ్లీ టెండర్లు పిలవాల్సి వచ్చిందన్నారు. హడ్కో ప్రపంచ బ్యాంకు ద్వారా రాజధాని నిర్మాణానికి రుణాలు తీసుకున్నామని, పనులు ప్రణాళికబద్ధంగా జరుగుతున్నాయని వివరించారు. పనులు పూర్తయ్యాక ప్రధానిని ఆహ్వానించి ప్రారంభోత్సవం చేస్తామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస పురపాలక సంఘంలో అమృత్ 2 పథకంలో పెద్ద ఎత్తున జరిగిన అవినీతిపై ఎమ్మెల్యే కూన రవికుమార్ సభ దృష్టికి తెచ్చిన విషయంపై మంత్రి నారాయణ సమాధానమిస్తూ... ఆముదాలవలసలో అమృత్-2లో భాగంగా అక్రమాలు జరిగింది నిజమేనని తెలిపారు. కట్ట నిర్మాణ పనులతో పాటు మరికొన్నింటి విషయంలో నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. కమిటీ నివేదిక వచ్చిందని, దాని ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

రెండు కీలక బిల్లులకు ఆమోదం

ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం రెండు బిల్లులకు ఆమోద ముద్ర పడింది. ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారటీ సవరణ బిల్లుతో పాటు గ్రామ, వార్డు సచివాలయం చట్ట సవరణ బిల్లులకు ఆమోదం తెలిపింది. సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించిన చట్ట సవరణ బిల్లును మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

చేనేతలకు యూనిఫాం ఆర్డర్లు

- సాధ్యాసాధ్యాలపై ఎమ్మెల్యేలతో వర్కింగ్ గ్రూప్
- శాసనసభ్యులంతా వీవర్స్‌శాలను అధ్యయనం చేయాలి
- అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: చేనేత సొసైటీలకు యూనిఫాం తయారీ ఆర్డర్ ఇచ్చే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు శాసన సభ్యులతో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. బుధవారం ఐదోరోజు అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల్లో భాగంగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ... గతంలో ఆప్కోకు ఆర్డర్ ఇస్తే సొసైటీలు సకాలంలో యూనిఫాం సరఫరా చేయలేకపోయారు. చేనేతలను ప్రోత్సహించే అంశంపై గతంలో కూడా చర్చలు జరిగాయి. అయితే ఇందుకోసం నిర్మాణాత్మక మార్పు రావాలి. ప్రభుత్వ టెండరులో సొసైటీలు ఎలా పోటీ పడాలనే విషయాన్ని పరిశీలించాల్సి ఉంది. దాదాపు 50 నియోజకవర్గాల్లో చేనేతలు ఉన్నారు. యూనిఫాం విషయంలో మార్కెట్ ధరల పోటీని ఎలా ఎదుర్కోవాలనే విషయమై సభ్యులందరం కూర్చుని మాట్లాడాలి. ఇందుకోసం నలుగురైదురు సభ్యులతో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేస్తాం. చేనేత వృత్తిని అందరం కలసికట్టుగా కాపాడాలి. అదే సమయంలో సరైన విధంగా సరఫరా జరిగేలా కూడా చూడాలి. అందరం కలసి చర్చిస్తే శాశ్వతమైన పరిష్కారం లభిస్తుంది. అంకితభావంతో చేనేతలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైన ఉంది. చేనేతలను ప్రోత్సహించేందుకు మంగళగిరి నియోజకవర్గంలో నిర్మాణాత్మకంగా కృషి చేస్తున్నాం. మంగళగిరిలో వీవర్స్ శాల ద్వారా చేనేత కార్మికులకు 40 నుంచి 50 శాతం ఆదాయం పెంచామని మంత్రి లోకేశ్ చెప్పారు. డిజైన్లు, మార్కెటింగ్ పై టాటా టనేరాతో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. సభ్యులు సమయం ఉన్నప్పుడు వీవర్స్ శాలను సందర్శించి, చేనేతలకు మెరుగైన ఉపాధి, ఆదాయం వచ్చేలా మార్కెట్ లింక్ చేసే అంశాన్ని అధ్యయనం చేయాలని కోరారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.